


పత్రిక
12-3-



"మధుమూవీస్ వర్ణచిత్రం"లో కాంచన.


ప్రతివారికీ
రక్షణ
కావాలి
CINTHOL
DEODORANT
LUXURY
TOILET POWDER
WITH G-11
(Hexachlorophene)
BY
Godrej
ఈ రక్షణ బాక్టీరియానుండి, చెమట
వాసననుండి—మీరు, ఇతరులు
సంకోచపడే అవస్థనుండి—
జి-11 (హెక్సాక్లోరోఫిన్)తో
కూడిన
సింథాల్ టాయిలెట్ పౌడరు
మీకు రక్షణలన్నీ ఇస్తుంది.
ఇవేకాదు—సువాసన...
మనసుగంధము..
సింథాల్—
దుర్గంధములనుండి
సంపూర్ణ రక్షణనిచ్చు
టాయిలెట్ పౌడరు

ఉత్తరాలు

ముగ్గురు మూర్ఖులు

ముగ్గురు మూర్ఖులు శీర్షిక గురించి విమర్శించి వ్రాసిన కావలి పాటకుని ఉత్తరం చదివి [చూసి.] నేను ఎంతగానో బాధ పడ్డాను. కావలి పాటకుడన్నట్లు ముగ్గురు మూర్ఖులు శీర్షిక ఇందిరాగాంధిని దుయ్యబరచడానికి కాదని, గిట్టని వారిపై చెడుగా వ్రాయడం కూడా కాదని నా అభిప్రాయం. ముగ్గురు మూర్ఖులు శీర్షిక ద్వారా చాలామంది పాటకులు ఎన్నో విషయాలను తెలుసుకొంటున్నారు. ఈవారం [లక్ష్మి ముఖచిత్రంతో వెలువడిన] సంచికనే చూస్తాం పాకిస్తాన్ దుండగులు యిద్దరు మన [భారత] దేశ విమానాన్ని బలవంతంగా మరల్చుకు పోయిరని, ఆ మరుల్చుకు పోయిన విమానాన్ని పాకిస్తాన్ వారు కాల్చివేసి నట్లు చాలామందికి తెలుసు. కాని, ముగ్గురు మూర్ఖులు శీర్షిక ద్వారా అమరల్చుకు పోయిన దుండగులు ఖురేషి అష్రఫ్ అని, మరియు యిటువంటి సంఘటన జరుగుతుందని 1970 సెప్టంబరు నెలలో కాశ్మీర్ పత్రికలో ప్రచురించారని ఖురేషి అష్రఫ్ అనువారు విమానం ఎక్కినప్పుడు ఖురేషి వద్ద పిస్తోలు అష్రఫ్ వద్ద హేండ్ గ్రేనేడ్ ఉందని చాలా మందికి తెలియదు. మరియు యిది మనప్రభుత్వం అనమర్ధత వలన జరిగిందని కూడా తెలియదు. యిలాంటి కొత్తకొత్త విషయాలు తెల్పుతున్న ముగ్గురు మూర్ఖులు శీర్షికను విమర్శించడం మంచిది కాదని నా అభిప్రాయం [ప్రార్థన]

జి. రామిరెడ్డి, [పోలిరెడ్డిపల్లి]

* * *

ముగ్గురు మూర్ఖులు నేను వరుసగా చదువుతున్నాను. అందరికి చదవవలసిన అవసరంగూడా వుంది. ముందు జరుగబోయే రాజకీయ సంఘటనలను ముందే వ్యాఖ్యానించి వ్రాస్తున్న శ్రీ మహేష్‌గారి మేధాశక్తికి నా జోహార్లు.

కేంద్రంలో అధికారంలో వున్న నాయకత్వం జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ, దేశాన్ని [అంటే ప్రపంచములోని పెద్ద ప్రజాస్వామ్యాన్ని] అప్రతిష్టల పాల్జేస్తూంటే, పత్రికలు చూస్తూ ఊరుకోవడము న్యాయం కాదు వారి మాటల్లోనూ చేతల్లోనూ ఉన్నలోపం ప్రజలకు తెలియపరచడం పత్రికల కనీస కర్తవ్యం. పత్రికలపై కంట్రోల్సు పెడితే అది పత్రికా స్వాతంత్ర్యాన్ని అరికట్టడమే అవుతుంది. అప్పుడు మనది ప్రజాస్వామ్య వ్యవస్థ ఎట్లా అవుతుంది?

యనమండ్ర వెంకట సూర్యనారాయణమూర్తి, [పార్వతీ పురం.]

* * *

ఉత్తరాలు

కథలు

జాలి కథలో అసందర్భాలు కనబడుతున్నాయి. ఉదాహరణకు కథలో సత్యన్నారాయణ రాత్రి 7 గం. తరువాత రేడియోలో క్రికెట్ కామెంటరీ చెపుతున్నట్లు భావించాడు.

సాయంత్రము మొదటి ఆట ప్రారంభించిన తరువాత క్రికెట్ కామెంటరీ ఎక్కడ నుంచి వినబడినదో అర్థము కావటము లేదు.

దూలం చంద్రకుమారి, దూలం అన్నపూర్ణ,
[బడుగువానిలంక]

* * *

మారని మనసులు కథ నామనస్సును బాగా ఆకర్షించింది. పిల్లల మమతను చక్కగా వెల్లడించిన రచయితకు అభినందనలు.

—యక్కలదేవర భాస్కరరావు, [మామిడికుదురు]

సీరియల్

గుళ్ళపల్లి సుందరమ్మగారి సీరియల్ అతని లక్ష్యంలో రఘు సుధపై చూపుతున్న ఆప్యాయత మరువరానిది

బి అన్నపూర్ణమ్మ, జగన్నాధ్, నాగరాజు, [అనంతపురం.

* * *

5—2—71 సంచికలో మల్లెలు — ఎర్ర గులాబీలు సీరియల్ చదివాను. రచయిత ప్రపంచంలో గల ఏడు వింతలలో ఒకటిగా పరిగణించబడుతూన్న తాజమహలు అని వ్రాసారు. కాని తాజమహల్ ప్రపంచంలో గల ఏడు వింతలు జాబితాలో లేదని ప్రస్తుతం వెలువడుతున్న జనరల్ నాలెడ్జి పుస్తకాలలో చదివాను.

షమ్మి, [హైదరాబాదు]

బాలచిత్ర కళాప్రదర్శనం

వెల్లటూరుకి [గుంటూరుజిల్లా, వయా తెనాలి] చెందిన నవరంగ్ చిత్రకళా నికేతన్‌వారు ఈ సంవత్సరం మేనెలలో అఖిలభారత స్థాయిలో బాల చిత్రకళ ప్రదర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు కార్యదర్శి శ్రీ వెల్లటూరి పూర్ణానంద శర్మగారు వ్రాస్తున్నారు.

పూర్తివివరాలకి వారికి వ్రాయవచ్చు [సం.]

ఆంధ్రసచిత్ర వారపత్రిక


వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
శుక్రవారం: 12—3—'71
శ్రీసాధారణనామ సం॥ ఫాల్గుణమాసం॥ పూర్ణిమ
సంపుటము: 64 సంచిక: 27
స్థాపితము:
1908
ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్
ఆంధ్రపత్రిక కార్యాలయము
4, తంబుచెట్టి వీధి, మద్రాసు-1
విడి ప్రతి వెల 40 పైసలు

పోస్టుద్వారా

సంవత్సర చందా	26 00
6 మాసముల చందా	13 00
3 మాసముల చందా	6 50


విషయానుక్రమణిక

ముఖచిత్రం
'సోమరిపోతు'లో జ్యోతిలక్ష్మి.


ప్రణాళిక ఆదాయము
నాకొంచెం వుంచవూ..?
ప్రణాళిక పాలనము
ప్రజలు
నాకు అందజెయ్యి!
ధరల పెరుగుదల
జీతాల పెరుగుదల
భలే! ఒకర్నొకరు చంపుకోండి
బంగ్లా కాంగ్రెసు
పశ్చిమ బెంగాల్లో
అపకారికి అపకారం!
పోలీస్

ముగ్గురు మూర్ఖులు

మహేష్



"తుగ్లక్"

■ 'మద్రాసులో 'తుగ్లక్' అనే పక్షపత్రిక ఉంది. ఆ పత్రిక తాలూకు తే 12-2-1971 దీ సంచిక కాపీలను మద్రాసు పోలీసులు తే 14-2-1971 దీని స్వాధీనం చేసికొన్నారు' అన్నాడు చంద్రరావు.

'ఎందుచేత?' అని ప్రశ్నించాడు చూడామణి.

'శ్రీరాముడు, కుమారస్వామి మొదలైన హిందూ దేవతలను అసభ్యంగా చిత్రించిన ఫోటోలను ఆ పత్రికలో ప్రచురించారట. ఆ ఫోటోలను చూసినట్లయితే హిందువుల మనస్సు బాధపడుతుంది అనే ఉద్దేశంతో మద్రాసు పోలీసులు 'తుగ్లక్' పత్రిక కాపీలను స్వాధీనం చేసికొన్నారు. తే 15—2—1971 దీని ఆ పత్రికమీద కేసు పెట్టారు.

'హిందువుల మనసుకు బాధ కలిగించకుండా ఉండేనిమిత్తం మద్రాసు పోలీసులు తీసికొన్నచర్య ప్రశంసనీయం. అయితే యింతకూ ఆ ఫోటోలు యెక్కడివి?'

'24—1—1971 వ తేదీన సేలంలో ద్రవిడకజగం నాయకుడు రామస్వామి నాయకర్ నాయకత్వాన మూఢవిశ్వాస నిర్మూలనసభ' జరిగింది. ఆ సభ సందర్భంలో జరిగిన ఊరేగింపులో హిందూదేవతలకు అవమానకరమైన పటాలను ప్రదర్శించారు శ్రీరాముడు, కుమారస్వామి విగ్రహాలను చెప్పులతో కొట్టారు. ఆ ఊరేగింపు ఫోటోలనే తుగ్లక్ పత్రిక ప్రచురించింది.

'ఒక ఊరేగింపు ఫోటోలను 'తుగ్లక్' పత్రిక ప్రచురించినందుకుగాను తమిళనాడు ప్రభుత్వం ఆ పత్రికమీద కేసుపెట్టింది, అనగానే నాకు ఒక రాజాకథ జ్ఞాపకానికి వచ్చింది.'

'ఏమిటి ఆకథ?' అని చిదంబరం ప్రశ్నించగా చూడామణి చెప్పడం ప్రారంభించాడు.

'ఒకప్పుడు,ఒకరాజుపల్లకీలో యెక్కడికో వెడుతున్నాడు. దారిలో అతనికి ఆకలివేసింది. పల్లకీలోనే ఉన్న అరటిపళ్లు రాజా తినడం ప్రారంభించాడు. అతను అరటిపళ్లు తిని తొక్కలు బయటకు విసిరివేస్తున్నాడు.

ఆ సమయంలోనే పల్లకీకి వెనుకగా ఒక సన్యాసి వస్తున్నాడు. అతనికికూడా ఆకలి వేసింది. తినడానికి తనవద్ద యేమీ లేదు. రాజా పారవేసిన అరటిపండు తొక్కలు అతనికి కనిపించాయి. సన్యాసికి బాగా ఆకలి వేయుడంవలన, అతను ఆ అరటిపండు తొక్కలను తీసుకొని తినడం ప్రారంభించాడు.

అరటిపండు తొక్కలను బయటకు పార వేస్తూ, రాజా ఒకసారి వెనుకకు తిరిగి చూశాడు. తాను పారవేసిన అరటిపండు తొక్కలను తింటున్న సన్యాసి రాజాకు కన్పించాడు. ఆ సన్యాసి చాలా వికారంగా ఉన్నాడు. ఆ సన్యాసిని చూడగానే రాజాకు చాలా కోపం వచ్చింది.

రాజా వెంటనే 'ఆ సన్యాసిని కొరడాతో కొట్టు'మని భటులకు ఆజ్ఞాపించాడు. రాజ భటులు సన్యాసిని పట్టుకొని కొరడాతో కొట్టడం ప్రారంభించారు. రాజభటులు ఒక సారి తనను కొరడాతో కొట్టగానే సన్యాసి నవ్వాడు.

దానితో రాజుకు ఆశ్చర్యం కలిగింది. ఎందుకు నవ్వుతున్నావు?' అని రాజా,

సన్యాసిని ప్రశ్నించాడు.

'రాజా! నువ్వు అరటిపళ్లుతిని తొక్కలు పారవేశావు. నేను ఆ తొక్కలను తిన్నాను. తొక్కలను తిన్న నేరానికి నేను కొరడా దెబ్బలను అనుభవించవలసి వచ్చిందికదా! అసలు పళ్లుతిన్న నేరానికి నువ్వు యెంతటి శిక్షను అనుభవించవలసి ఉందో, నీకు తెలియడం లేదు కదా! అని నేను నవ్వాను' అని సన్యాసి రాజుకు సమాధానం యిచ్చాడు.

దానితో రాజు తన తప్పును తెల్సుకొని, సన్యాసిని గౌరవించాడు' అని చూడామణి, రాజు కథను చెప్పాడు.

'నువ్వు చెప్పిన ఈ కథకు, తుగ్లక్ వ్యవహారానికి సంబంధం యేమిటి?' అని ప్రశ్నించాడు చిదంబరం.

'కథలో, తొక్కలు తిన్నందుకే సన్యాసి కొరడా దెబ్బలను అనుభవించవలసివచ్చింది. అందుచేత పళ్లు తిన్నందుకు రాజు యింకా యెక్కువ శిక్షను పొందవలసి ఉంటుంది' అని సన్యాసి రాజును హెచ్చరించాడు.

ఇక్కడ ఒక ఊరేగింపు తాలూకు ఫోటోలను ప్రచురించిన నేరానికిగాను తమిళనాడు ప్రభుత్వం 'తుగ్లక్' పత్రికమీద చర్య తీసికొంది. ఒక ఊరేగింపు తాలూకు ఫోటోలను ప్రచురించడమే నేరం అయినప్పుడు అసలు ఆ ఊరేగింపును జరపడం యింకా పెద్ద నేరం కదా! అటువంటి పెద్ద నేరాన్ని చేసిన రామస్వామినాయకర్ వగైరాల మీద తమిళనాడు ప్రభుత్వం యేమి చర్య తీసికొంది?' అని ప్రశ్నించాడు చూడామణి.


'ఊరేగింపు జరిపిన రామస్వామినాయకర్ వగైరాలమీద తమిళనాడు ప్రభుత్వం మొట్టమొదట యే చర్యా తీసికొనలేదు. 14—2—1971 వ తేదీని పోలీసులు 'తుగ్లక్' కాపీలను స్వాధీనం చేసికొన్న వార్త తెలియగానే పత్రికలు, ప్రజలు ఏకకంఠంతో ప్రభుత్వ చర్యను ఖండించారు. దానిమీదట 17—2—1971 వ తేదీని రామస్వామినాయకర్‌మీద కూడా పోలీసులు కేసు పెట్టారు.

'24—1—1971 వ తేదీని హిందూ దేవతలను అవమానించే ఊరేగింపు జరిగింది. అయినా 17—2—1971వ తేదీ వరకు ఊరేగింపు జరిపినవారిపై ప్రభుత్వం చర్య తీసికోలేదు, అంటే ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చెయ్యలేదా? అయినా యిటువంటి ఊరేగింపు జరగకుండానే నిషేధించినట్లయితే యింత గొడవ జరిగేది కాదు కదా!' అన్నాడు చూడామణి.


'సేలంలో యిటువంటి ఊరేగింపు జరగనున్నదనే విషయం తమకు ముందుగా తెలియదు' అని తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి 17—2—1971 వ తేదీని ప్రకటించాడు. కాని తమిళనాడు జనసంఘం అధ్యక్షుడు వాసుదేవన్ ముఖ్యమంత్రి ప్రకటనను ఖండించాడు. 'ఊరేగింపు జరగడానికి పాతికరోజులు ముందుగా ఈ విషయంమీద ఒక మెమోరాండాన్ని జిల్లా జనసంఘ కార్యవర్గ సభ్యులు, సేలం జిల్లా కలెక్టరుకు, పోలీసు సూపరింటెండెంటుకు అందచేశారు' అని వాసుదేవన్ తెలియజేశాడు.'

'అయినా యిటువంటి ఊరేగింపును ముందుగా నిషేధించకూడదు. ముందుగానే ఊరేగింపును నిషేధించినట్లయితే, తరువాత

(52 వ పేజీ చూడండి




భద్రాచలం పార్లమెంటరీ నియోజకవర్గంలో అక్కా చెల్లెళ్ల పోటీ: శ్రీమతి పి. వాణీ రమణారావు (సంస్థా కాంగ్రెస్), శ్రీమతి బి. రాధాబాయి ఆనందరావు (కొత్తకాంగ్రెస్).



హిందూపురం నియోజకవర్గంలో లోక్‌సభకి అన్నదమ్ములపోటీ కొత్తకాంగ్రెస్‌తరఫున శ్రీ పి. బయ్యాపరెడ్డి. సంస్థాకాంగ్రెస్‌తరఫున శ్రీ పి. రవీంద్రరెడ్డి.

ప్రజాసేవా?

పి.యస్. శాస్త్రి



ఒకదానివెంట ఒకటిగా నాలుగు పోలీసు లారీలు వచ్చి ఆగాయి అక్కడ. అది ఒక పెద్ద మెయిన్‌రోడ్డు. దాని ప్రక్కనే పెద్ద మైదానం. పెద్ద పెద్ద సభలు సమ్మావేశాల దగ్గర్నుంచి సర్కసులు, ఎగ్జిబిషన్లవరకూ ఆ మైదానంలోనే జరుగుతూ వుంటాయి.

చారిత్రాత్మక సంఘటనలెన్నో జరిగాయి అక్కడ కొంతమంది తమ రక్తాన్ని, కొద్దిమంది తమ ప్రాణాల్నికూడ ఆ మైదానాని కర్పించారు. మనిషి రక్తాన్ని చూపి భయపడనివాళ్ళకి ఆ మైదానం అప్పుడప్పుడూ 'సందడి'గానే కనిపిస్తుంది.

ఈ రోజక్కడ పెద్ద ఆందోళన జరగబోతోంది. అందుకే ఆ 'పోలీసు బందోబస్తు. తుపాకులు ధరించిన పోలీసులు ఒక్కరొక్కరుగా లారీల్లోనుంచి దిగుతున్నారు. కాన్‌స్టేబిలు శివరాం కూడా తన తుపాకి సవరించుకుంటూ లారీలోనుంచి ఒక్క దూకుతో దిగాడు.

రెండు నిమిషాల్లో అందరూ దిగటం పూర్తయింది.

వెంటనే విజిల్ మ్రోగింది.

అందరూ పరుగెత్తి వరుసలవారీగా నిలబడ్డారు.

'అటెన్షన్!'

అందరూ అటెన్షన్‌లో కొచ్చారు.

శివరాం కూడ అటెన్షన్లో కొచ్చాడు, యాంత్రికంగా.

అతని మనస్సంతా ఎక్కడో ఆలోచిస్తోంది.

ఇన్నాళ్ళకి తనొక మంచి పనిచెయ్యబోతున్నాడు. లోకం దృష్టిలో, న్యాయం దృష్టిలో అది మంచిదవునో కాదో తెలియదు, కాని తన దృష్టిలోమాత్రం అది ఒక్క మంచిపనిమాత్రమేకాదు, చాల అవసరమైన పనికూడ. ఆ పని జరగాలని తాను యెన్నాళ్ళనుంచో ఉవ్విళ్ళూరుతున్నాడు. ఎవరి చేతులమీదుగా జరిగినా ఫర్వాలేదని ఆశగా చూశాడు. కాని అది ఇంతవరకు జరగనే లేదు. ఇవ్వాళ తన చేతులమీదుగా జరగబోతోంది. ఆ కాస్త పనీ జరిగిపోతే ఆ తర్వాత తనకేం జరిగినా ఫర్వాలేదు ..

ఒసలు తనకేమీ జరక్కపోవచ్చు. ఎందుకంటే అంతపెద్ద యెత్తున అల్లరి, ఆందోళన జరుగుతున్నప్పుడు అందులో ఏపని యెవరు చేశారు, ఎవరి ప్రాణం ఎవరు తీశారు—అనేది నిర్ణయించటం కష్టం.

పోనీ ఎవరైనా తెలివిగా తనుచేసిన పని కనిపెట్టి తనని నేరస్థుడిగా నిర్ణయిస్తే—తను శిక్ష ననుభవించవలసొస్తుంది. అంతేగా! అయినా ఫర్వాలేదు. ఇప్పుడు తనేం సుఖపడుతున్నాడు గనక, అప్పుడు కష్టపడబోతున్నాననుకోటానికి. చాలీచాలని జీతం...

కాని యివ్వాళ్ళ తను చేయబోతున్న పని తనకో తృప్తి నిస్తుంది. అదే తనక్కావలిసింది.

యాంత్రికంగా అందరితోబాటు 'రైట్ లెఫ్ట్' చేస్తున్నాడు శివరాం.

'ఆందోళనకారులు' కొందరు చిన్న చిన్న గుంపులుగా వచ్చి మైదానంలో చేరుకుంటున్నారు.

వాళ్ళని చూస్తే జాలివేసింది శివరాంకు.

వాళ్ళు తమ రెక్కల్నేగాక, ప్రాణాల్నికూడ చవగ్గా అమ్ముకోటానికి సిద్ధపడతారు.

ఐదో పదో చూబిస్తే తమ తలకాయ నరికిమ్మన్నా యిచ్చేస్తారు. పాపం! వాళ్ళకి డబ్బు అంత అవసరం వుంటుంది. ఆమాటకొస్తే తన జీవితం వాళ్ళ జీవితాల కంటే యే విధంగా గొప్పదని? తనకి పదిరూపాయలంటే చాల పెద్ద మొత్తమే! తన పెళ్ళానికి జబ్బు చేసినప్పుడు మందులకని ఇరవైరూపాయలు ఖర్చు చేయ్యాలసొచ్చినప్పుడు తనూ 'హోరి బాబో!' అని గుండెలు బాదుకున్నాడు.

అయితే తను కాస్త బియ్యే దాకా చదువు

కున్నాడు...వాళ్ళు చదువుకోలేదు. ఎదటి వాడు మంచి చేస్తున్నాడో చెడు చేస్తున్నాడో తను కాస్త గ్రహించగలడు, వాళ్ళు గ్రహించలేరు . అంతే తేడా!

వాళ్ళ మానాన వాళ్ళ నొదిలేస్తే, ఏదో కూలి నాలి చేసుకుని వాళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రతకగలరు. కాని ఉత్త పుణ్యానికి పదిరూపాయలు ఆశ చూపితే ..పాపం! తమ ప్రాణానికొచ్చే ముప్పుకూడ గ్రహించలేరు. ఏం చెయ్యమంటే అది చేసేస్తారు. అరవమంటే అరుస్తారు. రాళ్ళు విసరమంటే విసుర్తారు. నిప్పెట్టమంటే దేనికైనా పెడతారు. పోలీసుల చేతుల్లో దెబ్బలుతింటారు. బాష్పవాయువు ప్రయోగిస్తే తడిగుడ్డలు ముక్కు కడ్డం పెట్టుకుని నానా అవస్థ పడతారు. ఫైరింగు జరిగితే అంతమందిలో కొద్దిమందైనా— బహు కొద్దిమందైనా — 'హరీ' అని వెళ్లిపోతారు. అంతమాత్రాన కథ ఆగిపోదు. తెల్లారి మళ్లీ పదిరూపాయలు చూపిస్తే, మళ్లీ మొదలు! ఆ చచ్చిపోయిన వాళ్ల తాలూకు వాళ్లెవరైనా వుంటే వాళ్ళు కూడ వచ్చి అందులో జేరుతారు. నిన్న జరిగిందాన్నుంచి నేర్చుకోవలసిందేదో వుందని వాళ్లకి తోచదు. ఎలా తోస్తుంది?

వాళ్ళు చదువుకున్నవాళ్ళు కాదు. 'నాగరిక ప్రపంచం' అంటే వాళ్లకి భయమూ, భక్తీ రెండూ వున్నాయి. ఎవరైనా వాళ్ల మధ్యకి వెళ్లి గడుసుగా 'మీరు వెంటనే ఫలానా పని చెయ్యండి. మీకేం భయంలేదు! నేనున్నాను. చెయ్యకపోతే మీకే నష్టం...' అంటూ నాలుగు మాటలు మాట్లాడితే, చెయ్యకపోతే యేం కొంపమునుగుతోందో అని భయపడతారు. 'మీ కిప్పటికే అన్యాయం జరిగిపోయింది. అయినా ఫర్వాలేదు నేను మీ కష్టాలు గట్టెక్కిస్తాను. రేపు మీ పనులన్నీ మానేసి నేను చెప్పినట్టు చెయ్యండి. మీరు సంపాయించే కూలికి నాలుగు రెట్లెక్కువే ఇస్తాను. ఇదిగో తలకి పదిరూపాయల చొప్పున తీసుకోండి ..' అంటూ నోట్ల కట్టలు బైటికి తీసేసరికి అపరిమితమైన భక్తి కూడ పుట్టుకొచ్చేస్తుంది. అంతే! మంత్ర ముగ్ధుల్లా, కసాయిశాలకు వెళ్లే మేకల్లా, ఎందుకో తెలియకుండా ఎటు వెళ్లమంటే అటువెళ్లి ఏది చెయ్యమంటే అది చేస్తారు.

లాఠీకి దెబ్బతిని చచ్చిపోయే వేళకి కూడ అసలీ ఆందోళన దేనికోసమో, వాళ్లకి తెలియదు.

అది వాళ్లకనవసరం! చెప్పినా అర్ధం కాదని వాళ్లకే తెలుసు. వాళ్లకి తెలిసిందల్లా ఇంతే: ఎవరో ఉత్తముడు. తమ పరిస్థితి బాగుపరచటానికి కంకణం కట్టుకున్నాడు. ఆయన ఉత్త పుణ్యానికి పది రూపాయలివ్వటమే అందుకు నిదర్శనం. ఆయన చెప్పినట్లు చెయ్యటం మన కర్తవ్యం. చెయ్యకపోతే మనం బాగుపడడం. పైగా ఆయనక్కోపం వస్తే రేపీపాటికి మన గుడిసెలన్నీ పీకించెయ్యగలడు. కనుక...

వాళ్ల మనసుల చుట్టూ అంత అంధకారం అలముకుని వుంటుంది. ఎన్నాళ్లనుంచో—తను బుద్ధెరిగిన నాటి నుంచీ— చూస్తున్నాడు. ఆ పరిస్థితి మాత్రం మారటం లేదు. వాళ్లివ్వాళ్ల ఒక వ్యక్తి చేతిలో కీలుబొమ్మలు; రేపు ఇంకొక వ్యక్తి చేతిలో. ఇలా చేతులు మారుతూనే వుంటారు. దానికంతెక్కడో కనిపించదు...

చిదంబరంలాంటి పలుకుబడి గల వ్యక్తులకి వీళ్ల అవసరం ఎంతైనా వుంది. ఇంకా సరిగ్గా చెప్పాలంటే, ఇటువంటి వాళ్ళు లేకపోతే చిదంబరంలాంటి 'మహా పురుషులు' మట్టిలో కలిసిపోతారు.

కాని విచిత్రమేమిటంటే, తమనెన్నటికైనా రక్షించి పైకి తీసుకురాగలవాడు 'చిదంబరమే' అని వాళ్ల నమ్మకం. చిదంబరం యిచ్చే ఉపన్యాసాలు విని చంకలు కొట్టుకుంటారు, వాటిలో వాగ్దానాలు తప్ప మరో వస్తువుండదు గనక.

ఎన్నిసార్లు మోసపోయినా అవి 'గాలి' వాగ్దానాలని వాళ్లకి తోచదు, పాపం. తోచినా చిదంబరంలాంటి పెద్దమనిషి ఎదటపడి అడగలేరు, (అసలాయనగారి దర్శనమే వీళ్లకి లభించదుగా, ముందు!) అథవా ధైర్యం చేసి ఎవరైనా అడిగినా, ఆ అడిగిన వాడినోరు శాశ్వతంగా మూయించటం చిదంబరంలాంటి వాళ్ళకి అత్యంతసులభం. . పాపం! వాళ్ళు ఆ చీకటిలో నుంచి బైటికి రావటం ఎప్పటికో!

ఏ మాటయినా వాళ్ళు నమ్మేటట్టుగా మాట్లాడడం చిదంబరానికి తెలుసు. వాళ్లని తన బలగంగా వాడుకుంటూ ప్రభుత్వాన్ని **బెదిరించడం కూడ అతనికి తెలుసు. అదే అతనికి 'పలుకుబడి'!**

చిదంబరం చెబితే యెక్కడ యేపని కావాలన్నా జరిగి తీరుతుంది! వద్దంటే మానేస్తుంది కూడ!!

తన విషయంలో అలాగే జరిగింది. ఎప్పుడూ ఫస్టుమార్కులతో పాసవుతూ వస్తున్న తనకి ప్రిన్సిపాలుగారిప్పించాలనుకున్న స్కాలర్‌షిప్, చిదంబరం పుణ్యమా అని తప్పిపోయి, ఒక జల్సారాయుడికి దక్కింది.

'సారీ మిస్టర్ శివరాం! పరీక్షల్లో వచ్చిన మార్కులూ, ఆర్థిక పరిస్థితీ లెక్కలోకి తీసుకుంటే నిజంగా ఆ స్కాలర్‌షిప్ నీకే యిచ్చి వుండాల్సింది. యోగ్యత లేని యింకొక వ్యక్తి కివ్వవలసి రావటం, అది కూడ నా చేతులమీదుగా—నిజంగా నా దురదృష్టం ! ఈ పరిస్థితుల్లో మరొకడయితే ఈ ప్రిన్సిపాలు ఉద్యోగానికి రాజీనామాచేసి వుండేవాడు. ఆమాత్రం అభిమానం వుండికూడ నేను నిస్సహాయుణ్ణి!! ఇద్దరాడపిల్లల పెళ్లిళ్లు చేయవలసినవాణ్ణి గనక రాజీనామా చెయ్యలేకపోతున్నాను. సిగ్గు చంపుకుని కాలం వెళ్లబుచ్చక తప్పటం లేదు...' అంటూ కన్నీరు దాచుకుని, 'పోనీలే,... శివరాం ! నీ కాలేజి ఫీజులూ, పుస్తకాల ఖర్చులూ నేను భరిస్తాను, నువ్వు బాగా చదువుకో!' అన్నారు

అప్పుడు తనకి దు:ఖం ఆగలేదు. కన్నీళ్లు బొటాబొటా కారిపోయాయి. రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెడుతూ 'వద్దు సార్ ! మీ అభిమానానికి కృతజ్ఞుణ్ణి ! నాకీ చదువు చాలు. ఏదయినా ఉద్యోగం చూసుకుంటాను' అని యివతల కొచ్చేశాడు, పొర్లుకొస్తున్న దుఃఖం ఆపుకుంటూ.

ఆతర్వాత—

ఆ తర్వాతింకేముంది? ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం. పేపర్నిండా 'కావలెను' ప్రకటలే! పాపం! వాళ్లకి నిజంగా ఎవరు కావాలో ఎవరికి తెలుసు? అప్లికేషన్లూ, ట్రూ కాపీలూ, క్యారక్టరు సర్టిఫికేట్లూ, కొన్ని దస్తాలు కాగితాలు ఖర్చయ్యాయి. కొన్నివందల పోస్టలు స్టాంపులు వాడాడు. కొన్నింటికి 'రిగ్రెట్' లెటర్సు వచ్చాయి. కొన్నింటికవ్వీ రాలేదు. కొన్ని ఇంటర్వ్యూలకూడా వెళ్లాడు కాని అవి ఇంటర్వ్యూలు కావనీ 'కన్నీటి తుడుపు'లనీ **ఆ**

తర్వాతగాని తెలిసి రాలేదు

తనకొచ్చిన ఫస్టుమార్కులన్నీ ఎవరి కుద్ధరించటానికో బోధపడలేదు.

ఒకరోజున ప్రిన్సిపాల్‌గారు రహస్యంగా పిలిచి, తనకు తెలిసిన ఒక ఫ్రెండు కంపెనీలో ఓ వుద్యోగం ఖాళీగా వుందనీ, వెంటనే వెళ్లమనీ చెప్పి ఓ రికమండేషను లెటరు కూడ యిచ్చారు. వెంటనే వెళ్లాడు తను! వెళ్లి, అక్కడి మేనేజరుగారికి ప్రిన్సిపాలుగారి లెటరు అందజేసి, నమస్కరించి, ఆయన కెదురుగా కూర్చున్నాడు. అంతలోనే టెలిఫోన్ మోగింది. మేనేజరు రిసీవరు ఎత్తి 'హలో!...' అని ఆగిపోయాడు. పది సెకన్ల తర్వాత 'సారీ సార్! ఆ పోస్టు యిప్పుడే ఒకతనికిచ్చేశాను. పాపం పూర్ ఫ్యామిలీట' అని ఆగిపోయాడు మళ్లీ. అవతలి కంఠం కొంచెం గట్టిగా మాట్లాడసాగింది. కొన్ని మాటలు బాగా విన్పించాయి కూడా. '...ఆ అమ్మాయిదీ పూర్ ఫామిలీయే! భర్త నాలుగొందలు సంపాయిస్తున్నాడనుకోండి! ఏం చాలుతుందీ రోజుల్లో?' అని [illegible]పించింది.

'పాపం! ఈ అబ్బాయి మరీ పేదవాడండీ! పైగా ఇచ్చిన ఉద్యోగం లాక్కోవటం యేం బాగుంటుంది చెప్పండి?' అని వారించసాగాడు మేనేజరు.

తనకింకా ఉద్యోగం యివ్వకుండానే యిచ్చానని వాదిస్తున్న దేవుడిలాంటి ఆయునకి మనసులోనే దణ్ణం పెట్టుకున్నాడు తను...

ఫోనులో అవతలి కంఠం మళ్లీ రెచ్చి

ప్రజా సేవా?

పోసాగింది. '...మీకు ఏ మినిస్టరుచేత నయినా చెప్పించుకోవాలనుకుంటే చెప్పండి! అలాగే యేర్పాటు చేస్తాము. అంతేగాని...'

'వద్దు లెండి! నేనే మీకు మళ్లీ ఫోను చేస్తాను...తప్పకుండా! సాయంత్రంలోపల..' అని మేనేజరు ఫోను పెట్టేశాడు.

తన వంక జాలిగా చూస్తూ 'ఐయామ్ వెరీ సారీ మిస్టర్ శివరాం! మీకీ ఉద్యోగం యివ్వలేను. నన్ను క్షమించమని ప్రిన్సిపాల్ గారికి చెప్పండి' అని లేచి వెళ్లిపోయాడు.

తనకి భళ్లున ఏడుపొచ్చింది...తర్వాతెప్పుడో ప్రిన్సిపాలుగారే చెప్పారు: ఆ ఉద్యోగం తనకి రాకపోవటానికి కారణం కూడ చిదంబరమేనని తర్వాత ఎలాగో తిప్పలుపడి యీ పోలీసు ఉద్యోగం సంపాదించాడు.

అంత కష్టపడి చదివి, అన్ని మంచి మార్కులు తెచ్చుకుని కూడ తను యీనాడు ఒట్టి పోలీసుగానే మిగిలిపోయాడు! కాని తన గొయ్యి తనే తవ్వుకున్నాడు చిదంబరం!! రేపటినుంచి చిదంబరం చరిత్ర కెక్కుతాడు!!! దేశం కాస్తయినా బాగుపడుతుంది.

ఢిల్లు వగైరాలు ముగియుటంతో ఈ లోకంలోకి వచ్చాడు శివరాం.

అందరూ తుపాకులు సవరించుకుంటూ మెల్లిగా అటూ యిటూ పచార్లు చేస్తున్నారు. కొందరక్కడక్కడా చిన్న చిన్న పిట్టగోడల మీద, కొందరు పెద్ద పెద్ద బంతరాళ్ల మీద, కొందరు లారీ నీడలోనూ

కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఒక పోలీసు జీపు వచ్చి ఆగింది. సర్కిల్ ఇన్స్‌పెక్టరు సబ్ ఇన్స్‌పెక్టర్లతో ఏదో ఒక్క క్షణం మాట్లాడి వెళ్లాడు.

మరు క్షణంలో ఒక వార్త పాక్కిపోయింది. ఆందోళనకారుల ఊరేగింపు ఇప్పుడే రాజాస్క్వేర్ దాటిందిట. రాజాస్క్వేర్‌లో రెండు బస్సులు, ఒక ప్రయివేటు కారు తగలబెట్టారుట.

ఒక ఫైరింజను అప్పుడే గంట కొట్టుకుంటూ అతివేగంగా దూసుకుపోయింది.


శివరాం ఒక చెట్టు మొదట్లో ఉన్న రాతి మీద కూర్చున్నాడు.

రోడ్డంతా పాడుబడినట్లుగా వుంది. సిటీ బస్సులు, టాక్సీలు నడవడంలేదు. ఎక్కడో ఒకటీ అరా ప్రైవేటు కార్లుమాత్రం 'ఎప్పుడు గమ్యం చేరుకుందామా' అనే ఆదుర్దాతో పారిపోతున్నాయి. దుకాణాలన్నీ మూతబడి వున్నాయి.

కాసేపట్లో ఊరేగింపు మైదానం చేరుకుంటుంది. 'ప్రజాసేవకుడు' చిదంబరం లెక్చరివ్వటం మొదలు పెడతాడు. కాసేపు ప్రశాంతంగానే సాగుతుంది. ఉన్నట్టుండి ఓ మూల అల్లరి బయల్దేరుతుంది. ఆ తర్వాత ఆ తర్వాత లాఠీఛార్జి...ఆ తర్వాత 'టియర్ గాస్'...ఆ తర్వాత 'ఓపెన్‌ఫైర్' ఆర్డర్లు జారీ అవుతాయి. చిదంబరం బహుశః పారిపోజూస్తాడు. కాని తనక్కడుండగా ఆ పప్పులుడకవు. తన తుపాకి గుండు అతని గుండెల్లో నుంచి దూసుకుపోతుంది. అంతే! ఏం జరిగిందో ఎవరికీ సరిగా తెలియదు... ఆ తర్వాత తనకేం జరిగినా జరక్కపోయినా ఫర్వాలేదు.

. తను యీ నిర్ణయానికొచ్చింది చిదంబరం తన కపకారం చేసినందుక్కాదు. తనకి రావలసిన స్కాలరుషిప్పూ, ఉద్యోగం రాకపోయినందుక్కాదు. చిదంబరం చేస్తున్న 'ప్రజాసేవ' నరికట్టటానికి.

ఒకరకంగాచెప్పాలంటే అతను చేస్తున్నది మోసవ్యాపారం.అందులోప్రాణాలకిప్రాముఖ్యం లేదు. ఎవరు ఏ ఆందోళన జరపాలనుకున్నా ముందు చిదంబరాన్ని కలుసుకుంటారు. ఎంత ఖర్చవుతుందో చిదంబరమే నిర్ణయిస్తాడు. చిన్న ఆందోళనకయితే యాభై వేలు, పెద్దదానికయితే లక్ష! అదీ రేటు. పెద్ద ఆందోళన ఉంటే పోలీసు ఫైరింగు



టాకా వెళ్తుంది, చిన్నదైతే జాప్యనాయి ప్రయోగింతో ఆగిపోతుంది...తన రేటులో మూడోవంతో నాలుగోవంతో 'ఆందోళన కారు'లకు పంచిపెడతాడు. మిగిలింది తన జేబులో వేసుకుంటాడు, చచ్చిపోయిన వాళ్ల తాలూకు మనుషలకో యాభైయ్యో వందో ముట్టజెపుతాడు. ఇవిగాక చిల్లరగా, ఉద్యోగాలు వేయించటం, తీయించటం, కాంట్రాక్టులు యిప్పించటం, కాన్సిలు చేయించటం —ఇంకా యిలాంటిపనులు శతసహస్రాలు చేయిస్తూ వుంటాడు. ఉచితమైన కానుకలతో యెవరువెళ్లి అర్థిస్తే వారిది ఛాన్సు!

పైగా తను చేసే ప్రతి పనిలోనూ దేశసేవ, మానవసేవ యిమిడి వున్నాయని ప్రజల్ని నమ్మిస్తాడు. అది వీలులేనప్పుడు, అవతలి వాళ్లమీద, తనని కాదన్నవాళ్లమీద ప్రభుత్వం మీద నేరాలు మోపుతాడు గొంతు చించుకుని అరుస్తాడు. తన ఉపన్యాసం ప్రచురించని పత్రికల్ని వో 'చెయ్యి' చూస్తాడు.


ఎప్పుడో ఎందుకు ? క్రిందటి నెలలో ఈ చిదంబరమే ఒక ఆందోళం జరిపించాడు. ఆందోళనకారులు ఆ ఒక్కరోజున ఆరు బస్సులు తగలెట్టారు. ఇద్దరు ప్రయాణికుల్నీ, వో డ్రైవర్నీ కండక్టర్నీ చావగొట్టారు. (డ్రైవరు తర్వాత హాస్పిటల్లో చచ్చిపోయాడు) అడ్డువచ్చిన పోలీసుల మీద రాళ్లు విసిరారు. ఐదుగురు కానిస్టేబిల్సుకు బాగా గాయాలు తగిలాయి ఒక కానిస్టేబిలు మర్నాడే చచ్చిపోయాడు... ఇంత జరిగిన తర్వాత సర్కిల్ ఇన్స్పెక్టరు పరిస్థితి విషమించిందని గ్రహించి 'వెంటనే ఆందోళనకారులు అక్కడినుంచి వెళ్లిపోకపోతే కాల్పులు జరపవలసొస్తుం'దని హెచ్చరించాడు.. దానిమీద చిదంబరం పత్రికల్లో చేసిన ప్రకటన: 'శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న పీడిత ప్రజలపై పోలీసు రాక్షసులు చేయిచేసుకుని తుపాకి కాల్పుల దాకా వెళ్లటం— ఇది భారత జాతికే కళంకం, మాయనిమచ్చ! దీనిని మనం సహించం! ప్రభుత్వం ఈ పోలీసు దవుర్జన్యాల నరికట్టాలి! ఈ పోలీసు గుండాలని వెంటనే డిస్మిస్ చెయ్యాలి...'

ఇలా తల్చుకున్నకొద్దీ కడుపు మండిపోతోంది ... ఎందుకీ అనవసరపు టాలోచనలూ? తను చెయ్యదల్చుకున్న పని కాస్తా చేసేస్తే తీరిపోతుంది... 'అంతే!' అనుకున్నాడు శివరాం.

ఒకసారి తన తుపాకీని ముద్దు పెట్టుకుని 'గురి తప్పకూ!' అని లాలనగా అడిగాడు. 'అలాగే' అని చెప్పటానికా తుపాకికి నోరు లేదు పాపం!

మెల్లిగా కేకలూ అరుపులూ వినిపించసాగాయి ... మరో ఐదునిమిషాల్లో చెవులు చిల్లులు పడేటట్లు వినిపించసాగాయి: 'అదిగో ఆందోళనకారుల ఊరేగింపు దగ్గరకొచ్చేస్తోంది. అందులో కొందరు అరుస్తూ 'నాట్యం' కూడ చేస్తున్నారు. 'పాపం! అందులో ఎవరికేం జరగబోతోందో యివ్వాళ్ల!' అనుకున్నాడు శివరాం, జాలిగా.





1970 లో ఉత్తమ రచనలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డులు పొందిన శ్రీయుతులు పోడుకూరి జాన్సన్ (నాటకం), తిరుమల రామచంద్ర (సాహిత్యవిమర్శ), కుందుర్తి ఆంజనేయులు (కవిత), దాశరథి రంగాచార్యులు (నవల).

ఊరేగింపు మైదానంలో కొచ్చేసింది. దానివెంట మరో రెండు లారీలనిండా పోలీసులు కూడా వచ్చారు. మొత్తం నూటయాభైమంది పోలీసులు... లాఠీలు... తుపాకులు...

చిదంబరం వేదికనెక్కి ఉపన్యసించసాగాడు. 'సోదరులారా ! ఇది మామూలు సమావేశం కాదు. అనవసర ప్రసంగాలకిది సమయం కాదు. మనల్ని మనమే రక్షించుకోవలసిన దుర్గతి ఏర్పడింది. మనల్నెవరోవచ్చి రక్షిస్తారనుకోవటం కేవలం తెలివితక్కువ......'

ప్రజా సేవా?

సాధారణంగా చిదంబరం యిలా అందోళన జరిగే సమయాల్లో కైటకివచ్చి ఉపన్యసించడు. బహుశ; తనకేమైనా కీడుజరిగితే రేపటినుంచి 'దేశసేవ' కుంటుపడిపోతుందని భయమేమో!

పోలీసులందరూ మైదానంచుట్టూ కీలక స్థానాల్లో సర్దుకున్నారు. వేదికకు వీలైనంత దగ్గర్లో వుండటానికి ప్రయత్నించాడు. శివరాం.



1970 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ విశిష్టసభ్యత్వంతో గౌరవించిన శ్రీయుతులు త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి, డాక్టర్ నేలటూరి వెంకటరమణయ్య, దువ్వూరి వెంకటరమణశాస్త్రి, వానమామలై వరదాచార్యులు.

ఉపన్యాసం ధాటీగా సాగిపోతోంది.

'...పుణ్యభూమి అయిన ఈ భారతదేశంలోనే ప్రాణానికి విలువలేకుండా పోయింది. ప్రజల బ్రతుకులన్నీ కంచేనే—మ విధంగా తయారయ్యాయి. నోరుతెరిచిన మన కష్టాలు చెప్పుకునేందుక్కూడ వీలులేకుండా పోయింది. అదుగో చూడండి! అప్పుడే మన చుట్టూ ఎన్ని తుపాకులు చేరాయో! అంటే మనం నిజం మాట్లాడుకోవటం కూడ నేరమేనన్న మాట ! ఫర్వాలేదు. మనం తుపాకుల్నిచూసి బెదిరిపోనక్కర్లేదు. అరోజులెప్పుడో వెళ్ళిపోయాయి. శాంతియుతంగానే మన మీ తుపాకుల నెదుర్కొందాం. అహింసతోనే జయిద్దాం...'

అప్పుడే మైదానానికి చివరఅల్లరి బయల్దేరింది, పోలీసులమీద రాళ్ళవర్షం కురుస్తోంది. తప్పించుకోటానికి వాళ్ళు చేసిన ప్రయత్నం విఫలమైంది కాసేపు, లాఠీఛార్జి మొదలుపెట్టారు.

చిదంబరం తన ఉపన్యాసం ఆపలేదు. సోదరులారా! అన్యాయాన్ని దౌర్జన్యాన్ని శాంతియుతంగానే యెదుర్కొందాం. మనం యింతకాలంగా అహింసనే మన ఆయుధంగా వాడుకుంటూ వస్తున్నాం. ఇప్పుడుకూడా అహింసతోనే యెదుర్కొందాం...'

ఇంతలో రోడ్డుమీదుగగిన ఒక పోలీసు లారీకి నిప్పెట్టారెవరో. నాలుగువైపులా తగలడి పోతోందాలారీ. కొంతమంది పోలీసు లటు పరుగెత్తి ఆమంటలనార్పే ప్రయత్నం చేస్తున్నారు. శివరాం మాత్రం తన స్థానాన్నుంచి కదల్లేదు.

ఉపన్యాసం కొనసాగుతోంది. 'సోదరులారా! పైన భగవంతుడున్నాడు. మనపై జరిగిన దుర్మార్గానికి భగవంతుడే ప్రతీకారం చేశాడు. అటు చూడండి దహనకాండ!... కనక మనకేం భయం లేదు. మనం చేస్తున్నది యే విధంగానూ తప్పు కాదు; నేరం కాదు...'

రోడ్డు మీద జనం మూగారు. ఇంతలో లారీ మంటల నార్పుతున్న పోలీసులపై నాలుగైదు 'మాలటోవ్ కాక్ టెయిల్సు' పడ్డాయి. వెంటనే అక్కడ లాఠీఛార్జి ప్రారంభమయింది. లాఠీఛార్జి చేస్తున్న పోలీసులపై రాళ్ళవానకూడ ప్రారంభమైంది. అరుపులు, కేకలు మిన్నుముట్టుతున్నాయి.

పాకాన పడుతోంది అనుకున్నాడు శివరాం

మైదానంలో. 'త్వరగా ఫైరింగు ఆర్డరిస్తే బాగుణ్ను' అని కూడ అనుకున్నాడు. కాని యింత జరుగుతున్నా చిదంబరం పారి పోకుండా యింకా ఉపన్యాసం కొనసాగించటమే ఆశ్చర్యంగా వుంది. 'సరే! అదీ నా అదృష్టమే' అనుకున్నాడు శివరాం.

చిదంబరం 'శాంతి', 'సహనం' లాంటి పెద్ద పెద్ద పదాలు ధారాళంగా వాడుతున్నాడు తన ఉపన్యాసంలో.

లాటీచార్జి చేస్తున్న పోలీసుల ప్రక్కగా ఒక చేతిబాంబు పడి ప్రేలింది. అనుకోనియీ పరిణామానికి కొంచెం అదిరిపడింది పోలీసు బలగం.

ఒక స్క్వాడు బాష్పవాయు ప్రయోగానికి సిద్ధమైంది.

ఇద్దరు ఇన్స్పెక్టర్లు కొంతమంది కాన్స్టేబిల్సుతో చిదంబరం ఉపన్యాసం యిస్తున్న వేదిక వైపు నడవసాగారు, బహుశ: అరెస్టు చెయ్యడానికి. కాని ఆందోళనకారులు వేదికను చుట్టుముట్టారు పోలీసులు చిదంబరం దగ్గరకు వెళ్లటానికి వీల్లేకుండా. అక్కడ మళ్లీ లాఠీచార్జి అవసరమైంది.

ఉపన్యాసం ఆపి వెంటనే పట్టుబడిపోకపోతే కాల్పులు జరపవలసి వుంటుందని ఒక సబ్ ఇన్స్పెక్టరు పోలీసు మైక్ ద్వారా ప్రకటించాడు రోడ్డు మీదనుంచి.

'అమ్మయ్య! దగ్గర కొస్తోంది' అని లోలోపల సంతోషపడి తన రైఫిలు సిద్ధంగా వుందో లేదో వో సారి చూసుకున్నాడు శివరాం.

తన గురి తప్పకుండా వుండేందుకు మంచి యాంగిల్ కూడ చూసుకున్నాడు. ఈలోగా తనకీ చిదంబరానికీ మధ్య జనం అడ్డువస్తే తన తుపాకి గుండుకెలా దారిచూపించాలో కూడ ఆలోచిస్తున్నాడు.

రోడ్డుమీద జేరిన గుంపుపై బాష్ప వాయు ప్రయోగం జరిగింది. వెంటనే ఆ గుంపంతా వచ్చి మైదానంలో వున్న జనంతో కలిసి పోయింది. జనమందరూ చెల్లా చెదురైపోయారు.

ఈలోగా చిదంబరం పారిపోతాడేమోనని శివరాం భయపడ్డాడు. జనాన్ని అదుపులో పెట్టడానికా అన్నట్లు కొంచెం అటూ యిటూ కదుల్తూ హంగు చెయ్యటం మొదలెట్టాడు. కాని చిదంబరం వేపు వోకన్ను వేసే వుంచాడు.

కనిపించిన పోలీసుమీద రాళ్లు వెయ్యటం మొదలెట్టారు జనం. తనకో నాలుగ్గజాల దూరంలో వున్న వో కానిస్టేబిలు మొహాన వో రాయి బలంగా తగిలి రక్తం చిమ్మింది.

ఇంకా ఫైరింగ్ ఆర్డర్సు రాలేదని మధన పడసాగాడు శివరాం.

వో రాయి వచ్చి తన కుడిచేతి బొటన వ్రేలి మీత తగిలింది. 'అబ్బా!' అనుకున్నాడు. 'ఇంత నొప్పితో తుపాకి పేల్చ గలనా' అని సందేహం వచ్చిందతనికి. 'ఫర్వా లేదు! అవసరమైతే ఎడం చేత్తో పేలుస్తాను' అనుకున్నాడు.

రోడ్డుమీద వరసగా రెండు బాంబులు పేలాయి.

చిదంబరం యేం మాట్లాడుతున్నాడో యెవరికీ వినిపించటంలేదు. మైక్ చెడి పోయినట్లుంది. దానికి తోడు అరుపులు, కేకలు, బూతులు...

'అల్లరి ఆపకపోతే కాల్పులు జరుపవలసి వస్తుం'దని మరోసారి హెచ్చరించటం జరిగింది.

అల్లరి మాత్రం ఆగలేదు.

చెల్లా చెదురుగా పరుగెత్తుతున్నారు జనం.

'ఫైర్' అనగానే ప్రేల్చటానికి సిద్ధంగా వున్నాడు శివరాం. అధికారులదే

స్వర్గీయ స్థానం నరసింహారావు

ఇటీవల స్థానం అస్తమయంతో అలనాటి ఆంధ్రనాటక రంగంలో మహనీయనటు లొకరు జాతి జీవితరంగంనుండి నిష్క్రమించారు. 1919 నించి నాలుగు దశాబ్దాలపాటు ఆయన ఆంధ్ర నాటక రంగానికి కంఠకౌటికి నటకావతం సుతై అశేష ప్రజానీకం మన్ననలందుకున్నారు.

స్థానం నటన నైపుణి అనన్యసాధారణ మయినది. ఆయన మన నాటకరంగం మీద అడుగుపెట్టిన సమయానికి స్త్రీలు అంతగా రంగం మీదికి వచ్చేవారుకాదు. అనాడు పురుషులే ఎక్కువగా స్త్రీ పాత్రలు ధరించేవారు.

సామాన్యంగా చూసినప్పుడు స్థానం అంతటి అందగాడని అనిపించేదికాదు. కాని ఆయన స్త్రీ వేషంలో రంగస్థలం మీద నిలబడగానే, అంతటి అందగత్తె వేరెవ్వరు లేరని మహోత్సర్యం కలిగేది. స్థానం ప్రతి కదలిక లోను, హావభావాలవిన్యాసాలలోను, పాటల లోను, మాటలలోను అపూర్వమయిన లాలిత్యం



తొణికిసలాడేది! ఎంతెంతటి నటీమణుల కయినా, అంతటి అందము, ఒయ్యారము ఒదుగు, సౌకుమార్యము అలవడగలవా? అని విభ్రాంతి కలిగేది! ఆ రోజులలో స్థానం పేరు చెబితేనే చాలు! జనం తండోపతండాలుగా వేలం వెర్రిగా విరుచుకుపడి ఆయన నటన నైపుణి సందర్శనం కోసం తహతహలాడేవారు.

శ్రీ కృష్ణతులాభారంలో సత్యభామగా, సత్యహరిశ్చంద్రలో చంద్రమతిగా, శ్రీ కృష్ణలీలలో యశోదగా, రోషనారగా, చిత్రాంగిగా, మధురవాణిగా — ఇలాగ అనేక పౌరాణిక చారిత్రక సాంఘికనాటకాలలో స్థానం ప్రతిభ అనేక విధాలుగా జాజ్వల్యమానంగా రాణించింది. విచిత్ర వైవిధ్యంతో ప్రేక్షకుల నుర్రూతలూగించింది.

ముఖ్యంగా రాజసం తొణికిసలాడుతున్న, రోషాల స్వభావోన్మీలనంలో స్థానం నిరుపించి అద్వితీయు లనిపించుకున్నారు. మధురవాణిగా రంగస్థలం మీదికి అవతరించినప్పుడు కన్యాశుల్కంలోని మధురవాణి అప్పుంగా దిగి వచ్చిందా అనిపించేది! ఆ నాటకంలో ఒకచోట ఎడతెగని మధురవాణి నవ్వు చాలా అత్యద్భుతమయినది! స్థానం ఆ నవ్వు అలాగే చికిలించి చూసినవారు, విన్నవారు అది ఎన్నటికీ మరిచిపోలేరు. అది అంతరాంతరాలలో అలాగే మారుమ్రోగుతూంటుంది. అపూర్వమయిన లాలిత్యంతో స్థానం పాటపాడే తీరు కూడా అటువంటిదే! ఆయన పాట లానాడు ప్రతి శ్రోత హృదయంలోను పారవశ్యం కలిగించి మైమరిపించాయి!

నానాటికి సినిమా బాగా అల్లుకుపోయిన కొద్దీ, క్రమక్రమంగా అనాటి నాటకాలతో పాటు అలనాటి మహనీయ రంగస్థల నటు లొకరొక్కరే మరుగునపడిపోయారు.

కాని, ఆంధ్ర నాటక రంగం చరిత్రలోనే కాక ఆంధ్రజాతి అంతర్యంలో కూడా స్థానం వారి స్థానం మహనీయమయినది! అజరామరమయినది! అమృత మధురమూర్తి ఆ నటకావతంసుని కిదే నా జోహారు!

— పి. గణపతిశాస్త్రి

ప్రజా సేవా?

అలస్యం!

వెనక నించి ఒక పెద్దరాయి వచ్చి తగిలింది; అదృష్టవశాత్తూ తలకి దెబ్బ తగల్లేదు. టోపీ మాత్రం కింద పడింది.

వెనక్కి తిరిగి చూశారు. మరో రెండు రాళ్ళు తనని దూసుకుపోయాయి. టోపీ తీసుకుని తన తుపాకి సరిపెడుతూ రాళ్ళు వేసిన వాళ్ళమీదకి చూశాడు. వాళ్ళు పారిపోయారు. 'వెధవలు!' అనుకుని, మళ్ళీ, 'ఛ ఛ! వాళ్ళదేం తప్పలేదు. వాళ్ళు చిదంబరం చేతిలో కీలుబొమ్మలు!' అనుకుని ముందుకు తిరిగాడు.

ఇంకా ఫైరింగు ఆర్డర్సు రాలేదు. సెలి దొక్కుకోలేక పోయాడు;

ఇంకోరాయివచ్చిత్వరలోపు తగిలింది. కళ్ళుమూసుకున్నాడు;రక్తంకారిపోతోంది ...

'ఫర్వాలేదు!' ఇలాంటివెన్ని సంతోషంతో సహిస్తాను. కాని ఆ రాక్షసుడు చిదంబరం మాత్రం బ్రతకనివ్వకూడదు' అనుకున్నాడు.

'ఫైరింగు ఆర్డర్సు వచ్చేలోగా నా రెండో కన్నుకూడ పోతుందేమో! ఆర్డర్సు లేకపోయినాసరే నా పనిచేసి తీరుతాను' అంటూ తుపాకి వేదికవైపు గురిపెట్టి అతికష్టంతో వో కన్ను తెరిచాడు.

చిదంబరం అరెస్టవుతున్నాడు!

'ఛ, అవకాశం జారిపోయింది. ఇహ ఫైరింగు ఆర్డర్సు రావు ... చిదంబరం లాంటివాణ్ణి అరెస్టు చేసినంతమాత్రాన, దేశానికీ ప్రజలకీ ఏమీ మేలుజరగదు. ఇవ్వాళ అరెస్టయినా రేపు మళ్ళీ తెల్లారకుండానే బైటికి రాగలడు. అప్పుడు అతని పరువు మరి కాస్త పెరుగుతుంది. దేశాన్నీ, ప్రజల్నీ ఇంకాస్త అధోగతిపాలు చెయ్యగలడు... నా నిర్ణయం సరియయినదే! నే ననుకున్నది చేసి తీరతాను. న్యాయం దృష్టిలో నేను నేరస్థుణ్ణయితే, న్యాయం నా ప్రాణాలు తీసుకుంటుంది. అక్కర్లేదు. నేనే సంతోషంగా అర్పిస్తాను. నేనూ ప్రజలకి సేవచేసినవాణ్ణే అవుతాను. అదే నాకు తృప్తి...' అనుకుని ట్రిగ్గరుమీద వేలు వేశాడు.

ఒక చేతిబాంబు ఎక్కడినుంచోవచ్చి తల మీద పేలింది ... కన్నుగా కూలిపోయాడు శివరాం.

ఒక వారం విపరీతం పాలాక్షుడు

మేనల్లుడి ప్రతీకారం!

అంపట్టన్‌పట్టి అనే గ్రామంలో పెరుమాళ్ దేవర్ అనే 40 ఏళ్ళ వ్యక్తికి నలుగురాడపిల్లలట. అందులో మూడో పిల్లను తనకిచ్చి పెళ్ళి చేయమని ఆయన మేనల్లుడు మాయాండి కోరాడట. ఆతని కోర్కె దేవర్ నిరకరించేసరికి నాకిచ్చి పెళ్ళి చేయక పోయావో... నిన్నేం చేస్తానో చూడు అని శపథం కూడా పట్టాడట వీటిని లక్ష్యం చేయక దేవర్ తన కూతుర్ని వేరే ఒకనికిచ్చి వివాహం చేసేశాడట దాంతో ప్రతీకారవాంఛ బయలుదేరిన మాయాండి తన తమ్ముడు శంకర్ సహాయంతో సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసునుంచి వస్తున్న దేవర్ని ఆపి, కత్తితోనూ కొడవలితోనూ అన్నా దమ్ములిద్దరూ ఆయన్ని 11 చోట్ల గాయపరచి చంపేశారట. పెరుమాళ్‌దేవర్ దాగా స్థితిపరుడట.

ప్రేమికుని అఘాయిత్యం!

తాను ప్రేమించిన అమ్మాయిని మరొకడు (ప్రేమిస్తున్నాడని తన స్నేహితుడే) అనుమానం వచ్చిన పోలీసు కానిస్టేబుల్ ఒకాయన తుపాకీతో నేరుగా ఆ స్నేహితుని యింటికి వెళ్ళి తలుపుతట్టి, తలుపుతెరిసిన తన స్నేహితుని తల్లిని ఢాం అని కాల్చి చంపేశాడట ఆనక వో ఆటోరిక్షావానిని భయపెట్టి ఆ రిక్షాలో ఎక్కి గిర్‌నీర్ కొండలకు పారిపోయాడట పోలీసు మాత్రం విడక వెంటాడి అతన్ని పట్టుకుంది. ఇది మైసూర్‌లో జరిగింది

తొందరపడిన తనయుడు

గుడియాత్తానికి చెందిన పురుషోత్తమన్ అనే 22 ఏళ్ళవ్యక్తి తనకు వివాహం చాలా అత్యవసరమని కనుక ఆ విషయం వెంటనే చూడవలసినదనీ తనతండ్రికి ఎరుక పరచాడట కాని ఆ తండ్రి తన కొడుకు మాట పెడచెవినపెట్టి కూర్చున్నాడట. పురుషోత్తమన్‌కి జీవితంమీద విరక్తిచెంది పాలలో ఎలుకలమందు కలుపుకుని, త్రాగి, చనిపోయాడట.

బస్సుని బందీచేసిన విద్యార్థులు

నామక్కల్‌పూరునుంచి కాలేజి వో అయిదుమైళ్ల దూరంలో వున్నదట. ఈ కాలేజికి వో బస్సు వేయవలసినదని రెండు నెలలక్రితం తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధిని విద్యార్థులు కోరితే అప్పుడియన అని, అనక ఆ విషయాన్ని చూడలేదని కోపగించిన విద్యార్థులు నామక్కల్ నుంచి తిరుచంగోడు వెళ్తున్న వో ప్రయాణికుల బస్సునాపి, దాన్ని తమ కాలేజీలోకి పట్టించి, అక్కడ ఆపి, ప్రయాణికులను దిగి, వేరే బస్సులో వెళ్ళమని చెప్పారట. ఆ బస్సును వారు తమ కాలేజీఆవరణలో బందీ చేశారట ఎదర్కన్నా వాట్సన్!

పిల్లలులేని డాక్టర్ కబుర్లు!

సెక్సును గురించి పిల్లలు చిన్నప్పటి నుంచి దారాళంగా తెలుసుకోవాలని, అంతేగాక వారు వివాహానికి పూర్వమే తమ యిష్టం వచ్చినవారితో యదేచ్ఛగా లైంగిక సంబంధం పెట్టుకోవచ్చుని, పెట్టుకోవాలని 61 ఏళ్ళ డాక్టరు హెమ్మింగ్ లండన్‌లో విపులీకరించారట. పిల్లలు పెళ్ళయ్యే వరకూ వంటరి పక్కమీదే.... అన్న ఛాందసాలకు సొడ్డు వేయాలని ఆయన వివరించారట— ఆయనకు పిల్లల్లేరట.

ప్రౌఢని వివాహమాడాలనుకున్న యువతి

లాక్‌వెల్లీ (ఫారెను)లో 25 ఏళ్ళ మిస్ ప్రాన్సినైట్ అనే యువతి 39 ఏళ్ళ మెజోరిజోన్స్ అనే ఆమెను వివాహమాడ గోరిందట. మెజోరిజోన్స్ ముగ్గురు పిల్లలతల్లేగాక, అంతక్రితం రెండుసార్లు వివాహం చేసుకుందట (పురుషుణ్ణే అయ్యుంటుంది) ఈ విపరీతాన్ని తర్కిస్తూ ఆ దేశపుకోర్టు దీనికి ఎంతమాత్రం అంగీకరించేది లేదు పొమ్మందట. ఆ యిద్దరు స్త్రీల తరపు న్యాయవాది యీ తీర్పుని, ఇంతటితో వూరుకోనేదిలేదని, దీనిని సుప్రీం కోర్టు వరకూ కూడా తీసుకువెళ్ళి అటో, ఇటో తేల్చి తీరతానని అన్నారట



సిగరెట్లపై 'ఆరోగ్యానికి మంచిదికాదు' హెచ్చరిక

సిగరెట్లు ఆరోగ్యానికి హాని చేస్తాయన్నవిషయాన్ని తెలిపే హెచ్చరికని వాటిపై వేయాలని, వాటికి సంబంధించిన ప్రకటనలని నిషేధించాలని రాయల్ కాలేజి ఆఫ్ ఫిజీషియన్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు సిఫార్సు చేశారు. అయితే యివి చట్టరూపాన్ని ధరించకముందే సిగరెట్ ఉత్పత్తి దారులలో భయాందోళనలు కలిగిన కారణంగా వారు అర్థంలేని కారణాలు చూపిస్తూ, శుష్కవాదనలతో ముందుకి వస్తున్నారు. ఒక వ్యాపారస్తుడు అమ్ముకునే వస్తువుని హీనపరచడం తప్పన్నది వారి మొదటివాదన. విషాలని తయారు చేయడానికి అనుమతి పొందినవారు వాటిమీద హెచ్చరిక ముద్రించనవసరంలేదనటంలా ఉంటుంది యిది. అదీ కాకుండా దీనికి దృష్టాంతం ఏదీ లేదు. అని ఉత్పత్తిదారులంటున్నారు. అంతేకాక న్యాయసమ్మతంగా అమ్ముతున్న వస్తువుని గురించిన మోసంలేనట్టి ప్రకటనలు రద్దుచేయడం యిది అని కూడా అంటున్నారు ఇది వితండవాదమే అవుతుంది దృష్టాంతం ఏదీ లేదనటం వాస్తవంకాదు సిగరెట్లు ఆరోగ్యానికి హానికలిగిస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. దృష్టాంతాలు ఉన్నాయి

విషపూరితమైన మందులపైన ఆవిషయం స్పష్టంగా సూచించబడి ఉంటుంది దానిని గురించిన హెచ్చరిక ఆమందులు ఉంచే అట్టపెట్టెలమీద కూడా వేస్తారు పాశ్చాత్య దేశాలలో, కూడా కొన్ని మత్తుని కలిగించే ఔషధాలమీద ఆరోగ్యానికి మంచిదికాదు అనే హెచ్చరిక ఉండాలన్నది చట్టబద్ధం చేయబడింది.

ఇక, మోసం లేనటువంటి ప్రకటనలు అన్న దాంట్లో అర్థం ఎంత ఉందనేది తార్కికంగా ఆలోచిస్తే అవగాహన అవుతుంది సిగరెట్లు మానవ శరీరారోగ్యానికి హాని చేస్తాయి కాబట్టి పాఠకులని ఆకట్టుకునే ఎలాంటి సిగరెట్ల ప్రకటనలైనా మోసంతో కూడినవే అవుతాయి. పొగాకువల్ల శరీరానికి కలిగే హానిని శాస్త్రం నిరూపించింది.

సిగరెట్ ఉత్పత్తిదార్లు స్వలాభాపేక్షతో సంఘానికి ప్రజారోగ్యానికి వాటివల్ల కలిగే హానివిషయం పట్టించుకోవడం లేదు పొగాకు వ్యాపారం అభివృద్ధి కోసం ప్రజలు తమ ఆరోగ్యాన్ని, ఉత్పాదకశక్తిని ప్రాణాలని పణంగా పెట్టలేరు, పెట్టరాదుకూడా.

శరీరపోషకాహారంపై విపరీత ప్రభావాలని కలిగించేవి, ప్రజారోగ్యానికి హాని కలిగించేవస్తువులని ఆహార నియమావళిలో నించి తొలగించే బాధ్యత, అవసరం రాజ్యాంగపరంగా ప్రభుత్వానికి ఉందని సిగరెట్ల ఉత్పత్తిదారులే కాకుండా యితరులుకూడా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఒకవారం విపరీతం

కోపానికి కారణం!

భద్రాచలములో కోపము వచ్చిన ఒకాయన తన మామగారు సుబ్బారావును, అత్తగారు సావిత్రమ్మను మామగారి తల్లిని కత్తితో పొడిచి, పారిపోయాడట. ఇంతకూ ఆయన కెందుకు కోపం వచ్చిందో తెలియలేదు. సావిత్రమ్మగారు మాత్రం ఆసుపత్రిలో చనిపోయారట.

మొదటితరగతి రైలుపెట్టె– ట్రంకుపెట్టె — స్త్రీశవం!

హౌరాస్టేషనుకు వచ్చిన అమృతసర్—హౌరా మెయిలు మొదటి తరగతి పెట్టెలో దొరికిన వో ట్రంకు పెట్టెలో ఒక స్త్రీ శవం వుందట 12వ తేదీనదొరికిన యీ శవం వివరాలింకా తేలలేదు.

భగవంతునిముందు భక్తుని ఆత్మహత్య

బెంగుళూరు కబ్బన్‌పార్కులో నున్న వో వినాయకుని గుడికి ఒక భక్తుడు వచ్చి మూడు ప్రదక్షిణాలు చేసి, దేముని ఎదుట చేతులు జోడించి నమస్కరించి, గమ్మున విషం తిని పడిపోయాడట. పోలీసు లతన్ని ఆసుపత్రిలో చేర్చిన పిమ్మట చనిపోయాడట.

కాన్సర్—ఆక్సిజన్

కాన్సరు నుంచి పారిపో అనే ముక్క పరుగు అలవాటున్న వారిపట్ల వర్తిస్తుందని జర్మనీకి చెందిన డాక్టరు ఎర్నెస్ట్‌వాన్ ఆకెన్ అన్నారట. శరీరానికి కావల్సిన కన్నా ఎక్కువ ఆక్సిజను పీల్చుకోడం వల్ల కాన్సరు రాకను అరికట్టవచ్చని కూడా ఆయన అన్నారట. కనుక పరుగు, ఈత వంటి అలవాటున్న వారి జోలికి కాన్సరు రాదట— లెటజ్‌హోప్ రన్ దెన్.





జోకులు కావివి

ప్రధానమంత్రి పదవికి శ్రీమతి ఇందిరాగాంధీ కన్నా తగిన వ్యక్తి లేనేలేరని, ఆమె గనుక ఎన్నికలలో వోడిపోడం జరిగితే అదోరకం విషాదమేనని న్యూయార్క్ టైమ్స్ అనే పత్రికలో ప్రఖ్యాతకవి, జర్నలిస్టు డామ్‌మొరేస్ వ్రాశారట. ఆయన యీ సందర్భంలో చవాన్, మొరార్జీదేశాయ్, తారకేశ్వరీసిన్హా, నందినిశతపతి వంటివారి అభిప్రాయాలూ కూడా సేకరించినట్టు రాశారట.

తమిళనాడులో సిండికేటు కాంగ్రెసు వారి ఉపన్యాసాలను, శ్రోతలనకి చెదరగొట్టడానికి ఎదురుపార్టీ వారు (డి ఎం కె) ఎబాగా బలిసిన ఎద్దులను, కుక్కలను ఆ గుంపుల్లోకి తోలారట.

ఎన్నికల సందర్భంలో తిరునల్వేలి, తిరుచ్చి మొదలైన జిల్లాలో సుమారు 2000 మైళ్ళ ప్రయాణం చేసిన తమిళనటుడు శివాజీగనేశన్ తన మీద మూడుసార్లు హత్యాప్రయత్నాలు జరిగాయని అన్నారట. తను ఎక్కడైనా ఎవరిచేతిలోనైనా యీ ప్రచార సందర్భంలో చనిపోతే, తన శవాన్ని తాను పర్యటించిన అన్ని గ్రామాలలోను వూరేగించమని, ఎన్నికలు, ప్రచారాలూ ఆపవద్దని, ఆయన తాను పని చేస్తున్న సిండికేట్‌ను కోరారట.

నూతిలో శవం!

బిజనూరు జిల్లాకు చెందిన నగీనా అనే వూళ్లో వో నూతిలో న్యూకాంగ్రెసు వ్యక్తి అతిక్‌రహమాన్ శవం దొరికిందట. శవం వంటిమీద ఏవిధమయిన గాయాలుకూడా లేవట పోలీసులు పరిశోధన మీద ఆయన చావు ఆత్మహత్యే అయ్యుండాలని, హత్యగా లేదని అన్నారట.

మహారాజా హత్యలోని అంతర్యం!

కృష్ణగఢ్ నుంచి మూడు మైళ్ళదూరంలో ఒక తోట బావిలో మహారాజా సమ్మర్‌సింగ్ శవం తేల గొట్టబడిందట. ఆయన తుపాకీలో పేస్టలు ప్రేల్చిన గుర్తుందట. ఈ విషయంలో పోలీసు విచారించి అసలు విషయాన్ని ప్రకటించింది. ఇది రాజకీయ సంబంధం కానే కాదట. సమ్మర్‌సింగ్ భీమ అనే ఒకతని సోదరితో అక్రమసంబంధం పెట్టుకుని, ఆమెకు కొంత పొలం రాసిస్తానని మాట యిచ్చి, అనక దాటవేశారట. దాంతో భీమకు ఆయన మీద కోపం వచ్చిందట. అంతేగాక పాటికులంవారు వీరిని కలుపుకోలేదట. ఆమె భర్త ఆమెను వదలిపెట్టేశాడట. ఆ కసితో భీమ ఆయన్ని ఏమార్చి అల్లంత దూరంలో వో అందమైన అమ్మాయి వుంది అని రాజాగారిని తీసుకువెళ్ళి, అక్కడ చంపేశాడట.

లైట్స్ ఆన్

కలకత్తా సంతోష్‌పూర్‌లో పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ని ఎవరో పొడిచారట. సీల్‌హట్టి అనే చోట ముఖర్జీ అనే ఆయన్ని కొందరు పట్టుకుని, కిరసనాయిల్ పోసి నిప్పంటించారట.

కుమార్ దిహి అనే చోట బాంగ్లా కాంగ్రెసు అభ్యర్థి దేవ్‌దత్తమండల్ అనే ఆయన్ని నడిరోడ్డుమీదెవరో పొడిచి చంపేశారట. ఎన్నికల ప్రచారం చేసుకోడానికి వెళ్ళడానికి కారులో ఎక్కుతుండగా గమ్మున ఆయన్ని పొడిచి చంపేశారటెవరో. 16వ తేదిరాత్రి సంతోష్‌పూర్‌లో దినేష్‌బెనర్జీ అనే ఆయన్ను ఎవరో పొడిచి చంపేశారట. సిల్దా అనే చోట తన పార్టీ ప్రచారం చేసుకుంటున్న సి.పి.ఐ. (యం) అభ్యర్థిని నక్సలైటులనుకునేవారు పొడిచి చంపేశారట.

విద్యాసాగర్ కాలేజీకి చెందిన కార్తీక్‌కుండు అనే విద్యార్థిని విద్యాసాగర్ కాలేజీ ఆవరణలోనే ఎవరో పొడిచి చంపేశారట. డండం ప్రాంతంలో 17 ఏళ్ళ అశోక్‌దాస్ అనే అతన్ని ఎవరో ఎత్తుకుపోయారట. అనక అతని శవం దొరికిందట.

18 వ తేదీన కలకత్తా—వెస్ట్ బెంగాల్‌లో ఎంత లేదన్నా సుమారు వో డజను హత్యలయినా జరిగి వుండుంటాయట. కలకత్తాలో ముగ్గురు, వొగ జిల్లాలో వో పోలీసు కాన్‌స్టేబుల్, వో విద్యార్థి శవాలు దొరికాయట. బెహ్లాలో యిద్దరు నక్సలైటు వ్యక్తులు తాము విసరబోయే బాంబులు విధివశాత్తు తమ చేతుల్లోనే ప్రేలడం వల్ల చనిపోయారట. కలకత్తాలో వో 10 మంది వ్యక్తులు మూకుమ్మడిగా వో యింట్లో జొరపడి, లోపల దొరికిన 23 ఏళ్ళ వ్యక్తిని చంపేశారట.


కలకత్తాలో హేమంతకుమార్ బాసు అనే (శ్యాంపూరు ఎసంబ్లీ అభ్యర్థి—ఫార్వర్డ్‌బ్లాక్) ఆయన 20వ తేదీ వుదయం 10—50లకు ఎన్నికల ప్రచారం కోసం వో ట్రాక్కులో ఎక్కుతుండగా ఆయన మీద కొంతమంది పడి, పొడిచి చంపేసి, పారిపోయారట ఇది శ్యాంపూరు టవును స్కూలు ప్రాంతంలో జరిగిందట.

బెజుపూరు ప్రాంతంలో కాంగ్రెసు వ్యక్తి ఒకాయనమీదపడ ఆయన్ను చంపేశారట ఎవరో.

లయ బద్ధంగా వినిపిస్తున్న రైలు శబ్దంలో మార్పు వచ్చింది. రైలువేగం తగ్గింది. స్టేషనులోకొచ్చి ఆగింది. రైలు ఎక్కేటప్పుడున్న తొందర, హడావిడి దిగేటప్పుడు వుండవు. పెట్టెలోని చాలామంది అప్పటికే చుట్టబెట్టి సిద్ధం చేసుకున్న సామానులతో దిగిపోతున్నారు. అందరికన్నా వెనుక సూట్‌కేస్ చేతబట్టుకొని కదిలాను నేను. అప్పటికే రైలెక్కవలసిన వాళ్లు తొక్కిడిగా తోసుకుంటూ వచ్చేస్తున్నారు. వాళ్లలో ఎలాగో చోటు చేసుకుంటూ రైలు దిగాను. ప్లాట్‌ఫారమంతా హడావిడిగా వుంది. చేతిలో పెట్టెలతో సంచులతో పరుగెత్తి అనువైన పెట్టెతలుపు దగ్గర చేరుకుంటున్నారు ప్రయాణికులు. పళ్లు, పుస్తకాలు, సిగరెట్లు వగయిరాలు అమ్మేవాళ్లు అరుస్తూ తిరుగుతున్నారు. ఈ సందడంతా కొన్ని నిముషాలే. కొద్దిసేపట్లో రైలు కదిలిపోయింది. ప్లాటుఫారంలో కోలాహలం తగ్గింది.

నే నెక్కవలసిన రెండవరైలు రావడానికింకా ఒకటిన్నర గంట టైముంది. రైల్వే కాంటీనులో టిఫిన్, కాఫీ తీసుకున్నాను. ఒకసారి ప్లాటుఫారం ఆ చివరి నుండీ ఈ చివరివరకు పచారు చేశాను. దూరంగా ఒక వైపున వేపచెట్టుక్రింద ఏకాంతంగావున్న సిమెంటు బెంచీ నన్నాకర్షించింది. దానిపై కూర్చొని చూస్తే దూరాన ఎక్కడో మైదానంలో స్కూలు పిల్లలు పుట్‌బాల్ ఆడుకోవడం కనిపిస్తుంది. స్టేషను ప్రాంతాల్లో దగ్గరే ఎక్కడో సినిమాపాటలు వినిపిస్తున్నాయి.

కొంతసేపటి క్రితం వదలివచ్చిన స్వగ్రామం మీదికి, నిన్నటిరోజున జరిగిన పెళ్లి చూపులపైకి జారుకున్నాయి ఆలోచనలు. ఇంటివద్ద నాకు అన్నయ్య, వదిన అమ్మ మాత్రం వున్నారు. అన్నయ్య స్కూలు చదువులకు మించి చదవలేదు. తండ్రి మరణానంతరం ఇంటె యాజమాన్యం మీద పడడంవలన వ్యవసాయం చూసుకుంటూ ఇంటిపట్టునే వున్నాడు. ఆయన ఏదో అర్జంటు విషయంగా రమ్మని వ్రాస్తే నాలుగురోజుల క్రిందటె స్వగ్రామంవెళ్లి తిరిగి వస్తున్నాను. మావూరు తాలూకా కేంద్రమేకాక మంచి వ్యాపార కేంద్రమనికూడా ప్రతీతి.



ఎక్కవలసినరైలు

బి. యస్సీ ప్రథమశ్రేణిలో పాసయినా నేను పై చదువులకు పోలేదు. కారణం. ఎంతచదివినా ఉద్యోగం చేయవలసిందే. ఎమ్మెస్సీ చదివితే అన్నయ్యకు ఇంకో రెండేళ్ళు శ్రమ ఇవ్వవలసి వస్తుంది. ఎమ్మెస్సీ చదివినా ఉద్యోగాలు రానివారిని కొంతమందిని నే నెరుగుదును. చదువులకు విలువతగ్గి ఉద్యోగానికే విలువవున్న రోజులు వచ్చాయని నేను గ్రహించాను. కనుక పరీక్షలు పూర్తి అయినప్పటినుండి ఉద్యోగాన్వేషణ చేయగా ఆరునెలలకు వున్న వూరికి రెండువందలమైళ్ల దూరంలో బ్యాంకులో మంచిపనే దొరికింది. ఆరంభం చిన్నదే అయినా ముమ్ముందు పురోగమించడానికి ఎక్కువ అవకాశాలు వున్న వుద్యోగమది. పనిలో చేరినప్పట్నుండి అవకాశ మొచ్చినప్పుడంతా అమ్మ నాపెళ్లివిషయం కదిలిస్తూనే వుంది. ఆమె అరోగ్యం కొంత బాగుండక పోవడంవల్ల ఇటీవల ఈ విషయంలో ఆమెకు ఆతురత మరీ ఎక్కువయింది.

ఊరు చేరిన రోజు అన్నయ్య ముక్తసరిగా చెప్పినదాన్నిబట్టి తెలిసింది— మా వూళ్లోనే బట్టలకొట్టు, కొంత వ్యవసాయం ఆస్తీవున్న వ్యక్తి గోపాలరావు. అతనికిద్దరు కూతుళ్లే సంతానం. రెండవ అమ్మాయికి పెళ్లికావలసివుంది. నన్ను పిలిపించిన కారణం పెళ్లిచూపులు. అన్నయ్య బయట కెళ్లిన తర్వాత వదిన చెప్పిన మాటలను బట్టి తెలిసింది. ఆ అమ్మాయి వదినకు తెలుసుట. పేరు వసంత. వయసు పదహారు పదిహేడేళ్లు వుంటుంది. చాలా మంచి పిల్లే కాక బలే అందమయిందికూడ. ఈ సంబంధం వదలుకోడానికి ఏకారణమూ లేదు.

మనిషి జీవితంలో మరువలేని మధుర స్మృతి విషయాల్లో పెళ్లిచూపులు ఒకటి. కారూపు రేఖల్నిగూర్చి స్నేహితులు తదితరులు పలువురు వ్యక్తపరచిన అభిప్రాయాలు ఇదివరకు వినివున్నాను కనుక నేను నచ్చకపోవడం అనేప్రశ్న పెళ్లిచూపుల్లో సాధారణంగా వుండదని నాకుతెలుసు. మాతో వచ్చిన మధ్యవర్తి మాకు గోపాలరావుకు వుమ్మడి బంధువు. మాటకారి. అందరి బదులూ ఎడతెరిపిలేకుండ అతడే మాట్లాడేస్తున్నాడు, నవ్విస్తున్నాడు. ఆమాటలమధ్య రోజాపూల సువాసన గుప్పుమంటి. మొదటగా నాకు కనిపించింది పారాణితో అలంకరింపబడి గడపదాటి వస్తున్న అందమైన ఒకపాదం. తల దించుకొని వదిన ప్రక్కనే నడచివస్తున్న ఆ అమ్మాయి మ ‹ ం అప్పుడు నాకు పూర్తిగా కనుపించలేదుగాని అనడక తీరులో ఆకర్షణ వుందనిపించింది. 'ఎంత వరకు చదువుకున్నావు? పేరేమి?' వగయిరా అమ్మఅడిగిన ప్రశ్నలకు చిన్నగా ఏవో సమాధానా లిచ్చింది ఆ అమ్మాయి. వెళ్లిపోయే ముందు ఒకే ఒకసారి మాత్రం తలయెత్తి నావైపు చూసింది. ముఖంలో ఎంతోకళ, అందం వుంది. పెద్దవయిన ఆ కళ్లు తమ మూగభాషలో ఏదో సందేశాన్ని నాకిచ్చాయి అనిపించింది. అందాన్నిచూసి పరవశించిన నా మనసులో కల్గిన భావం మాత్రమే అది.

ఇంటికి తిరిగివచ్చిన మీదట కట్నాలు, కానుకలు, ముహూర్తం తదితర విషయాలపై అమ్మఅన్నయ్య వదినలమధ్య సంభాషణ కొనసాగడంగమనించాను. 'ఊరికెళ్లి వారం రోజుల్లో ఏదోఒకటి నిర్ణయించి ఉత్తరం వ్రాస్తాను. అంతవరకు తొందర పడకుండా వేచివుండమని నా అభిప్రాయం వెలిబుచ్చాను. ఆమాటల్లో అర్థమున్నట్టు వాళ్లకేమీ అనిపించలేదు. పిచ్చివాడి మాటలను విన్నట్లు ఆశ్చర్యంగా నావంక చూశారు అమ్మ, అన్నయ్య. నిజమే ఈ సంబంధం వద్దనుకోవడానికి కారణమేదీ లేకపోవడం వాస్తవమే. భానుమతి అధ్యాయమింకా ముగియలేదని, భానుమతినుండి ఏదో వర్తమానం వస్తుందని నా హృదయాంతరాళంలో ఒక భావమింకా వుంది. అందుకే ఈ విషయాన్నిగూర్చి సావధానంగా, ప్రశాంతంగా ఆలోచించిగాని ఏ నిర్ణయము చేయదలచుకోలేదు.

ఆలోచనల్లో కాలగమనాన్ని నేను గమనించలేదు. నే నెక్కవలసిన రైలు స్టేషనుతోకొచ్చి నిలిచింది. ప్లాటుఫారమంతా తిరిగి కోలాహలం. ప్రతివారిలో తొందర, హడావిడి. గజిబిజిగా వుంది జనసమూహం. ఆలశ్యమయిపోయిందనే ఆదుర్దాతో వడివడిగా వెళ్లి ఒక పెట్టె తలుపుదగ్గర చేరుకున్నాను. ఊచ అందుకొని రైలెక్కే ప్రయత్నంలో వుండగా ప్రక్కనవున్న మొదటి తరగతి పెట్టెలోనుండి దిగుతూ కనిపించింది భానుమతి. కాసేపు అచేతనుణ్ణయ్యాను. ఆమె నన్ను చూడలేదు. ఆమె వెంట ఎవరో పెద్ద వయసున్న స్త్రీ కూడ రైలు దిగింది. రైలెక్కే ప్రయత్నం మాని దిగివచ్చి వారిని చూస్తూ నిలుచున్నాను.

* * *

నా స్కూలు చదువంతా వున్న ఊళ్లోనే సాగిపోయింది. కాలేజిలో డిగ్రీ చదువుకు మాత్రం వూరొదలి రావలసొచ్చింది. కాలేజిలో, హాస్టల్లో ఫీసులు కట్టడం పూర్తి చేశాను. కొత్త వూరు, కొత్త కాలేజి, అందరూ కొత్తవాళ్లే. అప్పటికింకా స్నేహితు లెవ్వరు లేరు. క్లాసులింకా ప్రారంభం కాలేదు. పనేమిలేదు. కాలేజంతా చూడాలని వరండాల వెంబడి తిరుగుతున్నాను. ఇంగ్లీషు డిపార్టుమెంటు ప్రాంతంలో పూలకుండీలు అమర్చబడి వున్నాయి. ఒక కుండీలోని మొక్కకున్న వికసించిన ఎర్రగులాబీ పూవు నాకెంతో అందంగా కనిపించింది. ఎన్నో కోట్ల వ్యయంతో కొన్నివేలమంది శ్రమిస్తే తాజమహలు తయారైంది. ఎంతో అద్భుతంగా వుంటుందంటారు. ఈ హంగులన్నీ లేకుండా సృష్టించబడిన, ఈ గులాబీ పూవులో అంత అందం లేదా? అనిపించింది. సెలయేటిలో గులకరాళ్లమీదుగా ప్రవహిస్తున్న నీటి శబ్దంవలె కిలకిలమని శ్రావ్యమైన నవ్వు చిన్నగ వినిపించింది నా వెనుక. తిరిగి చూడగా ఇద్దరమ్మాయిలు నాజూగ్గా నడచి వస్తున్నారు. నవ్వు తాలూకు అందమైన అమ్మాయి నా వైపు క్షణకాలం వింతగా చూసింది. ఆకుపచ్చని రవిక, అదే రంగు పూలున్న పావడపై 'తెల్లని పయిట, ముఖంమీద పడుతున్న ముంగురులు, జడలో మల్లెపూలు, చేతికి వాచి వున్నాయి. అదే భానుమతిని నేను మొదటిసారి చూడ్డం.

ఆ అమ్మాయి నేను క్లాస్‌మేట్స్ కావడం వలన తర్వాత ఎన్నోమార్లు చూడవలసి వచ్చింది. పుస్తకం పురుగును కాకపోయినా చదువుమీద నా కెక్కువ శ్రద్ధ వుండేది. స్నేహితులు, సినిమాలు, తిరుగుళ్లు, అల్లరి తక్కువ. ఒకరిద్దరు మాత్రమే స్నేహితులు. అన్నిటిలో మొదటిమార్కు, తప్పితే రెండవమార్కు వస్తూవుండేది సాధారణంగా. భానుమతి చదువులో యూవరేజి

'నాకు రోజూ రాగి మొదటి ఆహారము!'



ఇనుము, క్యాల్షియమ్ మరియు అయోడిన్ తత్వములను కూడా అతను పొందును. నిజానికి, అతడు 8 ముఖ్యమైన ఖనిజములు మరియు 11 అత్యావశ్యకమైన విటమిన్లను పొందును. ఇవన్నీ ఒకే ఒక విమ్‌గ్రాన్ టేబ్లెట్‌లో వుంటాయి!

విమ్‌గ్రాన్‌లో మంచి ఆరోగ్యము. శక్తి మరియు ఎక్కువ సహన శక్తికి అత్యావశ్యకమైన అన్ని విటమిన్లు, ఖనిజములు వున్నాయి... ఉదాహరణకు, సరిగా రక్తము ఏర్పడుటకు, సహన శక్తి ఎక్కువగుటకు దానిలో రాగి వుంది. విమ్‌గ్రాన్‌లో ఇతర విటమిన్లు, ఖనిజములు వుండుట వలన, అతనికి చక్కటి చర్మము, నేత్ర దృష్టి, దృఢమైన పళ్లు మరియు ఎముకలు వున్నాయి.

ఇప్పుడు గుండ్రని ఆకారపు



విమ్‌గ్రాన్®

ఒకే ఒక విమ్‌గ్రాన్ బిళ్ళ రోజంతా శక్తివంతముగా వుంచును

వివిధ విటమిన్లు మరియు ఖనిజములుగల బిళ్లలు

SQUIBB®
SARABHAI CHEMICALS

® ఇ. ఆర్. స్క్విబ్ & సన్స్ ఇన్‌కార్పొరేటెడ్‌వారి రిజిస్టర్డ్ [illegible]

Shilp VIM-1-A/70 Tel

కన్నా కొంచెం తక్కువే. కాని క్లాసులో వున్న అమ్మాయిల జట్టుకు లీడర్. చిలిపి తనం అల్లరిపాలెక్కువ. వేష భాషలనుబట్టి ధనవంతురాలనిపించేది. అమ్మాయిల విష యంలో నాకు చొరవ తక్కువ. వారికి నే నెప్పుడు దూరదూరంగా జారుకునేవాణ్ణి.

నేనంటే భానుమతికి అదో తమాషా, అలుసు. ఎందుకో బోధపడేది కాదు. మొదటి సంవత్సరం నేనెదురైనప్పుడంతా భానుమతి కెందుకో నవ్వు వచ్చేది. తల దించుకొని బలవంతంగా నవ్వాపుకుంటూ నడిచి పొయ్యేది. ప్రక్కనెవరైన అమ్మాయి వుంటే ఆమెకూ వచ్చేది నవ్వు. రెండవ యేడాది శృతి మించింది. నా వెనుక ఎప్పు డైనా అమ్మాయిల జట్టు వస్తూవుండటం తటస్థిస్తే 'శ్రీ రామచంద్రుడు' అనేది భానుమతి. స్నేహితురాళ్ళ బృందం నవ్వేది. నాకు ఇబ్బందిగా వుండి వేగం హెచ్చించే వాడిని. 'భలేరాముడు', 'బండరాముడు' 'ముంటి రామారావు' వగైరా కూడ విని పించేవి అడపాదడపా.

రెండవ సంవత్సరాంతంలో కాలేజి వార్షి కోత్సవం పాటలపోటీలో పాల్గొన్నాను.

ఎ ప్రేవలసినరెలు

ప్రథమ బహుమతి వచ్చింది. ఆరోజున సాయంత్రం అమ్మాయిలజట్టు ఎదురైనప్పుడు సగర్వంగా నిలుచున్నాను.

'కంగ్రాచులేషన్స్! రామారావుగారూ మీరు పాడగలరని మాకెవరికీ ఇంతవరకు తెలియదండీ,' అంది భానుమతి. 'థాంక్స్,' అన్నాను ధైర్యంగా. ఆతర్వాత నన్నుచూసి అమ్మాయిలు నవ్వడంలాంటివి చాలావరకు తగ్గిపోయినయ్.


మూడవయేడు ఆరంభంలో మా క్లాసంతా ఒకసారి పిక్నిక్కెళ్ళాను. అందరు ఏదో ఆడుతున్నారు, పాడుతున్నారు, గంతులేస్తు న్నారు కొందరు. నేను నారూంమేట్ గెస్ట్‌హౌస్ వరండాలో కుర్చీలేసుకొని కేరమ్స్ ఆడుతున్నాము. 'మేము ఆడుతా మండీ! డబుల్స్‌గేం బాగుంటుంది.' అంటూ భానుమతి ఆమెస్నేహితురాలొకరు వచ్చారు. భానుమతి నేను ఒకజట్టు మిగత ఇద్దరు ఒకజట్టుగా మిక్సెడ్ డబుల్స్ ఆడాము లంచ్‌కి పిలుపొచ్చేవరకూ. ఆ తర్వాత కాలేజిలో 'రామారావుగారు! మీ ఫిసిక్సు రికార్డొకసారి ఇస్తారా' అనో లేక ఇంకేవో పుస్తకాలు అడిగి తీసుకొంటూ వుండేది తరచూ. 'రేపు మనకు కెమిస్ట్రీ క్లాసు వుందా?' అనో 'ఈ క్లాసు మహా బోర్ కదండి?' అనో ఏవో ప్రశ్నిస్తూ వుండేది. 'మీకు ఫస్టుమార్కు లెలా వస్తాయో కాని నాకు మహా తలనొప్పిగ వుందండీ ఈ ఫిసిక్సు. కనీసం పాసు మార్కులు రావడానికైనా కొన్నిహింట్స్ చెప్పకూడదూ మీరు', అని అడిగిందొకసారి. అనవసరంగా ఎక్కువ చొరవ తీసుకొం మాట్లాడుతున్నట్లు అనిపించేది అప్పు డప్పుడు. ఏమైనా ఎగతాళిచేయడం మానడని వలన మూడవ సంవత్సరం హాయిగానే గడ చింది. పరీక్షలై వెళ్ళేముందొకసారి ఎప్పు డైన తమాషాకు ఏదైన అని మిమ్మల్ని ఇబ్బంది పెట్టివుంటే మరచిపోతారుగదూ', అంది నవ్వుతూ. 'తప్పకుండా,' అన్నాను నేను.

ఊరికొచ్చిన తర్వాత అప్పుడప్పుడు భాను మతి ఆమె అందమైన నవ్వు గుర్తు కొచ్చేవి. ఆమెను తిరిగి చూడ్డం తట స్థించి వుండకపోతే కాలగమనంతో నేనామెను మరచిపోయివుండేవాణ్ణనుకుంటాను.

ఉద్యోగంలో చేరడానికి ఇంకో కొత్త వూరికి రావలసొచ్చింది. ఒకగది అద్దెకు తీసుకొని హోటల్లో భోంచేస్తూ వుంటు న్నాను. ఉద్యోగం సజావుగ సాగిపోతూవుంది. విరామ సమయంలో పుస్తకాలు చదవడం, పత్రికలు చదవడం, చిన్నరచనలు చేయడం సినిమాలు చూడ్డం చేస్తున్నాను. ఈ ఏకాంత జీవితంలో ఒక తీయదనం వున్న ట్టనిపించేది. ఉద్యోగం చేయడం ప్రారం భించిన తర్వాత సిగ్గుపాలు తగ్గి కొత్త వాళ్ళతోనయినా నిస్సంకోచంగామాట్లాడ్డం, చొరవ అలవాటుపడినాయి క్రమేణా.

'బ్యాంక్ డే' సెలెబ్రేషన్స్ జరిగాయి ఒకనాడు. ఆ రోజు వుద్యోగులంతా కుటుంబ సమేతంగా వచ్చారు. అతిథులు అందరు కలిసి స్త్రీ జనాభా ఎక్కువేవుంది. కార్యక్రమంలో నాదొకపాట చేర్చబడింది. స్టేజిమీద పాడుతూ మధ్యలో చూశాను, మొదటివరుస ప్రేక్ష కుల్లో కొందరు స్త్రీలమధ్య భానుమతిని. నేను చూసినప్పుడు నవ్వింది. అదే అంద మయిన నవ్వు.

ఫంక్షన్ ముగిసేటప్పటికి రాత్రి పది



గంటలు దాటింది. వెళ్ళిపోతున్న జనసమూహంతో భానుమతి మేనేజరుగారితో అతవి కారులో కూర్చోవడం చూశాను. మరునటి రోజు ఆఫీసులో పనిచేసుకుంటూండగా మధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో జవాను మేనేజరుగారు రమ్మన్నారని కబురు తెచ్చాడు.

'నిన్న నీపాట చాలా బాగుంది, మిస్టర్ రామారావ్' అన్నాడు మేనేజరు.

'థాంక్యూసర్'

'నీవు మా అమ్మాయి భానుమతి కాలేజిలో క్లాస్‌మేట్స్ అని చెప్పింది. నీకే మైన క్లాస్ వచ్చిందా బియస్సీలో ?'

'అవునండి. ఫస్ట్‌క్లాస్ వచ్చింది'

'నీవు ఫస్ట్‌క్లాస్‌లో పాసయితే మా అమ్మాయి అప్పే కూర్చుంది. 'ఫిసిక్సులో పోయింది. తిరిగి ఈ మార్చికి పరీక్ష వ్రాయదలచా వుంది. పాసయినా కాకున్నా ఏం ఫరవాలేదనుకో. డిగ్రీతో చేయవలసిందిఏమీలేదు. ఫిసిక్సులో కొన్ని సందేహాలున్నాయి నీవు కోచింగ్ ఇవ్వగలవని చెప్పింది. శ్రమ అనుకోకుండా ఈ కొద్దిరోజులు సాయంకాలంపూట కొంతసేపు మా ఇంటికొస్తూ వుండాలి'

'సరేనండి' అన్నాను.

'నీకు పెళ్ళయిందా ?'

'ఇంకా లేదండి.'

'ఎక్కడుంటున్నావు వూళ్ళో.'

'గది అద్దెకు తీసుకొని ఒక్కడ్నే వుంటున్నానండి. భోజనం హోటల్లో.'

'తప్పకుండా ఈసాయంకాలం నుండే రా,' అన్నాడు. సరేనని వచ్చేశాను.

మేనేజరు ఇల్లెక్కడో విచారించి తెలుసుకొని ఆ సాయంత్రమే వెళ్ళాను. మేనేజరు లేడు ఎక్కడికో వెళ్ళాడు. తిరిగి నన్ను కలుసుకున్నందుకు, వాళ్ళతండ్రి ఆఫీసులోనే ఉద్యోగం చేస్తున్నందుకు ఎంతో సంతోషం వెలిబుచ్చింది భానుమతి. నావూరు, కుటుంబ విషయాలు అడిగి తెలుసుకొని తనను గూర్చి చెప్పేటంతలోనే ఎనిమిదిగంట లవుతుంది ఫిసిక్సు పాఠాలు ప్రారంభించకుండానే శలవు తీసుకున్నాను. ఆ తర్వాత ఫిసిక్సు పాఠాలు చెప్పేవాడిని ప్రతిరోజు. ఫిసిక్సయాక ఎన్నో విషయాలమీద సాగేది మా సంభాషణ. మేనేజరు గతి తప్పకుండ ప్రతిసాయంత్రం క్లబ్బుకెళ్ళేవాడు. ఒక్కో రోజు నేనుండగానే తిరిగి వచ్చేవాడు. అలా అలా భానుమతికి నాకు సన్నిహితం

పెరిగిపోయింది. భానుమతిని కలుసుకున్న పుడియులే రోజులో ముఖ్యమైన అంశంగా మధురమైన కాలంగా మారిపోయింది నా దినచర్యలో. రోజంతా ఆ సమయంకోసం ఎదురు చూసేవాణ్ని. అందుకు భానుమతి అందం ఆకర్షణ మేనేజరు క్లబ్బుకు వెళ్లిపోవడం కూడా కారణాలు. ఏకాంతంగ వుండడంవలన ఎప్పుడు భానుమతిని గూర్చే తలపోస్తూ వుండడం పరిపాటి అయి పోయింది. నేనంటే భానుమతికి ఆకర్షణ వుందని రోజురోజుకు నాకు నమ్మిక ఏర్ప డుతూ వుంది. ఈ భావాలన్ని నా ప్రయత్నం లేకుండానే నాలో కలుగుతున్నాయి. అయినా నేనొక నిర్ణయం చేశాను. భాను

ఎక్కవలసిన రైలు

మతిని గురించిగాని, భానుమతితో నా సన్నిహిత పరిచయాన్ని గురించిగాని ఆఫీ సులో ఏ మిత్రునితోను ఎప్పుడూ ప్రస్తా వించలేదు. అందుకు నా నిదానం, ముందు చూపు, ఉద్యోగంమీద ప్రేమ, సంస్కారం కారణాలనుకుంటాను.

ఒకసారి మాటల సందర్భంలో భాను మతి తన మేనత్త కొడుకు లండన్‌లో చదువుకుంటున్నట్టూ కొన్నిరోజుల్లో చదువు పూర్తిచేసి రానున్నట్లూ చెప్పింది. ఆ రోజు నాకెందుకో మనసులో పెద్ద వెలితి ఏర్ప డింది. అన్నం సహించలేదు. రాత్రంతా నిద్దురరావట్టక ఆలోచనలతో గడిపాను. అందని ద్రాక్షపండుకొరకు అర్రులు చాచు తున్నానా అనిపించింది. నాకు తెలియ కుండానే నా హృదయంలో భానుమతి బలీయ మైన చోటు చేసుకుందని మాత్రం నిశ్చ యంగ గ్రహించానా రాత్రి. ఇందుకు బాధ్యత నా ఒక్కడిదేనా? భానుమతి ఎంతవరకు బాధ్యురాలు అని తర్కించుకున్నాను ఎంతో సేపు. ఏమైనా, ఆ రోజునుండి నాలో ఆతురత, చొరవ వద్దనుకున్నా అదుపు తప్పి ఎక్కువయినాయి. దాని పర్యవసానమే ఒకనాటి సాయంత్రం చిరుచీకట్లో గది మధ్యన నేను భానుమతి గాఢ పరిష్వంగంలో చేరిపోయాము. మా నాలుగు పెదవులు ఏక మైనాయి. పాడిదగ్గు వినిపించినట్లయింది. కంగారుగా విడిపోయాము. అస్తవ్యస్త మయిన ఆలోచనలతో అర్థంకాని భావాలతో వడివడిగా బయటకు నడిచాన్నేను. గదిదాటిన తర్వాత ఎక్కడో లీలగా చుట్ట పొగవాసన నాకు సోకినట్లనిపించింది.

మరురోజు ఆఫీసులో పన్నెండు గంటలకు తాకీదు అందింది. నాలుగువందల మైళ్ల దూరంలోవున్న వూరిలో బ్రాంచికి బదిలీ. ఆరోజే ఆ ఆఫీసునుండి విడుదల...ఉద్యోగం నాకు ముఖ్యం. తొందరపాటుగ మూర్ఖంగా ప్రవర్తించి తీరని నష్టం పొందదలచుకో లేదు. ఇతరులకు హాని కలుగచేయ దలచుకో లేదు. అందుకే ఆర్డర్సు మేరకు క్రొత్త చోటులో వెళ్లి చేరాను. ఈ గొలుసు ఇంత టితో తెగిపోలేదని ఏదో జరుగుతుందని అర్థంలేని ఆశ ఒకటి నాలో ఒకమూల చోటు చేసుకుంది. ఆ అనిశ్చితకాలంలోనే అన్నయ్య దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది.

* * *

ఇప్పుడు యిక్కడ భానుమతి తారసిల్లు తుందని నే ననుకోలేదు. నా సమస్యను ఆమే పరిష్కరించగలదు. చూస్తున్నానేగాని ఏం చేయాలో తోచలేదు. ఎవరో కారు డ్రైవ రులా వున్నతను పెట్టెలు తీసుకొని వెళు తున్నాడు. అతని వెనుక భానుమతి ఆమె వెంటవున్న ముసలావిడ వెళ్లి ముద్దుకున్ను లైనారు. అప్రయత్నంగా నేను వాళ్లవైపు నడిచాను. అప్పుడు కనిపించింది—భానుమతి కాలివేలికివున్న మెట్టె. ఒక్కక్షణం ఆశ్చర్యం కలిగింది. కాని మరుక్షణమే తేలికపడిన మనసుతో వెనుదిరిగి వచ్చేశాను. ●

కూర లూ గు ణా లూ!

గొఱ్ఱె మాంసం

పొట్టేలు మాంసం శ్రేష్ఠమైనది. బలము, వీర్యపుష్టి, దేహపుష్టి నిస్తుంది. పిత్త, వాత రోగులకు మేలు చేస్తుంది. శుక్రవృద్ధి చేస్తుంది. కఫాన్ని పెంచుతుంది.

ఆడగొర్రె మాంసం అపథ్యమైనది. ఆకలిచావు, గ్రహణి రోగములు గల వారు తినకూడదు అది అనారోగ్యకరమయినది.

గొర్రె మాంసంయొక్క దుర్గుణాలకు విరు గుడు—1. ఉప్పు, 2. సిరకా, 3. ఆవాల చూర్ణం, 4. జాజికాయ, 5. నీరుల్లి, 6 గరమసాలా.

ఊరపంది మాంసం

ఊరపందిమాంసం శరీరానికి సత్తువ నిస్తుంది సుఖ విరోచనాన్ని గావిస్తుంది. పైత్యాన్ని అణుస్తుంది.

గురుత్వంగా వుంటుంది అగ్నిమాంద్యం, కఫం, వాతం చేస్తుంది. ఇది అపథ్య కరమయినది

దీనియొక్క అరతులం ఎత్తు క్రొవ్వులో 2 చిన్నముల ఎత్తు ఆగాకర దుంప చూర్ణం కలిపి యిచ్చిన మూల వ్యాధి తగ్గుతుంది.

దీని దుర్గుణాలకు విరుగుళ్ళు— 1 కలి, 2 తుమ్మచెక్కరసం లేదా కషాయం 3. యవక్షారము, 4 మజ్జిగ, 5 తరవాణి.

అడవిపంది మాంసం

అడవిపందిమాంసం, వూరపంది మాంసం కన్నా వేగం జీర్ణమవుతుంది. శరీరానికి కాంతిని బలాన్ని యిస్తుంది వీర్యపుష్టి నిస్తుంది. క్షయ రోగులకు పైత్యరోగులకు, మేలు చేస్తుంది

మూత్రరోగులకిది మిక్కిలి అపథ్యకర మయినది. గురుత్వం అగ్నిమాంద్యం. వాతం, చేస్తుంది దుష్ట వ్రణములను పుట్టి స్తుంది. బాగా చెమటను పుట్టిస్తుంది బాగా మూత్రాన్ని గావిస్తుంది

దీని దుర్గుణాలకు విరుగుళ్ళు —1. యవ క్షారము, 2. మజ్జిగ, 3. తరవాణి,

దుప్పి మాంసం

దుప్పి మాంసం కొద్దిగా వేడి చేస్తుంది. దేహపుష్టిని, వీర్యపుష్టిని యిస్తుంది. శరీరాన్ని దృఢంగా ఉంచుతుంది. శీఘ్రంగా జీర్ణమవు తుంది.


గుల్మరోగం, విద్రధియును నాభివ్రణం, శూల, వాత పిత్తములు, కఫం పీనిని తగ్గించ డానికి తోడ్పడుతుంది. దీని తోక తినకూడదు. దీని తోకలో విషముంటుంది ఉష్ణ తత్వంగల శరీరుం కిది అపథ్యకరమయినది.

దుప్పిమాంసంయొక్క దుర్గుణాలకు విరు గుళ్ళు:—1. నెయ్యి 2. తేనె.

సేకరణ ఆకుండి నారాయణమూర్తి.

సోదరుడు; మిత్రుడు; పెద్దమొద్దు; ఆయనగారు

అమ్మకూచి!!



కె. రామలక్ష్మి

ముద్దుల భర్త, కష్టజీవి, జల్సా రాయుడు—ఇవన్నీ మగవాడు తన ఔన్నత్యం చాటుకొందుకు కట్టే వేషాల్లో కొన్ని. ఈ పాత్రలకి తగినట్టు అతగాణ్ణి ఎవరు రిహార్సలు చేస్తున్నారంటారు? ఎవరి ఆటల రూల్సు నేర్పిస్తున్నారంటారు? ప్రతి మగవాడి వెనకా తప్పక ఒక స్త్రీ ఉండి తీరుతుంది! ఒక సంగతి జ్ఞాపకం పెట్టుకు చూడండి—మన కర్మ—ఆ స్త్రీ మనకి ముందునుంచీ అక్కడ ఉంది. అతగాడి తల్లి ఎలా పెంచిందో—ప్రేమ అభిమానంతోపాటు క్రమశిక్షణా గట్టా నూరిపోసిందంటారా? లేక అతి ముద్దూ గారాం మప్పి దేశం మీదకీ, మీ మీదకీ వదిలిందంటారా? ఈ సంగతి మనకెలా తెలుస్తుంది — కట్టుకున్నాక క్రమంగా గ్రహిస్తాం. ఇక అతగాడి తండ్రి?! స్నేహపాత్రుడా యమఘాతకుడా? ఎలాంటి వాడైతేనేం—పిల్లవాడిపై అతని ప్రభావం పడే వుంటుంది. ఈ ఇద్దరి తరువాతే పైవాళ్ల ప్రభావం పని చేసేది—అతగాడి స్కూలు—అతగాడి వృత్తి ఉద్యోగాలు, స్నేహాలు. ఇంకొకటి—అతగాడే ప్రాంతాల వాడో కూడా చూడ్డం మంచిది—ప్రాంతీయ ప్రభావాలు కూడా మనకీ ఆయనగారికి తెలియకుండానే అతని చుట్టూ కనబడని వలలా అల్లుకుని ఉంటాయట.

మన జీవిత భాగస్వామిని కొంచెం పరిశీలనాత్మకంగా చూసి 'హో యబ్బో, ఈయన అందరిలాంటివాడూ కాదు. హుందాగా ప్రేమగా ఉంటారు' అని స్నేహితులందరికీ చాటేముందే — 'తలి తండ్రుల జీవితమే చిన్నపిల్లల కాపీ బుక్కు' అన్న సత్యాన్ని మరిచిపోకూడదు.

ఈ ప్రపంచంలో ఏ ఒక్క జీవినీ కలుసుకోక పూర్వం—పిల్లాడు ముందు కుటుంబానికి చెందుతాడు కదా. నే నెలా ఉన్నాను? నే నెలా సాధిస్తున్నాని ప్రపంచాన్ని అని తను ప్రశ్నించుకుందుకు అబ్బాయి తన కుటుంబంలోనే తన హీరోలని వెతుక్కుంటాడు. ఆ తరవాతే ఇతరత్రా తాను అనుకరించగల 'నమూనా' లున్నాయేమోనని చూడడం ప్రారంభిస్తాడు. అందుకే అతి విస్తారంగా అందరికంటె ఎక్కువగా అతని కుటుంబ ప్రభావం అతగాని పై ఉంటుంది

తొలిదొంత మగవాడంటే ఇలా ఉండా లన్న నమూనా ప్రసాదించేది తండ్రే. అయినా అతగాడికి సమాధానం దొరికేది—తండ్రి గారి భార్య వల్లే!

అబ్బాయిగారికి తనని గురించి; ఆడ వాళ్లను గురించి, ప్రేమను గురించి—ఇతరత్రా అనేక విషయాలను గురించి ఎలా తెలుస్తుంది? ఎవరు చెప్తున్నారు—అమ్మ. ఏ అబ్బాయిగారినేనా అడగండి అమ్మని గురించి ఏం జ్ఞాపకం వుందని. అమ్మ అంటే అతని దృష్టిలో ఎలాంటి



ఊహాలున్నాయని — "ఫరవాలేదనుకోండి" అంటూ ఇబ్బందిగా ముఖం పెట్టాడో విద్యార్థి. అబద్ధం సార్. అది శుద్ధ అబద్ధం. ఏ కొడుకూ తన తల్లిని గురించి ఏం తెలియనట్టు నటించినా ఏం తెలియకుండా ఉండడు. కొంపకి ఎంత దూరంగా పోయినా అమ్మ హస్తవాసిన పెరిగిన కూచిబాబు ఆ ప్రభావంనుంచి తప్పించుకోలేడు. ఇప్పుడు ఆలోచించి చూస్తే అనిపిస్తుంది — అమ్మకంటె నాన్నే నయం అని. కుటుంబాన్ని పెంచి పోషించవలసిన భారం మోసే స్త్రీగా యిప్పుడామెని చూడగల్గుతున్నాను" అన్నాడో ఆఫీసరు. 'అమ్మ ఎప్పుడూ పిరికిది. ఏదైనా డిసైడ్ చేయాలంటే నాన్నకి వదిలేసేది' కోపంగా అందొక కన్నె పిల్ల.

సంప్రదాయికంగా వస్తున్న నిజం ఏమిటంటే అబ్బాయి అంటే తల్లులకి మోజు ఎక్కువ. పెద్దవాడన్నా ఒక్కడే కొడుకన్నా మరీను.

అపేక్ష ఆదరణ అనురాగాలతో పాటు క్రమశిక్షణ కూడా పెంపకంలో ముఖ్య భాగంగా ఉంటే గాని తల్లి ప్రేమ పిల్లల మీద ముఖ్యంగా అబ్బాయిల మీద రాణించదు. కొంచెం మొండితనం, కొంచెం కరుకుతనం, తనకై తాను నిలబడ్డం లాంటివి తల్లి నేర్పుతుంది. చెట్టెక్కుతానంటే ఎక్కించడం కాదు ఎక్కనివ్వాలి. వోసారి పడతాడా? ఇంకోసారి జ్ఞాపకంగా జాగ్రత్తగా ఎక్కుతాడు. తన భయాలని అబ్బాయికి నూరిపోసి తండ్రంటే చిన్న చూపు చూసేలా చేయకూడదు. జీవితపు సత్యాలకి పరిచయంచేసి వదలాలిగాని తను తెలుసుకొన్న నిజాలు బోధించి వదలక్కర లేదు. అని గ్రహిస్తే చాలు తల్లి. ఇక తన ప్రేయసి నెలా చూస్తాడు — తల్లి అంటే అతనికున్న అభిప్రాయాన్నిబట్టే ఉంటుంది అతగాడి పాలపడ్డ ఆడకూతురి రాత! తల్లి గయ్యాళా? ఆడాళ్లంతా గయ్యాళివాళ్లు అని నిర్ణయిస్తాడు. అమ్మ కూచిగా కొడుకుని అతి ముద్దు చేసిందా—అలా అమ్మకి బదులుగా ఉండే ఆడదాన్నే ఆరాధించాలంటాడు. 'ఇలా అధికారం చెలాయించి మాటకిమాట అనే

(64 వ పేజీ చూడండి

మల్లెలు మరుమల్లెలు

యర్రం చంద్రశేఖరం

జరిగిన కథ

లక్ష్మయ్యగారొక మోతుబరి రైతు. శాంత ఆయనకి ఏకైక కుమార్తె. తల్లిదండ్రులు లేని మేనల్లుడు రామాన్ని చిన్నప్పటినుంచీ తనే పెంచి పెద్ద చేస్తాడు. లక్ష్మయ్య గారికి గుండె జబ్బు వస్తుంది. ఆయనకు శ్రమ యివ్వకుండా వుండటానికి రామం చదువు హెచ్. ఎస్. సి. తో ఆపేసి వ్యవసాయపు పనులు చూసుకుంటాడు. అతను పంచాయతీబోర్డు ప్రెసిడెంటుగా వుంటాడు శాంతను కాలేజి చదువుకు పంపిస్తారు. కాలేజిలో ఆమెకి శారద అనే బీదవిద్యార్థిని స్నేహితురాలవుతుంది. శారద విషాదగాథ శాంతను కదిలించి వేస్తుంది శాంత బలవంతం మీద శారద కూడా ఎక్స్‌కర్షన్‌కు బయలుదేరుతుంది ప్రభాకరానికి నీరజకు పెళ్ళిచెయ్యాలని అందరి సంకల్పం సెలవులకి శాంతతో వచ్చిన శారద సత్ప్రవర్తనతో అందరి అభిమానమూ సంపాదించుకుంటుంది ప్రభాకరం చేసిన దొంగతనాన్ని నీరజ బయట పెడుతుంది. ప్రభాకరంలో వస్తున్న మంచి మార్పుకు శ్రీపతి సంతోషించాడు. ప్రభాకరానికి కాశీలో వరప్రసాద మూర్తి స్నేహితుడయ్యాడు.

9.

ప్రసాద్ ప్రభాకరల స్నేహం అనతి కాలంలోనే వృద్ధి చెందింది. హాస్టల్ వార్డన్‌ను బ్రతిమిలాడి తనరూము మార్చుకొని ప్రసాదు రూముకు వచ్చాడు ప్రభాకరం.

ప్రసాదు చక్కని ఆదర్శభావాలుగల యువకుడు. శారీరకంగా ఎంత బలహీనుడో మానసికంగా అంత బలవంతుడు. అతనిది ఖమ్మం. పెద్ద ఆస్తిపరులు కాకున్నా తిన, కుడవ ఉన్న సంసారం. అతని కుటుంబంలోని వారంతా భగవద్భక్తి, సనాతనాచార పరాయణులు. చామనచాయతో కళగల ముఖంతో ఎప్పుడూ నవ్వుతూ, ఎదుటివారిని నవ్విస్తూ ఉంటాడు. అతని తాత గారికి కాశీలో అతనిని చదివించాలనే ఊహ తట్టిందట! వెంటనే ఆ విషయం ప్రసాద్ తండ్రికి చెప్పాడు. ఆయనగారు ఆ విషయం ప్రసాద్‌కు తెలియజేశారు. పితృ వాక్యాధురీణుడైన ప్రసాద్ తక్షణమే కాశీకి వచ్చాడు. ప్రభాకరం చేరినప్పుడే అతను కాలేజీలో చేరాడు. గ్రూపుభేదం ఉండబట్టి యిద్దరూ యింతకాలం సన్నిహితులు కాలేదు.

ఒకరోజు ప్రభాకరం దురుసుగా ప్రవర్తించి తోటి స్నేహితులతో వాదనకు దిగాడు. వాళ్ళు నలుగురున్నారు. ప్రభాకరం ఒక్కడే! అయినా వెనుకంజ వేయకుండా మాటలు దంచేస్తున్నాడు. చిలికి చిలికి వాన పెద్దదైనట్లు ఆ వాదన దెబ్బలాటగా మారబోతూ అటువైపు వస్తూన్న ప్రసాద్ దృష్టిని ఆకర్షించింది.

పరిస్థితి విషమించిందని ఊహించిన ప్రసాద్ ప్రభాకరానికి, అటు మిగతావారికి నచ్చజెప్పి ఆ తగువును అంతటితో అపు చేయించి బలవంతంగా అతనిని అక్కడి నుండి లాక్కువెళ్ళాడు.

అతనిద్వారా జరిగిన సంగతులన్నీ తెలుసుకున్నాడు ప్రసాద్. ప్రభాకరాన్ని ఆప్యాయంగా చూస్తూ 'తప్పునీదే ప్రభాకరం! నీతో పరిచయం కలిగినప్పటినుండీ నిన్ను జాగ్రత్తగా గమనిస్తున్నాను. నీలో ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. మరీ దుడుకుగా ప్రవర్తిస్తావు. నీతో చాలావిషయాలు మాట్లాడాలి. అలా గంగఒడ్డుకు వెళ్ళి మాట్లాడుకుందాం. ముందు మన మిద్దరమూ రూముకు వెళ్ళివద్దాం పద' అని హాస్టలు రూమువైపు దారితీశాడు ప్రసాద్.

రూములో తన షెల్ఫునుండి నాలుగైదు తెలుగు మ్యాగజిన్‌లు తీసుకొని 'పద...!ఇక వెడదాం' అని ప్రభాకరంతో బయలు దేరాడు.

ఇద్దరూ గంగఒడ్డుకు చేరారు. అక్కడ ఏకాంతంగా ఒక స్థలంలో కూర్చున్నారు.

వేసవి అప్పుడే ప్రారంభమౌతూ ఉంది. అది ఫాల్గుణమాసం. నీరెండ గంగానది జలాలపై బడి బంగారు రంగులీనుతూ పైడినది ప్రవహిస్తూ ఉన్నదా అనే భ్రమ కలిగిస్తూ ఉంది. విశ్వనాథదేవాలయ గోపురాలు తళతళ మెరుస్తూ స్వామి సన్నిధికి భక్తులను ఆహ్వానిస్తున్నాయి. సాధువుల గుంపొకటి వేదాంత గీతాన్ని ఆలాపిస్తూ ఆలయాభిముఖంగా కదులుతూ ఉంది. ఆ పరిసరాలలో యెక్కడ చూసినా పవిత్రత గోచరమౌతూ ఉంది.

'ప్రభాకరం... ! నీతో కొన్ని విషయాలు మాట్లాడాలని, నీతో పరిచయం కలిగినప్పటినుండీ అనుకుంటున్నాను. కాని వీలు చిక్కడంలేదు. ఇందాక జరిగిన ఆ సంఘటన నీతో మాట్లాడించాలని నన్ను ప్రేరేపించింది.'

'అంత ముఖ్య విషయమా ప్రసాద్!'

'అవును.'

'ఏమిటబ్బా...? అంత ముఖ్యవిషయం!'

'నీవు చూడబోతే చక్కని సంస్కార కుటుంబంలో జన్మించినవాడిలా కనిపిస్తున్నావు. దానికి విరుద్ధంగా ఉంది నీ ప్రవర్తన. చూడు ప్రభాకరం నేను చెప్పబోయే విషయాలను అపార్థం చేసుకోకూడదు. జాగ్రత్తగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావాలి. నా మాటలు నీవు ఆచరించినా అచరించకున్నా యిప్పుడున్న మన

ఈ స్నేహానికి ఎటువంటి భంగమూ వాటిల్ల కూడదు. నాకు తెలుసు. నీవు చక్కని తెలివితేటలు గలవాడవు. పట్టుదలగల వ్యక్తివి. వాటిని సక్రమ మార్గాలలో వినియోగ పరుస్తే ఎంతో పైకి వస్తావు' అన్నాడు ప్రసాద్.

ఆ మాటలకు ప్రభాకరం ముఖం చిట్లించాడు—

'నా మాటలు అపార్థం చేసుకోకూడదు. ఆ మాటలు నీకు నచ్చితే ఆచరణలో పెట్ట ప్రయత్నించు. నా మాటలవల్ల మన ఈ స్నేహానికి ఎటువంటి భంగం వాటిల్ల కూడదు. మానసికంగా నీవు బాధపడ కూడదనీ, రెండవసారి హెచ్చరిస్తున్నాను.'

'అలాగే ప్రసాద్ ! చెప్పు. జాగ్రత్తగా వింటాను. ఇంత ఆప్యాయతతో నావద్ద చొరవ తీసుకొని చెప్పేవాళ్ళ మాత్రమెవ రున్నారు ?' అని నాలుక కరుచుకొని 'ఉన్నారు...కాని నేనే దూరం చేసుకున్నాను పాపం ఎంత అవస్థపడుతుందో?' అని ఊరుకున్నాడు ప్రభాకరం.

'ఎవరు ? ఎక్కడో ఉండడమేమిటి ? అవస్థలు పడడమేమిటి ? నీకు వివాహమైందా ప్రభాకర్!' ప్రశ్నల వర్షం కురిపించాడు ప్రసాద్.

'లేదు. ఆ విషయాలన్నీ తర్వాత చెబుతాను. ముందు నీవు చెప్ప తలచుకున్న దేమిటో చెప్పు' అతను చెప్పబోయే విషయాలను చూచాయగా గ్రహించే, అడిగాడు ప్రభాకరం.

'ఏం లేదు ప్రభాకారం. నీ రక్తం అతి చురుకైనది. ఆ చురుకుదనంతో నిన్ను దుడుకుపనులు చేయడానికి ప్రేరేపిస్తూ ఉంది' విచిత్రంగా అతని బలహీనతను ఎత్తి చూపాడు ప్రసాద్.

'నేను చేస్తున్నపని తప్పని నాకు తెలుస్తుంది ప్రసాద్! కాని ఏం చెయ్యను? అణువణువునా జీర్ణించుకు పోయిన దురభ్యాసాలు నన్ను పిచ్చివాణ్ణి చేస్తూ ఉన్నాయి. ఏం చేయాలో తోచడం లేదు.' విచారపడుతూ అన్నాడు ప్రభాకరం.

'విచారపడకు. అన్నీ సర్దుకుంటాయి. నేను చెప్పబోయే సంగతులన్నింటినీ జాగ్రత్తగా విను. దీర్ఘంగా ఆలోచించు. ఆ తర్వాత నీకు కలిగే సందేహాలను నా శక్తి వంచన లేకుండా తీరుస్తాను. మధ్యలో



మాత్రం నన్ను ఆపకు' అని ప్రభాకరం ముఖంలోకి నిశితంగా చూస్తూ అన్నాడు ప్రసాద్.

అంతలో వీరు కూర్చున్న చోటుకు ఐదారుగజాల దూరంలో ఎవరో విద్యార్థులు, విద్యార్థినులు పిక్నిక్‌కు వచ్చి రాక్ అండ్ రోల్ డాన్సు ప్రారంభించారు. ప్రభాకరం తన ఎదుట ప్రసాద్ ఉన్నాడన్న విషయాన్నే మరిచిపోయి పరుగెత్తి వెళ్లి ఆ గుంపులో చేరి తను కూడా నృత్యం చేయసాగాడు. ప్రభాకరం అలా వెళ్లడం ప్రసాద్‌కు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. కొద్దిగా కోపం కూడా వచ్చింది. కాని సహనంతో అతని రాకకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. అరగంట తర్వాత ఆయాస పడుతూ వచ్చాడు ప్రభాకరం. ప్రసాద్ వైపు క్షమించమనే భావంతో చూస్తూ 'చెప్పానుగా ప్రసాద్! ఇలాగే ఆవేశంతో ప్రవర్తిస్తూ ఉంటాను. నన్ను క్షమించు.'

'ఫర్వాలేదులే కూర్చో' అన్నాడు ప్రసాద్ చిరునవ్వుతో.

'ఇక నీవు చెప్పతలచుకున్నదేదో చెప్పు' అన్నాడు ప్రభాకరం.

ప్రసాద్ ప్రారంభించాడు. మన జీవితాలు బుద్బుదప్రాయాలు. వర్షాకాలంలో వర్షం పడిన తర్వాత పారే నీటిపై పుట్టే బుడగలాంటి వాళ్లం మనం. క్షణానికి ఎన్నో పుట్టి పోతుంటాయి. వేదాంతం చెబుతున్నానని విసుగుపడకు. మనకున్న ఈ కొద్ది కాలాన్ని సద్వినియోగపరచి నలుగురిలో పేరు తెచ్చుకోవడం ఎంతైనా అవసరం. మనమూ బ్రతుకుతున్నాం. అడవిలో జంతువులూ బ్రతుకున్నాయి: మనకూ, వాటికీ తేడా ఏమిటి? వివేకము, అవివేకము వాటికి లేకున్నా మనకు ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నాయి. ప్రస్తుతం కొందరు ఆ వివేకాన్నే కోల్పోయి అంధకారంలో అలమటిస్తున్నారు.

'నీ వేషధారణ, ఆచార వ్యవహారాలు నాకు ఎంతో ఎబ్బెట్టుగా కనుపిస్తున్నాయి. కాని నాటికి తొంభై మంది నీలాగే గ్రుడ్డిగా ఒకరిని చూసి మరొకరు అనుకరిస్తున్నారు.

'వినయ విధేయతలతో, చక్కని సంభాషణతో ఎటువంటి వారినైనా వశపరచుకోవచ్చు. శత్రువుని కూడా మిత్రునిగా మార్చవచ్చు కాని దురుసుప్రవర్తనతో మిత్రులు శత్రువులౌతారు. నలుగురు నాలుగు రకాలుగా అనుకుంటారు. పైగా నీవు సాధించేది కూడా ఏమీ ఉండదు. ఆ రోజు గంగాఘాట్‌లో జరిగిన సంఘటనను గుర్తుకు తెచ్చుకో. ఆ జన్మాంతం ఆ కుటుంబం నిన్ను మరిచిపోదు, ధైర్యం చేశావు. తెగించావు. రక్షించావు. ఇహపరాలను రెంటినీ పూలబాటలుగా మార్చుకున్నావు.

'నీకు త్రాగుడు అలవాటైంది. అది ఎలా అయిందో నాకు తెలియదు. దానివల్ల నీవేమీ సాధిస్తున్నావు? కొంత కాలానికి అనారోగ్యం ఏర్పడుతుంది తప్ప వేరే ప్రయోజనమేమీ ఉండదు. 'అలవాటైంది. మానుకోలేక పోతున్నాను' అనే చాతకాని మాటలు చాలామంది నోట వినవస్తుంటాయి. ఆమాటలో అర్థం లేదు. అసలు ఎవరైనా ప్రయత్నిస్తేగా మానుకోగలగడానికి.

'చక్కని సంభాషణ, సత్ప్రవర్తన, మనను నలుగురిలో ఉన్నతస్థాయికి తీసుకు వెడుతుంది. అందుకు మనం నష్టపడేది కూడా ఉండదు. మనము భారతీయులము. మనదేశ ఆచార వ్యవహారాలే మనకు ఆచరణీయాలు. ఇప్పుడు రాక్ అండ్‌రోల్ నృత్యం ప్రారంభించగానే లేచివెళ్లి నిన్ను ఆహ్వానించకుండానే అందులో పాల్గొన్నావు. నృత్యం చేశావు.

'మన సాంప్రదాయంలో నాట్యాలు ఉన్నాయి. భరతనాట్యం, మణిపూరి, కథాకళి, జానపదనృత్యం యిత్యాదులు మన సాంప్రదాయ నృత్యాలలో ఉన్న లయ, రసికత, పాశ్చాత్య నృత్యాలలో లేవు. సభికులను హావభావ గాంభీర్యములతో తమలో తల్లీనమొనర్చుకొనే మన నృత్యాలలో ఉన్న ఔన్నత్యము, అంగవిన్యాసము ఆకర్షణ అసాధారణమైనది. మన సాంప్రదాయాలను మన లలితకళలను మనమే అణగద్రొక్కుకుంటూ పాశ్చాత్య నాగరికతను ప్రోత్సహించడం తల్లిరొమ్మును గ్రుద్దటంలా ఉంటుంది. మన సాంప్రదాయ నృత్యాలను చూస్తున్నప్పుడు.

మనముపొందే ఆ ఆనందము అనుభూతి మనము విహరించే ఆ ఊహాలోకాలు పాశ్చాత్య నృత్యాలు చూస్తున్నప్పుడు సాధ్యపడదు. అర్ధనగ్నంగా అర్థంలేని పదాలు పుచ్చరిస్తూ, అరిషడ్వర్గాలలో ప్రముఖ దుర్గుణమైన కామాన్ని రెచ్చగొడుతూ మనుష్యుల మతులను చలింపజేస్తాయి ఆ నృత్యాలు. అటువంటి వాటికి ఎంతదూరంగా ఉంటే అంత మంచిది.

'వీలున్నంతవరకు దురలవాట్లకుదూరంగా ఉండి సత్ప్రవర్తనతో, చక్కని క్రమశిక్షణతో మంచిపేరు సంపాదించుకో వలసిందని నిన్ను వేడుకుంటున్నాను. కనీసం ఈ స్నేహితుని తృప్తిపరచడానికైనా నీ ఈ ప్రవర్తన మార్చుకోక తప్పదు. నలుగురిలో నీవు 'సెభాష్' అని అనిపించుకున్ననాడు నేను గర్వంతో పొంగిపోతాను. నీవు నా ప్రాణ స్నేహితుడవని నలుగురిలో తలఎత్తి చెప్పుకోగలుగుతాను. ప్రభాకరం...! నీవు నా ప్రాణదాతవు. పేరు ప్రతిష్ఠలు సంపాదించుకో గలిగిననాడు నిన్నుచూసి ఆనందపడేవారిలో నేను మొదటివాడిని.

'చెడును బోధించేవారు వక్రవినయాలు చూపుతారు. ప్రలోభపెడతారు. స్వార్థంతో దురలవాట్లకు లోనుజేసి తమ అవసరాలను తీర్చుకుంటూరు. మనకు వారిమాటలు చేష్టలు ఎంతగానో నచ్చుతాయి. మంచి ఎప్పుడూ త్వరగా తలకెక్కదు. పైగా ఆ నిషాలో ఉన్నవారికి మంచి బోధించేవారి మీద కోపంకూడా వస్తుంది. అది మానవనైజం. దానికి అతీతుడుగాఉండేవాడే రాణిస్తాడు' అనిచెప్పి ఒక్కనిముషం విశ్రాంతిగా అటూ యిటూ కదిలాడు.

'ప్రభాకరం నేనిలా అంటున్నానని కోపగించుకోకు. దీర్ఘంగా ఆలోచించు. ఈ మధ్య జరిగిన రెండు సంఘటనలే సక్రమమార్గానికి నీకు త్రోవ చూపిస్తాయి. ఆ అమ్మాయిని రక్షించావు. జీవితాంతం వారి మనసులలో దేవుడివై మెదులుతావు. ఈ రోజు నలుగురితో పోట్లాడావు. ఆ నలుగురు మరొక నలుగురితో నీగురించి చెడును చెపుతారు. అలా చెడు త్వరగా ప్రచారానికి వస్తుంది. ఇంతే ప్రభాకరం...! నా ఈ మాటలను సహృదయంతో అర్థం చేసుకో. ఆచరించడానికి ప్రయత్నించు.' దీర్ఘంగా నిట్టూర్చాడు ప్రసాద్!

'ప్రయత్నిస్తాను. నీ సహచర్యంతోనైనా నేను నా అలవాట్లకు దూరమౌతాను. నన్ను మార్చావన్న కీర్తి, మంచి పేరు నీకైనా దక్కుతుంది.' నవ్వుతూ అన్నాడు

ప్రభాకరం.

'లేదు. ఆ పేరు నాకక్కరలేదు. ఈ పత్రికలలో ఉన్న వ్యాసాలు చదువు. నీకే తెలుస్తుంది. ఒకనాడు నేనుకూడా నీలాగే ప్రవర్తించాను. కాని ఈ అజ్ఞాత రచయిత వ్యాసాలు నన్ను మార్చాయి. నీవుకూడా ఈ వ్యాసాలను జాగ్రత్తగా చదువు. ఆ రచయిత, ఆడో, మగో తెలియడంలేదు. 'జ్యోత్స్న' అనే కలంపేరుతో రాస్తూ ఉంది. ఆ పేరు నపుంసక లింగానికి చెంది నది కాబట్టి అలాగే వ్యవహరిద్దాం. మీగడ తరకల్లాంటి స్వచ్ఛమైన భాషలో ఎంతో మృదువుగా నచ్చచెపుతాయి ఆ రచనలు. మంచిని గురించి, చెడును గురించి ఎన్నో విధాల తర్కించి తను చెబుతున్న విషయం సక్రమమైనదని ఎంతో సౌమ్యంగా నిరూపిస్తుంది; తన ఆ వ్యాసాలద్వారా. చాలా చక్కగా ఉన్నాయి. వాటిని చదివి ఆచరించ కుండా ఉండేవారు చాలా అరుదు' అని ఆ వ్యాసాలను పొగిడాడు ప్రసాద్.

'తప్పకుండా చదువుతాను ప్రసాద్! ఆచరణలో పెట్టడానికికూడా నా శాయ శక్తులా ప్రయత్నిస్తాను' భారంగా నిట్టూరుస్తూ అన్నాడు ప్రభాకరం.

'మర్చిపోయాను. నీతో చొరవతీసుకొని ఎవరో మాట్లాడారన్నావు. ఎక్కడో ఉండి ఏ వస్తువు పడుతుందోనని అనుమానపడ్డావు. ఎవరామె? ఆమెకు, నీకుగల సంబంధ మేమిటి?' ప్రభాకరం కళ్లల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు ప్రసాద్.

రోజాతో తన స్నేహం—ఆ తర్వాత శారద తనను హెచ్చరించడం — తను శారదపై కక్షగట్టి అనవసరంగా ఒకటికి నాలుగుసార్లు అవమానించడం—చివరకు అప నిందలువేసి ఆమెను యింటినుండి తరిమే యడం—అన్నీ సాకల్యంగా వివరించాడు ప్రభాకరం.

అన్నీ విన్న ప్రసాద్ పది నిముషాలు దీర్ఘంగా ఆలోచించాడు. 'ప్రభాకర్! నీవు మణిని కాలదన్ని మసిబొగ్గును ఆశ్రయి మిచ్చావ్ ఒకరు చేసిన నేరాలను ఎవ్వరూ అంత తేలికగా తనుపై వేసుకోరు. అలా వేసుకోవడానికి ఎంతో సంస్కార హృదయ ముండాలి. నీవు దొంగవని నలుగురికీ తెలి యడం ఆమెకు బొత్తిగా యిష్టం ఉండి ఉండదు. నీవు మరొక కోణంలోకూడా ఆలో చించి చూడాలి. బహుశా ఆమె నిన్ను ప్రేమించి ఉండవచ్చు. ఆమె ధనవంతురాలు కాకపోయినా మంచి గుణవంతురాలై ఉంటుందను కుంటున్నాను. ఏది ఏమైనా ఆమెను గురించి నీవు చెప్పిన తర్వాత నాకు ఆమెను చూడాలనీ, ఆమెతో మాట్లాడా లనీ, అనిపిస్తూ ఉంది. ఆమె ఎక్కడ ఉందో నీకే తెలియనప్పుడు నా కోరిక ఎలా నెరవేరుతుంది?' నిరాశతో అన్నాడు ప్రసాద్.

'బి. ఏ. పూర్తిచేశాకగాని నేను ఇంటికి వెళ్లను. ఇంటికి వెళ్లాక ఎక్కడ ఉన్నా సరే, ఆమె జాడతీసి క్షమాపణ కోరుకొనేంతవరకు నిద్రపోను ప్రసాద్' గంభీరంగా ముఖకవళి కలను మార్చుకొని దృఢంగా అన్నాడు ప్రభాకరం.

'చాలా సంతోషం! నీలో మార్పుకు యిది నాందీ ప్రస్తావన. భగవంతుడు ఎల్లప్పుడూ నీకు సాయపడుగాక' అని నలు వైపులా చీకట్లు దట్టంగా ముసరడంవల్ల తన రూముకు వెళ్లాలనే ఉద్దేశంతో లేచి నిలుచున్నాడు. ప్రభాకరం కూడా లేచాడు. ఇద్దరూ నెమ్మదిగా హాస్టలువైపు నడక సాగించారు.


* * *

లక్ష్మయ్యగారి మామిడితోటలో ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయింది—

ఇక ఆ భవనానికి రంగులు వేయించి, ఫర్నిచరు, పరికరాలు సమకూర్చాలి—

ఒకరోజు రామం తయారైన ఆ భవనం ముందు కూర్చొని ఆలోచనలో పడ్డాడు. 'ఈ నిర్మాణ కార్యక్రమంలో ఊరివారంతా సాయపడ్డారు. అలా సాయపడకపోతే నేను ఎంతో యిబ్బందిపడవలసి వచ్చేది. ముఖ్యంగా మామయ్య నన్ను ప్రోత్సహించి కుడి భుజంగా నిలబడబట్టి అనుకున్న వ్యవధికి ముందుగానే నిర్మాణం పూర్తయింది. తరు వాత కార్యక్రమం కూడా నిర్విఘ్నంగా కొనసాగితే, నా ఆశయం నెరవేరుతుంది. ఈ భవనం చుట్టూ చక్కని పూలతోట వేయించాలి. అందమైన క్రోటన్సుతో అస్పత్రి భవనం కళకళ లాడాలి. ఆ తోట ఆనారోగ్యంతో బాధపడే రోగులకు మాన సికోల్లాసం కలిగించాలి. మామయ్యతో చెప్పి రేపు హైదరాబాదు వెడతాను. సుందరాన్ని కలుపుకొని ఆ ఫర్నీచరూ, పరికరాలు కొనే సంగతి ఆలోచించి, వచ్చేటప్పుడు అన్ని రకాల పూలమొక్కలు తీసుకు వస్తాను. శాంతను, శారదను చూసినట్టు కూడా అవుతుంది. పరీక్షలు దగ్గర పడుతున్నాయి కాబట్టి జాగ్రత్తగా చదవమని హెచ్చరించి నట్లూ ఉంటుంది.

'శారద ఎంతో చురుకైనది. పాపం ఆ అమ్మాయిని ఏకాకిగా చేశాడా భగవంతుడు. ఆమెకు అండదండ ఉన్నట్లయితే యింకా ఎంతగా రాణించి ఉండేది! ఏమో? అండ దండలు సరియైన అవకాశాలుంటే అంత కష్టపడి చదివేదికాదేమో? ఆమె స్నేహంతో



'ప్రశ్నావళి' శీర్షికకి ప్రశ్నలను పంపేవారు కవరుమీద స్పష్టంగా 'ప్రశ్నావళి,' ఆంధ్ర సచిత్ర వార పత్రిక, మద్రాసు — 1.' అని వ్రాయకోరుతున్నాము.— సం॥

మల్లెలు...

శాంత మంచిమార్కులు తెచ్చుకుంటూ చక్కని ప్రవర్తన అలవరచుకుంటూ ఉంది. సత్సాంగత్య ఫలితం అలా ఉంటుంది.

'ఈ సంవత్సరంతో శాంత చదువు పూర్తవుతుంది. ఇద్దరూ కలిసి ఎం. ఏ. చదువుతానంటారేమో ? నాకు చదివించాలనే ఉంది. మరి మామయ్య ఏమంటాడో? ఆయన ఏమాత్రం ఒప్పుకోడు. ఇప్పటికే వివాహానికి ఎంతో ఆలస్యం జరిగిపోయిందని ఎంతో గొడవ చేస్తున్నాడు.'

పై విధంగా ఆలోచిస్తున్న రామానికి సమయం తెలియలేదు. ఆరోజు పౌర్ణిమ. అతని హృదయంలా ఆకాశం నిర్మలంగా ఉంది. తారలు మిణుకు మిణుకుమని మెరుస్తున్నాయి. వాటి అందాలను ఆనందంతో తిలకిస్తూ తనలో పొంగి పొరలుతూన్న సంతోషాన్ని అరికట్టలేక సతమత మౌతున్నాడు శశాంకుడు. మామిడి లేచిగుర్లను తిని మత్తెక్కిన స్వరంతో కుహూ... కుహూ...నాదం చేస్తుంది కోయిల. పౌర్ణిమజ్యోత్స్నతో తోటంతా ధవళకాంతులీనుతూ మెరిసిపోతూ ఉంది. ఆ మత్తెక్కిన ప్రకృతి సౌందర్యంలో శాంతను తన హృదయంలో ప్రతిష్ఠించుకొని ఆమెను గురించిన తీయని తలపులతో ఆ కూర్చున్న మంచంపై మగతగా కన్ను మూశాడు రామం. ఆ మగత నిద్రలో ఏవేవో ఊహా లోకాలలో విహరిస్తూ, మధుర స్వప్నాలను కంటూ గాఢ నిద్రలో మునిగి పోయాడు.

రాత్రి పది దాటినా యింటికి రాని కారణం ఊహించుకోలేక లక్ష్మయ్యగారు గాభరాపడుతూ పాలేరు పుల్లయ్యను తోడు తీసుకొని మొదట పంచాయితీ ఆఫీసు, దేవాలయం, ఆ తర్వాత రామం స్నేహితుల యిళ్ళు అన్నీ వెదికి బహుశా తోటలోనే ఉండి ఉంటాడనే ఉద్దేశంతో యిద్దరూ తోటవైపు నడక సాగించారు. ఆందోళన వల్ల లక్ష్మయ్యగారి ముఖంలోని ముడతలు రెట్టింపయ్యాయి. మౌనంగా నడుస్తూన్న వారిని చూసి ఆ సమయంలో ఎక్కడికి వెడుతున్నారో తోచక తికమక పడసాగారు అంతవరకూ మెలుకువతో ఉండి రచ్చబండ దగ్గర నుండి అప్పుడే యింటిముఖం పట్టిన రైతులు.

వేగంగా నడుస్తూన్న లక్ష్మయ్యగారిని ఆపుతూ 'పెదబాబుగారూ...ఆగండి...' అని అతనికి ముందు నడుస్తూన్న పాలేరు పుల్లయ్య ఆపాడు. వారు నడుస్తున్న దారికి అడ్డంగా చేతి మణికట్టులా పుష్టి కోడె త్రాచొకటి నల్లని ఛాయతో, వెన్నెల దాని మీద పడడంతో తళతళ మెరుస్తూ, చురుకుగా మెలికలు తిరిగి ప్రాకుతూ ప్రక్కన ఉన్న పొదలో దూరింది.

పల్లెవాసులకు పాములు కనపడడం వింత కాదు. పొలాలల్లో, చేలగట్లమీద, తోటల్లో, చెరువు ఒడ్డున తరచుగా కనుపిస్తూనే ఉంటాయి. కాని రామం యింటికి రాలేదన్న ఆందోళనతో పరధ్యానంగా రాత్రి పది దాటిన తర్వాత నడుస్తూన్న లక్ష్మయ్యగారి గుండె ఆ పామును చూడడంతో వేగంగా కొట్టుకోనారంభించింది. పాము కనుపించడం అపశకునంగా భావించారు లక్ష్మయ్యగారు. 'ఇంత రాత్రవుతు యింకా ఆ తోటలో ఏం చేస్తున్నాడో ఏమో? ఏ పొరపాటైతే అదే వెర్రి! పాములు ఇలా తిరుగుతున్నాయి. వాడికి ఏమైనా జరుగుతే?' ఆ ఊహ మనసుకు రాగానే భయంతో వణికి పోయారు లక్ష్మయ్యగారు. నడక వేగాన్ని హెచ్చించారు.

చిరునవ్వు ముఖంతో, నిర్మలమైన ముఖ కవళికలతో పసిపాపలా నిద్రపోతూన్న రామాన్ని చూసి హాయిగా నిట్టూర్చారు వారు. ఆయన మనసు కుదుటపడింది. గుండె దడ తగ్గింది. బరువుగా శ్వాస పీల్చారు.

'శాంతా...! ఎన్ని జన్మలకైనా నీవు నాదానివే! మనిద్దరినీ ఎవ్వరూ వేరు చేయలేరు.' పలవరిస్తున్నాడు రామం.

'రామం...రామం...' అని గట్టిగా పిలిచి రామాన్ని నిద్ర నుండి లేపారు లక్ష్మయ్యగారు.

శాంతపై అతనికిగల ప్రేమకు ముగ్ధులయ్యారు—

'ఏమిటి మామయ్యా...?' అంటూ గాభరాతోలేచాడు ముఖం చిట్లిస్తూ రామం.

అతని స్థితి లక్ష్మయ్యగారికి విస్మయాన్ని కలిగించింది. లక్ష్మయ్యగారు చిరునవ్వు నవ్వుతూ 'ఒరేయ్! ఏమిట్రా యిది? ఇంత రాత్రవుదు ఈతోటలో యిటువంటి బయలు ప్రవేశంలోని ఈ నిద్రేమిటి? పలవరింతలేమిటి? రాత్రి పదిదాటినా యింటికి

కాలేదేమో' అని భయపడ్డారు. చివరకు ఆగలేక పుల్లయ్యను తీసుకొని ఊరంతా వెదికి యిక్కడికి వచ్చాను.'

సిగ్గుతో తల వంచుకున్నాడు రామం—

'చల్లని ఈగాలి ఈవెన్నెల నాకు మైకాన్ని కలిగించాయి. కూర్చొని ఆలోచిస్తున్న నేను నాకు తెలియకుండానే నిద్ర పోయాను మామయ్యా!' ముసిముసినవ్వులు ముఖాన చిందిస్తూ అన్నాడు రామం.

'సరే! సంబరం! నీవేమో యిక్కడ నిద్రపోతూ కలలు కంటున్నావు. మేమేమో నీవు యింకా రాలేమిటబ్బా అని యింటివద్ద బెంగటిల్లి పోతున్నాము. పద వెడదాం' చిరునవ్వుతో అన్నారు లక్ష్మయ్యగారు.

లక్ష్మయ్యగారు ముందు నడిచారు. రామం, పుల్లయ్య వారిని అనుసరించారు. రామం యింటికిచేరి భోజనం చేసేసరికి రాత్రి పన్నెండు దాటింది. అంతకుముందే నిద్రలేచిన కారణంగా అతనికి త్వరగా నిద్ర పట్టలేదు. ఏవో ఆలోచనలతో రాత్రి చాలా ప్రొద్దుపోయేంతవరకు మెలుకువతో ఉండి ఎప్పుడో తెల్లవారుజామున నిద్రపోయాడు.

* * *

రామం, సుందరం, శాంత, శారద నలుగురూ పికింద్రాబాదు పెరేడు మైదానంలో కూర్చున్నారు. సాయంత్రం ఆరు దాటింది.

సాయంత్రంవేళ్లలో షికారుగా వచ్చి చాలా మంది ఆ పచ్చిక పై కూర్చుంటూ ఉంటారు. ఆరోజుకూడా అక్కడక్కడ గుంపులు గుంపులు కూర్చొని చల్లగాలి లోని హాయిననుభవిస్తున్నారు. పెద్ద పెద్ద పిటీలలో ఊరిమధ్య అటువంటి పచ్చిక బైలు ప్రదేశాలుండి పట్టణవాసులు తమ సాయంసమయాలను కులాసాగా గడిపేందుకు తోడ్పడుతుంటాయి.

అక్కడ కూర్చున్న నలుగురూ ఐదు నిముషాలు మౌనంగా గడిపారు—

రామం మౌనభంగం చేస్తూ 'ఒరేయ్ సుందరం! హాస్పిటల్ భవనం తయారైంది ఫర్నిచరు పరికరాలు కావాలి. మరి నీవు రెండురోజులు శలవు పెడితే అవన్నీ కొని లారీలో తీసుకువెడతాను. భవనానికి వేసే రంగులుకూడా నీవే సెలెక్టుచెయ్యి. హౌస్ సర్జన్‌షిప్ పూర్తవగానే అక్కడికి వచ్చు పుగాని.' ఆప్యాయంగా చూస్తూ అన్నాడు.

'అక్కడికి నేను డాక్టరుగా రావాలంటే నాకు ఎందుకో సంకోచం కలుగుతూ ఉంది.

నా విలువ తెలుసుకొని నన్నెవరు గౌరవిస్తారు? ఆరు సంవత్సరాల క్రితం నేను ఆ ఊరు వదిలిపెట్టాను. మళ్లీ నేను అక్కడికి రాలేదు. ఆ వాతావరణం...ఆ మనుష్యులు... ఏమిటోరా నాకు అక్కడికి రావాలని బుద్ధి పుట్టడు. అన్నీ మడ్డెరకాలు. నీమాదిరిగా చదువు, సంస్కారం ఉన్నవాళ్లను వ్రేళ్లమీద లెక్క పెట్టవచ్చు. రానంటే నీవు కోప్పడతావనిభయం. వచ్చి ఉండలేనేమోనన్న అనుమానం. ఏం చేయాలో తోచడంలేదు' సందిగ్ధావస్థలో కొట్టు మిట్టాడుతూ అన్నాడు సుందరం.

'ఏడిశావ్! నువ్వూ నీ అనుమానం. పిచ్చి పిచ్చి కబుర్లు చెప్పకు. మన ఊరి వాడివి. అందరిమధ్య కలుపుగోలుగా ఉంటూ తలలో నాలిక మాదిరి మసులుతావని ఊహించాను. ఇదట్రా...నీ సమాధానం? పిచ్చిపిచ్చి వేషాలు వేయక నే చెప్పినట్లు చెయ్యి' చనువు, అధికారం అతని మాటలలో ధ్వనించాయి.

'సరే! నీ మాట ఎందుకు కాదనాలి? అలాగే. ఒక్కమాట! నా గౌరవానికి ఎటువంటి భంగం కలిగినా సహించను. వెంటనే తిరిగి వచ్చేస్తాను' ఐస్‌ఫ్రూటు కొనివ్వని కారణంగా అలిగిన కుర్రవాడిలా బుంగమూతి పెడుతూ అన్నాడు సుందరం.

'ఒరేయ్! గౌరవమర్యాదలు ఒకరిస్తే వచ్చేవికావు. ఎవరైనా వారి వారి ప్రవర్తనతో సంపాదించుకోవాలి. నీవు చేపట్టిన వృత్తి ఎంతో పవిత్రమైనది. కష్టపడి పనిచేస్తే నీవు కావాలనుకుంటున్న ఆ గౌరవ మర్యాదలు వాటంతటవే వచ్చిపడతాయి. అయినా నీ కెందుకురా ఆ సందేహం? నే నున్నానుగా అన్నీ చక్కబరుస్తాను'

పల్లెలు...

సుందరం మాటలకు విస్తుపోతూ అన్నాడు రామం.

రామానికి రాయప్రోలు వారి గేయం గుర్తుకు వచ్చింది. 'ఏ దేశమేగినా! ఎందుకాలిడినా! పొగడరా నీ భూమి పుణ్యభారతిని!' సుందరాన్నిచూస్తూ మళ్లీ అన్నాడు.

'జననీ జన్మభూమిశ్చ! స్వర్గాదపి గరీయసీ!' తల్లి, జన్మభూమి స్వర్గం కన్న మిన్నయైనవి. సుందరం! ఇక్కడ నీ సేవలకు అంత అవసరముండక పోవచ్చు. చాలా మంది డాక్టర్లున్నారు. అక్కడ అది నీ జన్మభూమి, 'ఫలానా సుందరం. రంగయ్య తాత కొడుకు డాక్టరుగా వచ్చాడు. మనకిక ఎటువంటి రోగాలు వచ్చినా భయపడనక్కరలేదు' అని అందరూ అనుకుంటూ ఉంటే విని నాన్న ఎంత పొంగిపోతాడు? 'రామం స్నేహితుడు సుందరం డాక్టరయ్యాడు. మన ఊరి ఆస్పత్రికి డాక్టరుగా వచ్చాడు. ప్రమాదకరమైన వ్యాధులకుకూడా మనం ఆందోళ పడనవసరం లేదు' అని అందరూ అనుకుంటూ ఉంటే నే నెంత పొంగిపోతాను?'

వీరిద్దరి సంభాషణను జాగ్రత్తగా వింటున్న శారద కల్పించుకొని, 'అవునన్నయ్యా! నేనూ ఆ మాటే అన్నాను. ఈ పాటికి వారు మనసు మార్చుకొని ఉంటారనుకున్నాను. మళ్లీ మొదటికే వచ్చారు' చిరునవ్వుతో అంది.

వీరి సంభాషణతో ఏమీ నిమిత్తం లేకుండా ప్లాజాటాకీసువైపు చూస్తూ ఉంది శాంత. ఆమెకు వెనుక ఒకరోజు జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.


[illegible] కాటన్ ప్యాంటుపై టెర్లిన్‌షర్టు టక్‌చేసి ఎప్పుడూ మడతలు నలగకుండా నీటుగా ఉండే సుందరం ముందు, ముతక ఖద్దరు గుడ్డలతోఉన్న రామం వెలవెల పోతున్నట్లు తోచసాగింది శాంతకు. 'ఎంతైనా సుందరం...సుందరమే! బావ...బావే!' అనుకుంది మనసులో.

'మంచిది రామం. నీమాట తీసివేయలేను. తప్పకుండా అక్కడికి వస్తాను. ఇదిగో గది తాళం చెవి. నాకు రాత్రిపూట డ్యూటీ ఉంది. డ్యూటీ ఐపోయాక ఉదయమే రూముకు వస్తాను' అని శాంత, శారదలవద్ద శలవు తీసుకొని వెళ్లిపోయాడు సుందరం.

సుందరం వెళ్ళినవైపే చూస్తూ 'ఏమిటో...? బస్తీ సుఖాలకు అలవాటు పడి, పుట్టి పెరిగిన జన్మస్థలాన్నే మరచిపోతారు' అన్నాడు రామం.

'అవునన్నయ్యా! ఈ జబ్బు ఒక్క సుందరానికే కాదు. చాలామందికి ఉంది. పల్లెల్లోపండే ధాన్యం, కూరగాయలు, ఇతర దినుసులు వీరి దృష్టికి రావడంలేదు. పల్లెల్లో ఉండేవారు వీరి దృష్టిలో అసలు మనుష్యులే కారనుకుంటారు. అందుకే పల్లె ప్రజలు వెనుకబడి 'ఉంటున్నారు మన దేశంలో. వారి అమాయకత, నిస్సహాయత చూస్తున్నప్పుడెల్లా నా గుండె తరుక్కుపోతూ ఉంటుంది. మనకు స్వాతంత్ర్యం లభించిన తర్వాత కొద్దిగా నయం కాని అది వృద్ధి చెందవలసినంత చెందలేదు. అందుకు కారణం మన నైతిక విలువలు తగ్గిపోవడమే!' దీర్ఘంగా నిట్టూరుస్తూ అంది శారద.

'అవునమ్మా ... నీ మాటలు అక్షరాలా నిజం. మన ప్రస్తుత ప్రధాన కర్తవ్యమల్లా, నానాటికి దిగజారిపోతున్న మన నైతిక విలువలను పునరుద్ధరించడం ... అందుకు ఒకరు పూనుకున్నారు. కాని వారికి వెలుగులోనికి రావడం యిష్టం లేనట్లుంది. 'జ్యోత్స్న' అనే కలం పేరుతో చక్కని వ్యాసాలు వ్రాస్తున్నారు. అసలు ఆ వ్యక్తి ఆడో, మగో తెలియడంలేదు. అజ్ఞాతంగా యింకెంతకాలం ఉంటారో నాకు అనూహ్యంగా ఉంది. చక్కని వ్యాసాలు సరసమైన భాషలో వెలువడుతున్నాయి. నా ఉద్దేశ్య ప్రకారం ఆ వ్యాసాలు వయసులో పండినవారివై ఉండి ఉండాలి. భారతీయ



చదివాలడు. ఎంత నచ్చచెప్పినా ఫలితం లేకపోయింది. నేనుమాత్రం యువ్‌కాంలో చేరాను. ఆ ఏడు అనుకోకుండ విజయ్ నాన్న గారికి హైదరాబాదు ట్రాన్స్‌ఫర్ కావడంతో మేమిద్దరం విడిపోవలసిన రోజు వచ్చింది. వాడు వెళ్లేరోజున ఎంత ఆపుకుందామన్నా నాకు దుఃఖం ఆగలేదు. వాడిని ఆఖరు సారిగా కావలించుకున్నప్పుడు కళ్లనీళ్ల పర్యంతమైంది. ఆ తర్వాత వాడిజీవితం ఏవిధంగా మలుపు తిరుగుతుందోనని నా భయం.

కొద్దిసేపట్లో రైలు కదులుతుందనగా అడిగాను, 'పెళ్లి ఎప్పుడురా చేసుకుంటావు?' అని.

బలవంతంగా పెదాలమీద నవ్వు తెచ్చుకుని, 'చేసుకుంటాను కానీ ఎప్పుడో చెప్పలేను. నా మూలంగా మరోవ్యక్తి బాధపడే అవసరం తీసుకురాను. ఆ నిర్ణయం తీసుకునే ముందు నీకు చెబుతానుగా!' అన్నాడు.

ఆ శుభఘడియ అనేది వస్తే అందరి కన్నా ఎక్కువగా సంతోషించేది నేనే!

రైలు కదులుతుంటే 'వాడి జీవితాన్ని సరిదిద్దే భారం ఇక నీదే భగవాన్' అని మనసులో కోరుకున్నాను.

విజయ్‌మాట ఎలా ఉన్నా, కవిత తీసుకున్న నిర్ణయాన్ని నేను సమర్థించలేక పోయాను. ఆవిడ పెళ్లిచేసుకుని హాయిగా ఉంది. వీడుమాత్రం కాలానికి బలి అయి ఇలా శవంలా జీవిస్తున్నాడు.

ఈ ఆడవాళ్లంతా ఇంతే!

మొదట ప్రాణప్రదంగా ప్రేమిస్తారు. ఆ తర్వాత ఏవేవో సాకులు చెప్పి తప్పించుకుంటారు. ఈ ప్రేమ, త్యాగం ఇవన్నీ ఆవేశం మాత్రమే!

మనసు రాయి చేసుకునైనా జీవితంలో రాజీపడిపోతారు కానీ తనను నమ్మి ప్రాణం పంచిన ఆ వ్యక్తి గతి ఏమౌతుందోననే ఆలోచనకూడ రానీకుండదు చేతికొచ్చిన నాలుగు నీతివాక్యాలు రాసి, అంతటితో వారి బాధ్యత తీరిపోయినట్లు చేతులు దులిపేసుకుంటారు.

నాకు కలిగిన ఈ అభిప్రాయాన్ని విజయ్‌కి చెబితే, వాడు కొంచెం బాధపడు తున్నట్లు, 'మరొకరి విషయమైతే నాకు తెలియదుగాని కవితనుమాత్రం ఆ జాబితాలోకి చేర్చకు. ఆమె మనసు చాలా నిర్మలమైనది అని నా ఒక్కడికే తెలుసు.' అనేవాడు.

ఇంత జరిగినా ఆకవిత మీదున్న సదభిప్రాయం వీడినుండి సడలిపోలేదు,

విజయ్ పరిస్థితి కళ్లారా చూశాక ప్రేమంటే నాకు అసహ్యం వేసింది. వాడి ప్రేమ నాపాలిట ఆదర్శప్రాయంగా నిలిచింది. జీవితంలో ఏ అమ్మాయినీ ఏ పరిస్థితిలోనూ ప్రేమించకూడదు అనే నిర్ణయానికి వచ్చాను.

* * *

విజయ్ దూరమయ్యాక కొన్నాళ్ళు ఒంటరితనం నన్ను బాధించింది. క్రమేణా ఆ ఒంటరి తనానికే అలవాటు పడిపోయాను. మరోఆలోచన అనేది లేకుండా నాధ్యాస అంతా చదువుమీదికి మళ్లించాను. క్లాసులో ఎప్పుడూ రిజర్వ్‌డ్‌గా వుండేవాడిని. చదువు, ఇల్లు తప్పితే, బయట ప్రపంచం గురించి అంతగా పట్టించుకునేవాడిని కాదు. నాతోటి వాళ్లంతా నన్నుచూసి రకరకాలుగా చెప్పుకునేవారు. కొందరు నాకు గర్వం ఎక్కువనేవారు. మరికొందరు, 'వాడు ఆదోటైపురా' అనేవారు. ఇంకొందరయితే నావెనకాలే 'మోడర్నుగాంధిరోయ్' అని ఎగతాళి చేసేవారు.

క్లాసు అంతటికి నన్ను అర్థం చేసుకున్నది మధు ఒక్కడే! మధు అందరితోను కలుపుగోలుతనంగావుండేవాడు. పైకి ఎంత జాలీగావుంటాడో మనిషికూడ అంత మంచివాడు. మా ఇద్దరిమధ్య స్నేహం ఎలా ఏర్పడిందో గుర్తులేదు. మొదటి ఏడు గడిచేసరికి మేమిద్దరం చాలా సన్నిహితుల మయి పోయాము.


ఒకరోజు వద్దంటున్నా మధు బలవంతాన వాళ్లఇంటికి తీసుకువెళ్లాడు. ఇల్లు చిన్నది అయినా పొందికగా ఉంది.

హాలుమధ్య చక్కగా అమర్చబడిన టీపాయ్ ఉంది. గోడలకు వ్రేలాడుతున్న త్రివర్ణచిత్రాలు ఆకర్షణీయంగా వున్నాయి. ఆ గదిలో ప్రతివస్తువు వుండవలసినచోటున వున్నాయని చెప్తుంది. లోపల విడిగా మరో రెండుగదులు వున్నాయి.

ఇద్దరం హాలుమధ్య కుర్చీల్లో కూర్చున్నాం. ఆ ఇంట్లో మరెవరూ వున్న అలికిడే లేదు! అంత ఇంట్లో మధు ఒక్కడే ఉంటున్నాడా?

ఆ విషయం అడగాలనుకునే లోపల మధు 'లలితా!' అని పిలిచాడు.

'వస్తున్నా!' లోపలనుండి వినిపించిన ఆ తియ్యటి స్వరం ఎందుకో నాలో ఆత్రుత రేపింది. ఎంత మాధుర్యం వుంది ఆ స్వరంలో!



ఆమె ముందుకు వస్తున్నదల్లా నన్ను చూసి కొంచెం తడబడింది.

మధు గట్టిగా నవ్వేస్తూ 'ఫర్వాలేదు రా అరుణ్! ఇతనెవరో తెలుసా? మిస్టర్ భాస్కర్! నా క్లాసుమేటు. ది మోస్ట్ బ్రిల్లియంట్! అప్పుడప్పుడు చెబుతుంటానే వీడిగురించే!'

ఆమె నాజూకైన చేతులు రెండూ జోడించి 'నమస్తే' అంది.

మళ్ళీ మళ్ళీ వినాలనేట్టు ఎంత తియ్యని కంఠం! శ్వేత గులాబీతో పోటీ పడుతున్న కోమలమైన ఆమె శరీరం! వెన్నెల చల్లదనాన్ని మురిపించే పెదవులపై సున్నితంగా వెలిసిన ఆ చిరునవ్వు!

విజయ్‌గాని ఆక్షణాన పక్కనుంటే అంత కన్నా చక్కగా వర్ణించేవాడు.

'భాస్కర్! ఈమె నాప్రియమైన సోదరి అరుణ్! యమ్మె స్సీ చదువుతుంది. నీ వెప్పుడూ చూసి వుండవులే! నీకు చదువు తప్పితే మరో ఆలోచన లేదుగా! అరుణ్ కూడ నీలాగే చాలా రిసర్వ్‌డ్. చదువుమీద దానికున్న శ్రద్ధకి అమ్మానాన్న దానికి సరస్వతీకుమారి అని పేరు పెట్టాల్సింది!' అని నవ్వుతూ అరుణవైపు తిరిగి, 'కాఫీ అయిందా?' అని అడిగాడు.

'అయిపోవచ్చింది!'

'కమాన్ క్విక్! ఇవాళ భాస్కర్ మనకి గెస్టు! మూడుకప్పులు పట్రా! హరియప్'.

నేను అడగకుండా మధు చాలా విషయాలు చెప్పాడు.

ఆ ఇంట్లో తను, అరుణ మాత్రమే వుంటున్నారని, వుదయం, సాయంత్రము ఇల్లు వూడ్వటానికి, పాచిపని వగైరా చూడటానికి పనిమనిషి వుందని, కాఫీ, వంటా వగైరా అరుణే స్వయంగా చేస్తుందని. అరుణ ఇంటి పనుల్లో చాలా నేర్పరని, వాళ్లనాన్నగారు హైదరాబాద్‌లో ఏదో బిజినెస్ చేస్తున్నారని, హాస్టలులో తిండి పడుతుందో లేదోనని వాళ్ల నాన్నగారే స్వయంగా ఆ ఏర్పాట్లు చేసివెళ్లారని చెప్పాడు.

ఇంతలో అరుణ కాఫీలు తీసుకొచ్చింది. తనుకూడ మాతోబాటు కూర్చొని కాఫీ తీసుకుంది. ఆ కొద్దిక్షణాలు చూడకూడదు అనుకుంటూనే ఆమెవైపు చూడకుండా వుండలేక పోయాను.

ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు.

మా ఇద్దరి కథ

అరుణ రూపం నా కళ్లముందు మెదిలి కవ్విస్తున్నట్టు అనిపించింది. కాని ఆ మరుక్షణాన విజయ్ కొశ్చన్ మార్కులా నాకు గుర్తుకొచ్చాడు.

'నేను అనుభవిస్తున్నది చాలదా?' అని నిలదీసి అడుగుతున్నట్టు అనిపించింది.

'లేదురా! విజయ్! ఈ ఆడవాళ్ల మీదున్న నమ్మకం నీ జీవితంలో రేపిన పెనుతుఫానుతోనే ఎగిరిపోయింది, అరుణను మరిచిపోతాను. నన్ను నేను నిగ్రహించుకుంటాను.' అని నాలో నేను నిశ్చయించుకుని బలవంతంగా నిద్రపోయాను.

* * *

విజయ్ నేనూ తరచూ సాయంత్రాలు బీచికి వెళ్లేవాళ్లం. ఆ మెత్తని ఇసుకలో కూర్చొని సరదాగా కబుర్లు చెప్పుకునేవాళ్లం! విజయ్ దూరమయ్యాక కూడ నాకు ఆ అలవాటు పోలేదు. ఆ చల్లని సముద్రపుగాలి మనసుకి ఎంతో ప్రశాంతత కలిగించేది.

చీకటి పడుతోంది. దూరాన అలలమీద చిందులాడే చందమామను చూస్తూ ఏదో ఆలోచనలో మునిగి పోయాను.

'హల్లో! భాస్కర్!'

ఉలిక్కిపడి పక్కకు చూశాను.

అరుణ!—శ్వేత నీలిరంగు చీరలో ఆ అందమైన సాయంత్రాన్ని మరిపించేలా వుంది.

'మీరా!' కొంచెం తత్తర పడ్డాను.

'నన్నుచూసి జడుసుకోలేదుగా!' నవ్వుతూ అంది.

'నో నో! అదికాదు.'

'నాకు తెలుసులెండి! అన్నయ్య మీ గురించి చాలా చెప్పాడు. అమ్మాయిలంటే మీకు చాలా భయమటగా! నేనుకూడ మీ కంటికి అలానే కనిపిస్తున్నానా?'

ఆమె అమాయకత్వానికి నాకు అమాంతం నవ్వొచ్చింది.

'సిల్లీఫూల్! అలా చెప్పాడా వాడు. అమ్మాయిలంటే నాకు గౌరవం వుంది. కానీ ఇంతవరకు ఏ అమ్మాయితోను మాట్లాడే అవసరం లేకపోయింది. ఎవరిమాట ఎలా వున్నా మీరంటే నాకు అభిమానం!' తొందరలో ఏదో అన్నాను.

'మీ అభిప్రాయం చప్పగా వుంది. నన్ను చూస్తే కేవలం అభిమానం తప్ప ఇంకే అభిప్రాయం కలగలేదా మీకు?' అమాయకంగా అడిగినా అర్థం ధ్వనించింది.

ఆమె అడిగిన దానికి నేను జవాబు చెప్పలేదు. సంభాషణ మరో విషయం పైకి మళ్లించాను.

ఇంకా కొంతసేపు అక్కడే వుంటే నా మనసు స్వాధీనం తప్పుతుందేమోనని భయం కలిగింది. మెల్లగా లేచి నిల్చున్నాను. కొంతదూరం అనుసరించి ఆమె అయిష్టంగా ఇంటికి దారితీసింది.

ఆ తర్వాత అరుణ చాలాసార్లు కలిసింది. ప్రతి ఆదివారం లైబ్రరీకి వచ్చేది. తరచూ బీచ్‌లో కలిసేది. నాతోవున్న పరిచయాన్ని ప్రేమగా రూపొందించాలని ఎంతో ఆశపడేది. కాని బలవంతాన ఆమె ఆశను ఆశగానే మిగిల్చి వేశాను.

అరుణలో అందముంది, చదువుతోబాటు సంస్కారముంది. మాటల్లో మృదుత్వము, చూపుల్లో చల్లదనం, చిరునవ్వులో వెన్నెల హాయి వున్నాయి. ఇంకా ఆమెలో ఎన్నో ఉత్తమ ఆదర్శాలు వున్నాయి. అటువంటి అరుణ తన సర్వస్వాన్ని అర్పించడానికి ముందుకు వచ్చినా నేను స్వీకరించలేక పోయాను.

నా మనసు ఈ జన్మలో మారదేమో!

ఈ రోజు అమృతం కురిపించి హృదయపీఠాన్ని అలంకరించవలసిన ఈ అరుణే నేడు ఎడారి మధ్య ఒంటరిగా వదిలినట్టు దూరంగా వెళ్లిపోతుంది. ఈ ప్రేమ, త్యాగం లేశమాత్రమైనా గుర్తుండవు. వీళ్లకు చిగుళ్లు తొడిగే వసంతమూ, గలగల పారే సెలయేరు, నీటి అలలమీద నాట్యంచేసే చందమామ ఇవన్నీ ఎప్పటికీ గుర్తుంటాయి. కాని నీవు గుర్తుంటావనే గ్యారంటీ లేదు, ప్రేమించడం, తృణీకరించడం అంతా వీళ్ల ఇష్టమే!

విజయ్ జీవితం ఏమయింది? ఎంత ప్రాణప్రదంగా ప్రేమించాడు. నిశ్చలంగా ప్రవహించే ఆ జీవన వాహినిలో ఆనాడు సంచలనం రేగియుండకపోతే విజయ్ జీవితం ఈనాడు అర్థంలేని నిర్వేదంగా మిగిలి పోయేది కాదు!

ఈ ఆలోచనలన్నీ నా మనసుని ఒక కఠినశిలగా మార్చివేశాయి!

* * *

నిజం ఎందుకు కాకూడదు? తను "సై" అంటేసరి క్షణంలో. ఈ స్వప్న స్వర్గమల్లా ప్రత్యక్ష స్వర్గం అయిపోతుంది తనకి. అంతా తన అంగీకారంమీదనేగా ఆధారపడుంది. అయితే, తను అలా అంగీకరించొచ్చా? అది న్యాయమైన పనేనా? నలుగురూ తన నిర్ణయాన్ని హర్షిస్తారా? ఆ తప్పకుండా. అంతా 'నీకుతగ్గ భార్య నెంచుకున్నావ్' అంటూ తనని ప్రశంసిస్తారుకూడా అయితే... అయితే, అప్పుడు తన సుధ సంగతి? అదలావుంచి ఈ బలహీనతకి తన మనస్సాక్షి. సమ్మతిస్తుందా? ఇన్నాళ్లూ కట్టుకున్న తన కంచుకోటని ఈ విధంగా అధఃపతనం చేసేందుకేనా! వీల్లేదు. ఈ రాధే కాదు వెయ్యిమంది ఇటువంటి రాధలొచ్చినా ఇంతకి వెయ్యిరెట్లు సుఖాన్ని నా కివ్వమన్నా, నా లక్ష్యాన్ని వోటమిచేసే వాళ్లకు నే నెన్నడూ లొంగను. ఛీ! అసలి ప్రయాణాని కెందుకొప్పుకున్నాన్నేను' అనుకుంటూ ఎంతసేపో మనోపోరాటంలో అలా మంచం మీదనే కూర్చుండిపోయాడు రఘు.

ఇంతలో మేడమెట్లమీద టక్కుటక్కుమంటూ చప్పుడవడంతో అతని ఆలోచనల కంతరాయం కలిగి, కిటికీలోంచి తొంగి చూశాడు. తన బట్టల్ని నలక్కుండా జాగ్రత్తగా చేతిమీదికి వేసుకుని కష్ట ప్రయాసంలో మెట్లెక్కి వొస్తూంది సుధ. సుధని చూడ్డం అంటేనే అపరాధం చేసిన వాళ్లాగ ఏదో బెదురు పట్టుకుంది రఘుకి.

'నువ్వింత శ్రమపడుతూ ఈ మెట్లన్నీ ఎక్కిరావడం దేనికి సుధా, నే కిందికొచ్చి నప్పుడు తెచ్చుకునుండేవాణ్ణిగా' అన్నాడు, ఆయాసపడుతూ లోపలికొచ్చిన సుధను చూసి రఘు. ఎలాగో అన్నాడేగాని, ఎప్పటి మోస్తరుగా...నిండుతనంలేదు ఆ మాటల్లో.

'ఏం బావా? ఒంట్లో బాగుండలేదా?' అతనిలో మార్పుని పసిగట్టేసిన సుధ అదోలా చూస్తూ అడిగింది.

'అబ్బె, అలా ఏమీ లేదే?' రాత్రంతా నిద్రపట్టలేదు. అంతే...'

'అబద్దాలు, నిన్ను చూస్తే అలాగేం లేదు. పైగా నువ్వు పైకొచ్చిన వెంటనే లైటు తీసెయ్యడం నే గుర్తించలేదనుకున్నావా?' సుధ నవ్వుతూ అమాయకంగానే ఈ మాటలన్నా... 'ఏ వంచన మాటలన్నీ నా దగ్గరా?' అన్నట్టే అనిపించింది



రఘుకి.

'ఏం? లైటాపేసినంతమాత్రాన్న నిద్ర పోయానన్నదేం వుందీ.'

'ఏవిటి బావా? నిద్రపోయినప్పుడు తప్పితే మిగతా ఎప్పుడూ నువ్వు ఒక్క క్షణమన్నా వృధా చెయ్యవన్నది నేనెరగనూ' నవ్వింది సుధ. పిచ్చెత్తేటంత బాధ రేగుతూంది రఘు తలలో. 'ఈ అమాయకురాల్నా, తను దగా చెయ్యాలనుకోవడం? తను కాదంటే రాధను చేసుకునేందుకు కావలసినంతమంది ముందుకొస్తారు. ఐతే, అయితే ఈ సుధకి తను తప్పితే మరో ఆశ్రయం?'

'సూటు ఇస్త్రీ బాగుందా బావా?...' ఎప్పుడూ వెంటనే పొగడే బావ ఇవాళ ఇంత కష్టపడి ఎంతో బాగా మలచి తెచ్చిన బట్టల్ని మెచ్చుకోకపోవడం సుధ కదోలా అనిపించింది.

'చాలా బాగున్నాయి సుధా. అయినా విట్లకేం తొందరని ఇంత శ్రమపడ్డావ్ పాపం'— హు నేనన్నా, నా పనులన్నా ఎందుకో ఈ సుధకింత తాపత్రయం.

'అదేమిటి బావా? ఇవాళెవరో గొప్ప డాక్టర్ని మీటవ్వాలన్నావ్‌గా'

'వో? చూశావా? నే మర్చేపోయానూ.'

'అదే నేనూ చూస్తున్నా. అదీగాక ఆ శాంతక్కయ్యగారి చుట్టాల పిల్లలు ఎప్పుడూ నా గదిలోనే సవరిస్తూ వుంటారు. తీరా నలిపేశారంటే పని మొదటికొస్తుం దేమోనని మరోభయం.'

'వాళ్లని నీ గదిలోకి రావద్దని గట్టిగా చెప్పెయలేవూ.'

'వచ్చినా ఫరవాలేదు బావా. నే రాసుకుంటూన్నప్పుడు ఏ పెన్నో, కుట్టుకుంటూన్నప్పుడు ఏ కత్తెరో పట్టుకుపోయి 'కుంటీ మమ్మల్ని పట్టుకో' అంటూ, పరుగులెత్తుతారు బావా' తలొంచేసుకుంది సుధ.

'అన్నయ్యతోనో, వేణుతోనో చెప్పి తన్నించక పోయావ్?' ఎర్రబడ్డ మొహంతో అన్నాడు రఘు.

'పెద్దబావ ఊర్లో లేడుగా? వేణుబావతో చెపితే, ఏం రాద్ధాంతం చేస్తాడోనని భయం బావా?'

'సరి ఇక నే చూసుకుంటాగా' ఎప్పుడూ ఏ సంగతైనా తనతో చెప్పుకుంటేనేగాని

అతని లక్ష్యం

సుధ మనసు సమాధాన పడదని రఘుకి తెలుసు.

'క్షమించు సుధా పాపం నువ్వు నా గురించి ఇంత శ్రద్ధ తీసుకుంటే, నిన్న రాగానే నిన్ను కసురుకున్నాను' అన్నాడు నొచ్చుకుంటూ రఘు.

'అయితేనేం బావా. రోజంతా ప్రయాణం చేసిన వాడివి. ఆపాటి చిరాకు పుట్టదూ, మరీ' అంది ఎంతో సహజంగా.

ఇంతలో రఘు బ్రష్షు తీసుకుని తేవడంతో సుధ మెల్లగా మెట్లు దిగి వెళ్లిపోయింది.

మొత్తానికి రఘు ఎంత సర్దుకుంటూ ప్రవర్తిస్తూన్నా, అతనిలో అతనికే అర్థం గాని లోపమేదో సుధకి స్ఫురిస్తూనే వుంది. తనతో రాధ కూడా బొంబాయి రాబోతూన్నదని తెలియడంతోనే రఘు కెక్కల్లేని చిరాకూ కల్గింది. రాధని ఒద్దనేందుకూ లేక, రాధతో కలిసి పని చేసేందుకూ ఇష్టంలేక సందిగ్ధావస్థలో పడ్డాడు రఘు.

అందులోనూ అసలే హరించిపోతూన్న తన మనోనిబ్బరం మళ్లీ రాధతో ఈ ప్రయాణంలో తప్పకుండా దెబ్బతిని తీరుతుందన్న భయం రఘుకి బాగా పట్టుకుంది. అందువల్ల అనువైన అవకాశాలిచ్చి ఆ తరవాత మనసుని లొంగదీసుకోలేక బాధపడ్డం కన్నా, అటువంటి సందర్భాలేర్పడకుండానే చూసుకోవడం ఎంతో క్షేమదాయకమని అతని నమ్మకం అందువల్ల ఈ ప్రయాణానికొప్పుకోవడమా? మానుకోవడమా, అని రెండురోజులపాటు రాత్రింపవళ్లు ఇదే ఆలోచనతో సతమతమైన రఘు, సరి తన నిబ్బరానికీ కార్యదీక్షకీ ఇది ఆఖరు పరీక్ష ఇదే అన్నింట్లకన్నా కఠిన పరీక్ష కూడా.' అనుకున్నాడు రఘు ఈ నిశ్చయానికొచ్చాకనే స్థిమితంగా ఆ ప్రయానికి సమ్మతించ గల్గాడు రఘు.

ఇక ఈ నిశ్చయానికొచ్చేక అతనిలో అతనికే ఒక స్థిరమైన నమ్మకం కల్గిపోవడం వల్ల తన ప్రయాణ సన్నాహాల్లో మునుగుతూ మిగతా పైపై సాంప్రదాయపాటింపుల్ని అశ్రద్ధ చేశాడు రఘు.

అయితే రఘు ఎందులోనూ ఎక్కువ పట్టించుకోకుండా ఇలా వుండడం ఇంట్లో వాళ్లందరికీ ఇప్పుడే ఈ రఘు ఇలా మారిపోయాడేం? ఎవరి మాటెలావున్నా రఘు కూడా ఇలా అందరిలాగే ప్రవర్తిస్తాడని ఎప్పుడూ అనుకోలేదే?' అనిపిస్తూంది. ఇక సుధకా. తనకి సంబంధించిన ఏ చిన్న సంఘటన జరిగినా ఈ ముఖ్యమైన ప్రయాణాన్ని గురించి తనతో ఏమీ చెప్పకపోవడం సరిగదా తను అడిగి తెల్సుకుందుక్కూడా అవకాశం ఇవ్వకపోవడం సుధకి అదోలా వుంటూన్నా 'పాపం బావకి పని తొందర' అని తృప్తిపడి సరిపెట్టుకుంది సుధ.

'వెళ్లొస్తా సుధా. బొంబాయి నుంచి నీకేం తెమ్మంటావ్.' సుధ వద్దకొచ్చి నవ్వుతూ అడిగాడు రఘు.

'ఏమిటి బావా, నేనేవన్నా చిన్నపిల్లనా' కలకలా నవ్వింది_సుధ.


'మరి అన్నయ్యగారి బాబింకా అడగలేడు. ఇక వున్న వాళ్లందర్లోకీ నువ్వేగా చిన్నదానివీ, ఊఁ చెప్పు.'

'ఏమిటి బావా నా కాలు బాగుచేసేందుకేగా నువ్విన్ని యాతన్లూ పడడం ఇంతకన్నా నాకేం కావాలి బావా?' కృతజ్ఞతతో సుధకళ్లు చెమ్మగిల్లాయి.

'అయ్యో పిచ్చి సుధా, నీ కోసరం నేను నిజంగానే అలా చెయ్యగల్గుతానన్న నమ్మకం నాకు పూర్తిగా కుదరడం లేదెందువల్లో అయినా నీ అమాయకత్వమే నా మనోనిబ్బరానికి శ్రీరామరక్ష నిలవగల్గాలి' అనుకున్నాడు. రఘు కళ్లు కూడా కొంచెం చెమ్మగిల్లాయి.

'అన్నట్టు నీకు ఇకమీద ఇవ్వాల్సిన ఇన్‌జెక్షన్లూ, మందులూ అన్నీ నళినితో చెప్పాను. బహుశా రెండుమూడుమార్లు నెత్తురు కూడా 'టెస్ట్' చేసి ఆ రిజల్ట్సు వెల్లూరు పంపాల్సుంటుంది. అవన్నీ నళినీ, మురళీ చూసుకుంటారుగాని నువ్వు మాత్రం మందులు శ్రద్ధగా తీసుకుంటూ వుండేం' అంటూ సుధని హెచ్చరించి, పార్వతమ్మగారి హెచ్చరింపుమీద వోసారి లలితా రాజేశ్వరి గుడికెళ్లి మనసారా ఆ దేవిని ప్రార్థించుకున్నాక, ఇంటికొచ్చి భోజనం వగైరాలన్నీ ముగించుకుని ప్రయాణమయ్యాడు. మొదట ప్లేన్లో అనుకున్నా, వారి ప్రయాణం కొన్ని కారణాలవల్ల రైల్లోనే ఏర్పాటు కావడంవల్ల సుధతోసహా అందరూ రఘుకి

దిట్టమైన కట్టడాలు: ప్రఖ్యాత నిర్మాణములు-2



వీడ్కోలివ్వడానికి స్టేషన్‌కి వెళ్లారు.

రాధకి తనవరకూ ఈ ప్రయాణం తన భవిష్యత్తు అనుకున్నట్టుగా జరిగేందుకిదొక శుభ సూచనా, మంచి లవకాశంగా అనిపిస్తున్నందున చాలా హుషారుగానూ, సంతోషంగానూ వుంది.

బంధువుల్తోటీ, స్నేహితుల్తోటీ ప్లాట్‌ఫారమంతా కిటకిటలాడుతూంటే, రఘూ, రాధా రైలెక్కారు. సుధమాత్రం అక్కడ పేర్చబడున్న బస్తాలకి వార సరిగా నిలబడి అన్నీ గమనిస్తూంది అంతే.

'అరే? మన సినబాబుగారు దేశం వెళ్లిపోతున్నట్టున్నారే అమ్మీ' అన్నాడు. పెళ్లి మొక్కుబడిపేర, సింహాచలంలో గుండు కొట్టించుకుని, భార్యా సమేతంగా అట్నుంచొచ్చిన బండీలో దిగిన చాకలి గవరయ్య, గుండునిండా గంధం పట్టించుకుని పసుపు బట్టల్తో పక్కన నిలబడున్న భార్యతో మెల్లగా.

'ఏటీ? నువ్వు నౌకరీసేసే కావందులే నేటి ఊరూ? సిలకా, గోరింకలల్లే ఎంచక్కుందిగదు మావా, జంటా?' నోరంతా పళ్లు చేసుకుంటూ అటుమాసి మురిసిపోతూంది పెళ్లికూతురు.

'ఏసె, ఆరికింకా పెళ్లికాలేదోసె' ఆ పక్కనుండేటావిడ అరిసుట్టు వినుకుంటా. అధిబర్లోనే సదూతూందిరే'

'మరింకేం?'

'ఏటే ? ఆ ఇంకేం ?' నవ్వాడు గవరయ్య.

'అదే మావా, అంత సక్కని సిన్నది పక్కనుంటే మరి పెళ్లెందుకురా ఆ బాబుకి.'

'ఏ ఊరుకోవోసె' ఆరి సెవుల్లో బడ్డదంటే, సెవటూ లోరిపించేర్తారు కావందుల్తో పని...' మందలించాడు పెద్దయ్య.

'అన్నట్టసలూ ఆరికి మావకూతురుందమ్మీ, మనుపుకోవ్?' రహస్యంగా చెప్పాడు కళ్లెగరేస్తూ.

'ఎవరూ మొన్న నేమొక్కడాని కారింటికెళ్లినప్పుడు సిలుక్కోక నాకిచ్చిందే ఆ అమ్మాయా'

'ఆ మరే ? పెళ్లయితే మనకు సిలుకు జుబ్బా, పట్టునోణి బగుమానం ఒత్తాదోసె' చంకలు గుద్దుకుంటూ పళ్లిగిలిచ్చాడు గవరయ్య.

అతని లక్ష్యం

'నీ కట్నాల ఆసె సంతకెళ్లా ? అదేం పిల్లమావా, ఇలా కాలెగరేసుకుంటూనూ ?' కుంటి చూపిస్తూ ఏవగించుకుంది పిల్ల.

'అనుకుంటున్నావ్ పిల్లా, ఆరి మనసు బంగారవే అనుకో, బంగారం' గొప్పగా కనుబొమ లెగరేస్తూ అన్నాడు గవరయ్య, ఇంతలో పార్వతమ్మగారు వాళ్లన్నొద్దంతో దబ్బుని అటు పరుగెత్తుకెళ్లి,

'కొండకెళ్లి అప్పుడికి మొక్కు చెల్లించుకొచ్చినావమ్మగారూ' అన్నాడు దండం పెడుతూ.

'ఏ మొక్కు బంగారంగానూ, కొత్త పెళ్లికూతుర్ని తీసుకెళ్లి ఇదేం పనిరా?' అన్నారు పిల్లవేపు చూసి నవ్వుతూ. రఘూ, రాధా కూడా వాళ్లన్జూసి నవ్వారు. ఇంతలో రైలు బయల్దేరే సమయం అవడంతో ఆతురికేవేవో బుద్ధులెప్పి గుడ్లనీళ్లు కుక్కుకున్నారు రాజమ్మగారు. 'ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటూ వుండేం బాబూ' అని ఒక్కమాటచెప్పి నమస్కరిస్తూన్న కొడుకుని మనసారా ఆశీర్వదించారు పార్వతమ్మగారు వీడ్కోలిస్తూన్న అందరి మధ్యా దేనికోసరమో వెతుక్కున్న రఘు కళ్లు ఎంచీ కనుపించకుండా బస్తాల్చాటునున్న సుధని చూడగానే, ఆరోగ్యం జాగ్రత్తన్నట్టుగా సౌజ్ఞచేసి వెళ్తానన్నట్టు తలా ఊపుతూ, ఉమాలెగరేశాడు రఘు. ఆనందంతో పొంగిపోతూ, తనూ టాటా చెపుతూ రుమాలూపింది సుధ. రైలు చూపు దాటిపోయేవరకూ అలాగే గుమ్మం పద్దే నిలబడి రఘు రుమాలెగరేస్తూంటే, అందరూ ఆనందంతో ఆటే చూస్తూ నిలబడిపోయి, ఆ తరవాత తిరుగు ముఖం పట్టారు. మౌనంగా నడుస్తూ వెళ్లి కార్లో కూర్చుంది సుధ.

'అయ్యో పాపం ఈ అమ్మాయి కూడా ఒచ్చిందా?' అన్నారు అదోలా సుధవేపు చూస్తూ రాజమ్మగారు.

'సుధ రైలువరకూ ఒచ్చి సాగనంపితేనే తప్ప తను వెళ్లనని పంతంపట్టుక్కూర్చున్నాడు మా మరిది' అంది కసిదీరా ఆవిడ వేపు చూస్తూ శాంత.

'అలాగా మేనత్త మేనమావ పిల్లలంటే నిజంగా అలా వుండాలి' అంది. శాంత మాటని బలపరుస్తూ నళిని.

'అయినా, ఏ పూర్వజన్మ ప్రారబ్ధమో, ఆ వంకరొచ్చిందిగానీ, నిజంగా ఆ పిల్ల తెలివితేటలూ, నమ్రతా అన్నింట్లకన్నా నిజంగా ఆ పిల్ల స్వయంబుండే...?' అంటూ తనూ వారితో ఏకీభవించింది నిర్మల.

'అయినా, ఆ లోపం ఒక్కటే చాలదూ, ఇన్నింట్లకీ బలాదూర్ అన్నట్టుగానూ' అంది మళ్లీ వుండబట్టక రాజమ్మగారు.

'అదెలాగౌతుందండీ మనుషులకొక్క విగ్రహం బాగుంటే సరిపోతుందిటండీ. మిగతా దేని విలువ దానికే వుంటుంది ఎప్పుడూనూ' అంది తనూ ఊరుకోకుండా నళిని. దాంతో రాజమ్మగారికెక్కడ లేని రోషమూ వచ్చి. ధుమధుమలాడుకుంటూ వెళ్లి కార్లో కూర్చుంది. కాకపోయినా, ఇంటికెళ్లాక కోడలు మీది కసి మరో విధంగా తీర్చుకుందామనుకునేందుకూ, పదేందుకూ నిర్మల కాదుగా! అందుకే ఆవిడకోపాన్నంతా ఏస విసిరి నడవడంలోనూ ఫెడీమంటూ కారు తలుపు ముయ్యడంలోనూ చూపవలసొచ్చింది పాపం. ఆవిడ స్వభావాన్ని కను సౌజ్ఞల్తోనే చెప్పుకుని నవ్వుకున్నారు కోడళ్లిద్దరూనూ.

ఇంటికెళ్లగానే బట్టలు మార్చుకోవడం కోసరమని గదిలో కెళ్లి తలుపేసుకున్న సుధ గవరయ్య అన్న మాటల్నీ పిల్ల ఇచ్చిన సమాధానాల్నీ మళ్లీ మళ్లీ గుర్తుకు తెక్చుకోసాగింది.

'నిజం! చదువుకున్న వాడికన్నా, చాకలి మేలన్నట్టు వాళ్ల సంభాషణలో ఎంత సత్యం వుంది?' నిజం. అంత అందంగా వుండే బావ పక్కన వుండె అదృష్టం రాధ వంటి వారికే తగునుగాని కుంటి ఊను కుంటూన్న తనందుకెంత మాత్రమూ అర్హురాలు కాలేదు.

ఒకవేళ తనమీది జాలికొద్దీ, బావ తనని చేసుకుంటే అది చూసేవారికి చంద్రుడికి గ్రహం పట్టినట్టుగానే అనిపిస్తుందిగాని ఏ మాత్రమూ ఆనందంగానూ అందంగానూ వుండదు. అందుకే తనని కాదని బావ మరె వర్నన్నా చేసుకునేందుకు తగిన గట్టి ప్రయత్నం తను చేయాలి. అలా ప్రయత్నించి బావకి జీవితానందం చేకూర్చ గల్గినప్పుడే తనకి బావ మీదున్న అపార అను

రాగాన్ని సార్థకం చేసుకున్నట్టవుతుంది. అయితే ఆ చేసుకున్నవాళ్లు ఒకవేళ బావ సాన్నిధ్యంలో వుండి బావని చూసుకుంటూ వుండేందుక్కూడా తనకి చోటివ్వకపోతేనో? అమ్మో తల్చుకుంటేనే గుండె పగిలేటంత బాధగా వుంటూంది. ఒళ్లు జలదరించు కుంటూ మంచం మీద చతికిలబడ్డ సుధ కళ్లు ధారలుధారలుగా నీరు కార్చాయి.

'అమ్మాయి సుధా' పార్వతమ్మగారి పిలుపులో మళ్లీ యధాస్థితికొచ్చిన సుధ 'ఇదుగో? వస్తున్నానత్తయ్యా' అంటూ టబ్బున బట్టలు మార్చుకుని ఇవతలికొచ్చింది సుధ. ఏడ్చినట్టున్న సుధ మోహం చూసి రఘు వెళ్ళిపోయినందుకే సుధ అలా బాధ పడుతూందని అనుకున్న పార్వతమ్మగారు 'పోసి పిచ్చిపిల్లా' అనుకుంటూ ప్రేమతో సుధని దగ్గరగా తీసుకున్నారావిడ.

*　　*　　*

అక్కడ రఘుకి యాంత్రికంగా దొర్లుకుపోతూంది కాలం. అతను పని చెయ్యవలసిన్న లేబరేటరీ దానికి సంబంధించిన హాస్పటల్ కూడా రద్దీలేని ఒక మారుమూల్ని పెద్ద తోటలో నిర్మించబడుండడం వల్ల, అందులో పని చేసే ముఖ్య ఉద్యోగస్తులందరికీ, ఆ ఆవరణలోనే బంగ్లాలు ఏర్పాటు చేశారు.

రఘుకీ రాధకీ ఇచ్చింది ఒకే బంగ్లా, స్నానపు గదిలో సహా. పడగ్గదులు మాత్రం ఇద్దరికీ విడివిడిగా వున్నా, వారి వైద్య విషయాలకు సంబంధించిన గ్రంథాలూ వగైరా హాల్లో అలమార్లలోనే వుంచబడ్డం వల్లా, పనివారూ భోజనాల హాలూ వగైరాలన్నీ కూడా ఉమ్మడివే అయినందువా, తరుచూ ఇద్దరూ, ఒకేచోట తటస్థపడక తప్పేదికాదు పాపం.


ఏ కారణం వల్లా ఎటువంటి పరిస్థితుల్లోనూ, తన మనోనిగ్రహాన్ని సడల నివ్వకూడదన్న కారణంగా, వీలున్నంత వరకూ రాధతో ఏ విధమైన పరిచయమూ పెట్టుకోకూడదని అతను నిశ్చయించుకుంటే, అక్కడి పరిస్థితులన్నీ అతడికి వ్యతిరేకంగానే వున్నాయి.

బొంబాయి వెళ్లినప్పట్నుంచీ అక్కడివారంతా వారంతట వారే వచ్చి రఘూ రాధల్ని పరిచయం చేసుకోవడం వాళ్ళి ఏదో ఒక నిమిత్తంగా తమ ఇళ్లకి విందులూ వినోదాలకి ఆహ్వానిస్తూండడం వారి బంగ్లా ఊరికి దూరంగా వున్నందున సభ్యత కోసరం రాధనీ తన టాక్సీలోనే రఘు తీసుకెళ్ళడం ఇటువంటప్పుడు చక్కగా శృంగారించుకుని తన పక్కని కూర్చుని వచ్చే రాధని చూసి రఘు ఎంతో ప్రయత్నంమీద మనసుని స్వాధీన పరుచుకుంటూండడం ఇలా తరుచూ జరుగుతూనే వుండేది. మరి ఎంత యోగ్యుడైనా రఘూ అందరివంటి మనిషే. అతనికీ, అందరికీ ఆ వయసులో వుండే కాంక్షలు కల్గుతూండడం సహజం. అయితే అతని ఆశయాలకు ఇది విరుద్ధమైనదవడంవల్ల అటువంటి ప్రతి సమయంలోనూ అతని మనసుని బలవంతంగా కళ్లేల్లాగి పెట్టుకోవడం మహా అవస్థగా వుంటూండేది అతనికి. మరి కష్టమైనా, ఏ నష్టమైనా అంతకన్నా మరో మార్గం? ఒక్కొక్కసారి 'ఆ సుధకి చిన్నతనంలోనే ఆ అవిటితనం ఎందుక్కల్గాలి, వారు శాశ్వతంగా తమ ఇంటికెందుకు చేరాలి, అయినా అంతర్లాగా తనూ వుండకుండా ఇంత ఆదరం ఎందుకు చూపాలి? అందరి కళ్లకీ సర్వసాధారణంగా కనిపించే సుధ తనని మాత్రం ఇంత ఎక్కువగా ఎందుకాకర్షించాలి? పోనీ ఇన్నీ ఎలావున్నా, ఈ రాధ కూడా తన జీవితంలో ఈ విధంగా తటస్థపడ్డం దేనికి? ప్రపంచంలో ఇంతమందీ వుండగా ఏదో కాస్త లక్ష్యజీవనం సాగించాలనుకునే తనకే ఇన్ని ఇబ్బందులూ ఎందుక్కల్గాలి? కల్గినా అవన్నీ ఎదిరించేనుకుని అందర్లాగా తన స్వార్థం తనెందుకు చూసుకోకూడదు?'

ఇలాంటి ఆలోచనల్తో తల వేడెక్కిపోతూ వుండేది. అందుకనే రోజులో చాలా సమయాన్ని ఆ హాస్పిటల్లోని రోగుల చికిత్సలతోటీ, పరిశోధనలతోటీ కాలక్షేపం చేసేసి ఆలశ్యంగా ఇల్లు చేరుతూండేవాడు రఘు.

అయినా, ఇద్దరికీ ఏక వంటమనిషి, ఏక భోజనం అవటాన్న ఒద్దన్నా వినక రాధ తనొచ్చేవరకూ కనిపెట్టుకుంటూండడం వల్లా, అదీ ఇబ్బందిగానే వుండేది.

(ఇంకా వుంది)



వారఫలం

12-3-1971 శుక్రవారం మొదలు
18-3-1971 గురువారం వరకు

మేషం: వ్యాపారంలో శ్రమ మీద అనుకూలత లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. ప్రయోజనం గల వ్యక్తులను కల్సుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

వృషభం: మీ ఆలోచనలు ప్రయోజనకరంగా ఉంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వృత్తిలో పోటీవారి పోటీ పెరుగుతుంది. ఉద్యోగంలో యితరుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు. అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు— వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

మిధునం: సామాన్యమైన పనులకు కూడా మీరు యెంతో కృషి చేయవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో సుగమాటాలు తగ్గు. పోటీ వారిలో గౌరవం లభిస్తుంది. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి

స్త్రీలకు— బంధుమిత్రులను కల్సుకొంటారు. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

కర్కాటకం వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. స్థిరాస్తి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. కొన్ని వ్యవహారాల్లో ఆదాయం కంటే హడావుడి అధికంగా ఉంటుంది.

స్త్రీలకు— వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. దైవకార్యాలు నెరవేరుతాయి.

సింహం: అన్ని వ్యవహారాల్లోను మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది నూతన విషయాలను తెల్సుకొంటారు. ఉపకారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. వ్యక్తిప్రాంగణ్యం లభిస్తుంది

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. శుభ కార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు.

కన్య: వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. మీ ఆలోచనలు ఫలిస్తాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

తుల: అధిక వ్యయం జరుగడం వలన ఆర్థికంగా ఒత్తిడి రాగలదు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వ్యతిరేకమైన వార్తలను వింటారు. వారం మధ్యలో వృత్తివ్యాపారాలు బాగా ఉంటాయి. పోటీవారితో గౌరవం బాగా ఉంటుంది. మీ ఆలోచనలు ఫలిస్తాయి.

స్త్రీలకు— దైవకార్యాలు నెరవేరతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృశ్చికం: వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం మధ్యలో ఉద్యోగంలో కారదభారం పెరుగుతుంది. ఎవరినీ విశేషంగా నమ్మడం తగదు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

ధనుస్సు. అన్ని వ్యవహారాల్లోను గౌరవం లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు. వృత్తిలో ఆదాయం బాగుంటుంది సాహసముతో కూడిన వ్యవహారాలు లాభదాయకంగా ఉంటాయి. మిత్రులకు సహాయం లభించగలదు.

స్త్రీలకు— శుభకార్యాలు చేస్తారు. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

మకరం: వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందగలదు. సంతోషకరమైన వార్తలను వింటారు అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగుంటాయి

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

కుంభం: కొన్ని వ్యవహారాల్లో అనవసరమైన శ్రమ కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఆందోళన కలుగుతుంది. వారం మధ్యలో వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. విద్యావైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు పోటీవారిలో గౌరవం బాగుంటుంది.

మీనం: భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. వారం మధ్యలో ఉద్యోగంలో యెవరిని విశేషంగా నమ్మడం తగదు. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషికి ఆటంకాలు వస్తాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

—మహేష్ ●

వడ్డించే మనవాళ్ల కథలు

3

విసుగు చెందని విక్రమార్కుడి కథ

*

కె.వి.యస్. శర్మ



బేతాళుడు ఎంత విసిగించినా విక్రమార్కుడు విసుగు చెందలేదు. ఎన్నిసార్లు జారిపోయినా అన్నిసార్లు పైకి పాకింది సాలీడు. ఎన్నిసార్లు వోడిపోయినా గెలిచేవరకు యుద్ధంచేసాడు బ్రూసు. ఎందుకు? వాళ్లంతా ప్రజ్ఞానిధులు కనుక. వాళ్లకి ఎన్ని విఘ్నాలు కలిగినా వాళ్లకి ఉత్సాహం ఇనుమడిస్తుందే కాని తగ్గదు. ఒక్కొక్కప్పుడు వడ్డించే మనవాళ్లకి చాలాసార్లు సగందూరం వచ్చేసరికి ఎవరో ఒకరు అడ్డం తగుల్తారు. కష్టపడి మన దాకా చేరినా అక్కడ విస్తరుండదు. ఇన్ని కష్టాలున్న వాళ్లు మనకి వడ్డించ దల్చుకున్నారు కనుక నిరుత్సాహ పడకుండా సమయం కల్సొచ్చేవరుకు ఆగి వడ్డించి తీరుతారు. అటువంటి పట్టు విడవని ఫణిక్కర్‌కథ ఇది.

ఫణిక్కర్‌కి స్వంతరాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వపు వుద్యోగంవుంది. ఆయనకి లక్ష్మి అనే గారాబాల కూతురువుంది. లక్ష్మికి చిన్నప్పుడు దేవానంద్, వహీదారహమాన్ల సినిమాలు, కొంచెం పెద్దప్పుడు రాజేష్‌ఖన్నా, షర్మిలా ఠాగూర్ సినిమాలు చాలా ఇష్టం. అన్ని పుస్తకాల్లోని ప్రేమకథలు చదువుతుంది. అందాల రాజకుమారుడి కోసం కలలు కనేది. ఇల్లా ఉండగా పక్కింట్లోకి మంచి విగ్రహపుష్టున్న అబ్బాయి వచ్చాడు. ఆ అబ్బాయి సినిమాల్లో హీరోలాగా అందంగా ఉంటాడు. అందుకని లక్ష్మి ఆ అబ్బాయి చెల్లెల్తో స్నేహంకట్టి ఆ అబ్బాయిపేరు రమణ్ వల్సాంకర్ అని తెలుసుకుంది. పైగా అతను సివిలింజినీరింగ్ చదువుతున్నట్టుకూడా తెల్సుకుంది. అయితే అప్పటికింకా ఇంజినీర్లమీద కార్టూన్లు రావటంలేదు కాని వాళ్లకి ఉద్యోగాలు వస్తున్నాయి. అందుకని ఎంచక్కా హృదయం పారేసుకుంది. అల్లా లక్ష్మి పారేసుకున్న హృదయం రమణ్‌కి దొరికింది. అది తీసుకువెళ్లి 'ఇదుగో మీ హృదయం నాకు దొరికింది' అంటూ మంచి బాలుడులా ఇచ్చేయబోయాడు. ఎవరైనా మనం పారేసుకున్న వస్తువు తెచ్చిఇస్తే మనం బహుమానం ఇవ్వాలికదా! అందుకని లక్ష్మి అతను తెచ్చిఇచ్చిన వస్తువును తిరిగి బహుమానంకింద ఇచ్చేసింది. 'నేను మాత్రం ఉత్తినే బహుమానాలు పుచ్చుకోడం ఎందుకు?' అని రమణ్ ఆలోచించి రమణ్ తన హృదయాన్ని లక్ష్మికి బహుమానంగా ఇచ్చేసాడు. లక్ష్మి అది ఆనందంగా అందుకుంది.

ఈ ఇచ్చిపుచ్చుకోడాలు నచ్చని వ్యక్తి ఫణిక్కర్ 'అతన్ది అతనికిచ్చేసి నీది నువ్వు తెచ్చుకో' అని కూతురుకి చెప్పిచూసాడు. లక్ష్మి; చేతిలో తాయిలం ఎవరైనా లాక్కుంటే చిన్నపిల్లలు చేసినంత గొడవ చేసింది. ఆఖరికి ఫణిక్కర్ గారాబాల కూతురు పట్టుదలకి లొంగాల్సి వచ్చింది. అయితే ఫణిక్కర్‌కి పెద్ద ఉద్యోగస్థుడికి తప్ప తన కూతుర్నివ్వటం ఇష్టంలేదు. లక్ష్మికి రమణ్‌ని తప్ప ఇంకెవర్ని పెళ్లి

వడ్డించే వనవాళ్ల కథలు

చేసుకోడం ఇష్టంలేదు. ఫణిక్కర్‌కి లెక్కలు వచ్చు. అందుకని ఈ సైమల్టేనియస్ ఈక్వేషన్స్‌కి ఒకటే సొల్యూషన్‌అని అది రమణ్ పెద్ద ఉద్యోగస్థుడవడం అని పోల్చుకున్నాడు. ఉత్తబియ్యేతో పెద్ద ఉద్యోగం కష్టం కనుక అతని పెద్దవాళ్ల దగ్గరకు వెళ్లి తను చల్లకోసం వచ్చినట్టు చెప్పి ముంతపైన పెట్టాడు. రమన్ విదేశాలు వెళ్లివస్తే మంచి ఉద్యోగాలు వస్తాయని చెప్పాడు. వాళ్లు కోరగా ఫణిక్కర్ నడుము కట్టుకుని రమన్‌ని ఏదో గవర్నమెంట్ స్కాలర్‌షిప్‌లో పైదేశాలకి తోలేసాడు. అయితే రమణ్ బుర్ర గట్టిది. అందులోకి ఏది చప్పున ప్రవేశించలేదు. అందరు ఏడాది తీసుకునేదానికి మూడేళ్లు తీసుకుని తిరిగి వచ్చాడు.

అయితే రమణ్ తిరిగొచ్చేసరికి పరిస్థితులు విషమించాయి. ఇంజనీర్లమీద అప్పటికే ఒకటో రెండో కార్టూన్లు వచ్చాయి. పైగా అంతకుముందు పైదేశాలకి వెళ్లినవాళ్లు పి. హెచ్. డి. లు తీసుకు వచ్చారు. ఇండియాలో ఉన్నవాళ్లుకూడా కాలక్షేపానికి పి. హెచ్. డి.లు చేసారు. అందుకని రమణ్‌కి వుద్యోగం విషయంలో చాలామంది శక్తిసంపన్నులైన పోటీదారు లేర్పడ్డారు. అందుచేత ఏవో రెండు ఇంటర్‌వ్యూలకి వెళ్లి రమణ్ పరాజయం పొందాడు. ఏం చేయాలా అని ఫణిక్కర్ బుర్ర పాడు చేసుకోటం మొదలుపెట్టాడు. ఒకరోజు అర్జెంటుగా ఆఫీసుకువెళ్తూ చొక్కాకి గుండీలు తెగిపోయినట్టు గుర్తించాడు. అప్పుడు 'అమ్మాయి లక్ష్మీ! చొక్కాకి గుండీలు కుట్టు' అన్నాడు. ఆ అమ్మాయి సూదిలో దారం ఎక్కించటానికి నానా తిప్పలూపడి అయిదోసారి ఎక్కించ గలిగింది. అప్పుడు ఫణిక్కర్‌కి జ్ఞానోదయం కలిగింది. పట్టు విడవకుండా ఏ పనైనా చేస్తే విజయం తథ్యం అని గుర్తింపు కలిగింది. చిన్నప్పుడు చదువుకున్న బ్రూసు సాలీడుకథ గుర్తుకొచ్చింది.

ఇల్లా ఉంటుండగా సివిలింజినీరింగ్ ఉద్యోగం ఒకటి ఖాళీ అయింది. కేంద్ర ప్రభుత్వం తరుపున దరఖాస్తులు కోరుతూ ఫణిక్కర్ ప్రకటనిచ్చాడు—రమణ్ చేత దరఖాస్తు పెట్టించాడు. అయితే అడుగులోనే హంసపాదులాగా అప్లైచేస్తిన వాళ్లలో సుబ్బారావనే పి. హెచ్. డి. కుర్రాడు కూడా ఉన్నాడు. అయితే రమణ్‌కున్నది విదేశీడిగ్రీ కనుక ఈ అవాంతరాన్ని సులభంగానే దాటచ్చునని ఫణిక్కర్ అనుకున్నాడు. సెలక్షన్‌బోర్డులో వాడేక్కర్, దండేక్కర్‌లను వేసుకున్నాడు అయితే వాడేక్కర్‌కి చిన్నప్పటి నుంచి ఆదర్శాలు గట్రా అంటే ఇష్టం. లాలూచీలూ. అభిమానాలూ అంటే కిట్టవు. మామూలుగా అయితే వాడేక్కర్ లాంటి దుష్టుల్ని కిందే ఉంచేద్దురు, కాని ఆతగాడు కిందే ఉంటే అతడి కిందవాళ్ళకి ప్రమోషన్లు రాని పరిస్థితుల్లో అతనికి ప్రమోషనిచ్చి ముందుకు నెట్టేసారు. అంటే అతడ్ని పక్కన పెట్టడానికి ప్రయత్నాలు జరగక కాదు. కాని కోర్టువారు ఆ ప్రయత్నాలు సాగనీయలేదు. ఇంటర్‌వ్యూలకి ముందర ఇండియన్ పి. హెచ్. డి.కంటే విదేశీ మాస్టర్స్ డిగ్రీ గొప్పదని ఫణిక్కర్, కాదని వాడేక్కర్ వాదించారు. వాడేక్కర్ అడిగిన ప్రశ్నలవల్ల రమణ్‌కి సుబ్బారావుకిగల భేదం దండేక్కర్‌కి తెలిసిపోయి అతనూ వాడేక్కర్ పక్షమే వాదించాడు. వీళ్లవిషయం ముందరే తెలిసుంటే ఫణిక్కర్ వీళ్లని సెలక్షన్ బోర్డులోని తీసుకోకపోను. కాని అప్పటికే చేతులు కాలాయి. ఏకాభిప్రాయం కుదరనందువల్ల ఖాళీ భర్తీచెయ్యక పోడానికి తమకుగల హక్కును సెలక్షన్‌బోర్డు వాడుకుంది.

ఒకసారి సెలక్షన్‌బోర్డంటూ ఏర్పరిచాక అందులోని మెంబర్లు మనకిబ్బందిగా వున్నారు కదా అని వాళ్లని తీసేసి మరొకళ్లను వేసుకోడానికి వీల్లేదు కదా! అందుకని ఫణిక్కర్ రెండోసారి కాస్త జాగ్రత్త పడ్డాడు. ఇంకోవుద్యోగం మరో రెండు నెలల్లో ఖాళీ అవుతోందని తెలిసి అంత వరకు ఆగి అప్పుడు రెండు వుద్యోగాలకి కలిపి ప్రకటన చేసాడు. ఈసారి ఒకటి సుబ్బారావుకిస్తే రెండోది రమణ్ కివ్వడానికి వాడేక్కర్‌కి అభ్యంతరముండదు కదా అని ఫణిక్కర్ అనుకున్నాడు. కాని ఈసారి ఫారిన్‌లో పి. హెచ్. డి చేసి, నోబెల్ బహుమానం వచ్చిన ఖొరానో అనే సివిలింజినీరింగ్ పిల్లాడు ఇండియా వచ్చాడు వచ్చి ఊరుకోకుండా ఈ వుద్యోగాల ప్రకటన చూసి దరఖాస్తు పెట్టాడు.

ఇంటర్‌వ్యూనాడు ఫణిక్కర్ మేకపోతు గాంభీర్యంతో వాడేక్కర్‌ని చూసి 'ఈసారి నీకు నాకు పేచీలేదు. ఒకఉద్యోగం రమణ్‌కి మరోటి సుబ్బారావుకి' అన్నాడు. లేకపోడమేమిటి అదల్లాగే ఉంది 'ఖొరానా ఫారిన్ పి. హెచ్. డి.' అన్నాడు వాడేక్కర్ 'పోనీ సుబ్బారావుకి మానేసి ఖొరానాకి ఇద్దాం' అని రాజీకొచ్చాడు ఫణిక్కర్. 'నేనన్నది అదికాదు. ఒకటి సుబ్బారావుకి మరొకటి ఖొరానాకి అని తను కూర్చున్న కుర్చీకి మూడేకాళ్లు' అని వాదించాడు వాడేక్కర్. దాని ఫలితంగా రమణ్‌ని తన ప్రశ్నలతో వాడేక్కర్ ఉక్కిరిబిక్కిరి చేస్తే ఫణిక్కర్ సుబ్బారావుని, ఖొరానాని తన ప్రశ్నలతో తికమక పెట్టాడు. దండేక్కర్ చూస్తూ ఊరుకున్నాడు. సెలక్షన్ బోర్డువారు తమ హక్కుని మరోసారి వాడుకుని ఉద్యోగాలు నింపలేదు.

మూడోసారి ఫణిక్కర్ చాలా కష్టపడి ఫైలంతా స్టడీ చేసాడు. అప్పుడతనికి అర్థమైందేమిటంటే సుబ్బారావుది నీటి పారుదల (హైడ్రాలిక్స్) అయితే ఖొరానాది (కట్టడాలు స్ట్రక్చర్స్) రమణ్‌ది ప్రజారోగ్యం (పబ్లిక్‌హెల్తు) అనీను అర్థమయ్యాక ఓ అర్ధరోజు ఆలోచించాడు, ఆపైనా ఓ ఉద్యోగాన్ని నీటికట్టడాలకి (హైడ్రాలిక్ స్ట్రక్చర్) మరోటి ప్రజారోగ్యానికి కేటాయిస్తే పోలా అనుకున్నాడు. పోయేది సుబ్బారావుగాని ఖొరానాగాని. అల్లా కేటాయించి ప్రకటన ఇచ్చాడు. ఇంటర్‌వ్యూనాడు నీటికట్టడాలకి పొద్దున్న. మధ్యాహ్నం ప్రజారోగ్యంకి కేటాయించాడు. ఆరోజు పొద్దున్న వాడేక్కర్ సుబ్బారావుని బలపరుస్తే ఫణిక్కర్ కూడా సుబ్బారావునే బలపర్చాడు. దండేక్కర్ అడ్డుపెట్టలేదు. సుబ్బారావుకి వుద్యోగం వచ్చింది.

సుబ్బారావు వుద్యోగం విషయంలో ఏకాభిప్రాయం కుదిరాక మధ్యాహ్నం వాడేక్కర్‌ని చూస్తూనే ఫణిక్కర్ స్నేహపూర్వకంగా నవ్వాడు. నవ్వితే పోయేదేముందని వాడేక్కర్ కూడా నవ్వాడు. కాని ఇంటర్‌వ్యూలో తన ప్రశ్నలతో రమణ్‌ని తుక్కు రేకొట్టాడు. ఫణిక్కర్‌కిది నచ్చలేదు. కాని మనిషి నవవసరంగా రెచ్చ


కొట్టడం ఇష్టంలేక వూరుకున్నాడు. కేండి డేట్లందరూ అయ్యాక వచ్చినవాళ్లలో రమణ్ ప్రియం కనుక రమణ్ని తీసుకుందామని ఫణిక్కర్ అన్నాడు. ఆమాట నిజమే అయినా, ఒక రెండు నెలలాగితే ఇంకా మంచివాళ్ళు రావచ్చునని ఆ వుద్యోగానికి రమణ్ తగడని వాడేక్కర్ అన్నాడు. దండేక్కర్ అతన్తో ఏకీభవించాడు. బహుశహ ఫణిక్కర్ తనకి రమణ్లోవున్న ఇంటరెస్టు ఏమిటో చెప్తే ఇవతలిద్దరు సరే నందురేమో కాని ఫణిక్కర్ మెరిట్వాదం చేసాడు. అదయ్యాక అందరు ఒకేరాష్ట్రం వార్తైవుండి రమణ్కి వుద్యోగం రాకపోటం అన్యాయంఅని ప్రాంతీయవాదం చేసాడు. మిగిలిన ఇద్దరు కేంద్ర ప్రభుత్వవుద్యోగాలలో ప్రాంతీయ భావాలకి తావు లేదన్నాడు. సెలక్షన్బోర్డు ఖాళీని నింపకపోడానికి నిశ్చయించుకుంది.

ఇల్లా వుంటూవుండగా ఈ పరిశీలనార్థం, ఆ పరిశీలనార్థం అంటూ కేంద్ర ప్రభుత్వం విదేశాలు పంపించే మూలాల్లో వాడేక్కర్ని ఫణిక్కర్ మూడు నెలలపాటు తన పలుకుబడినంతా వినియోగించి తోలేసాడు. ఆలస్యంలేకుండా వెంటనే ప్రకటనిచ్చేసి తనకి రమ్ మరియు రమ్మీ స్నేహితుడైన పర్నిట్క్కర్ని సెలక్షన్బోర్డులో వేసుకున్నాడు. వెంటనే ఇంటర్వ్యూ ఏర్పాటుచేసాడు. ఈ సారి పొంచివున్న ప్రమాదం దండేక్కర్ రూపంలో బయట పడింది. అతను 'కిందటిసారి రమణ్ని వద్దనుకున్నాము కదా! ఇప్పుడు కావాలను కోడం ఏం బావుంటుంది? బావుండదు వద్దు' అన్నాడు. చాలా బాగుంటుంది కిందటిసారి చేసినతప్పు మళ్లీ చేయడం బావుండదు కాని సరిదిద్దుకోడం చాలా బాగుంటుంది' అన్నారు మిగిలిన ఇద్దరు మాటమాటవచ్చి సెలక్షన్బోర్డువాళు తమ హక్కును మరోసారి వాడుకున్నారు.

అయిదోసారి విసుగు చెందని విక్రమార్కుడు తన ప్రయత్నం మొదలు పెట్టాడు. అయితే ఈసారి ఏవిధమైన రిస్కు తీసుకోదల్చుకోలేదు. ఇంటర్వ్యూ డేటు నిర్ణయించి, ఆరోజే దండేక్కర్కీ లెటర్ టైపుచేయించినా అది ఇంకా ఇంటర్వ్యూకి రెండు రోజులుందనేవరకు పోస్టు చేయించలేదు ఫణిక్కర్. ఆ ఉత్తరం అంది దండేక్కర్ ఇంటర్వ్యూకి రాదల్చుకున్నా ఇంటర్వ్యూ టైముకి రాలేదు. అది ఫణిక్కర్ పన్నాగం అయితే దండేకర్ మొండి ఘటం కనుక తను ఇంటర్వ్యూనాడు మధ్యాహ్నం విమానంలో వస్తున్నట్టు అందుకని కొద్ది గంటలపాటు ఇంటర్వ్యూని పోస్టుపోన్ చెయ్యదల్చుకుందిగా టెలిగ్రామ్ ఇచ్చాడు. ఫణిక్కర్ అటువంటి తెలివి తక్కువపని ఏమీ చెయ్యదల్చుకో లేదు అందుకని ఆ టెలిగ్రామ్ అందుకున్న గుమస్తాని పిల్చి 'నువ్వెన్నిరోజులబట్టో మీ అత్తగారివూరు వెళ్దామను కుంటున్నావు కదా! ఇవాళ వెళ్ళు' అన్నాడు. తనదగ్గర డబ్బులేదన్నాడు గుమస్తా. అప్పుడు ఫణిక్కర్ ఈ అయిదురూపాయిలు ఉంచుకో' అంటూ వో అయిదు చేతిలో పెట్టాడు. ఆ మర్నాడు అనుకున్నవిధంగా పొద్దున్నే ఇంటర్వ్యూలు జరిపి మూడో సభ్యుడైన దండేక్కర్ రానందుకు రెండు నిమిషాలు అఫీషియల్గా చింతించి ఆపైన ఆ వుద్యోగం రమణ్కి కట్టబెట్టాడు. టెలిగ్రామ్ విషయం ఆఖరికి పర్నిట్క్కర్ కూడా తెలియదు. తెలిసిన గుమాస్తా ఊళ్లోలేడు. దండేక్కర్ మధ్యాహ్నం రాగానే 'మీరొస్తున్నట్టు తెలిస్తే ఇంటర్వ్యూ వాయిదా వేసేవాళ్ళము కదా. విమానాశ్రయానికి కారు పంపేవాళ్ళమే' అంటూ ఫణిక్కర్ చింతించాడు. దండేక్కర్ ఆశ్చర్యపోతూ తను టెలిగ్రామ్ ఇచ్చిన విషయం చెప్పాడు. అప్పుడు ఫణిక్కర్ నానా హంగామాచేసి రాత్రి గుమాస్తా డ్రాయర్లలోంచి బయటతీసి దండేక్కర్కి క్షమాపణ చెప్పుకున్నాడు. చేసేదిలేక తను కూడా ఆ నిర్ణయంతో ఏకీభవిస్తున్నట్టు సంతకంపెట్టి టిఎ తీసుకున్నాడు దండేక్కర్. దండేక్కర్ తల్లిదండ్రులు బాపూరికి. ఇంటర్వ్యూపేరు చెప్పుకుని ఇప్పటికైనా సార్లు వచ్చాడు. ఆరోజుతో ఆ అవకాశం పోయినందుకు దండేక్కర్ బాధపడ్డాడు.

ఈకథలో పట్టువిడువని సాలీడు ఫణిక్కర్ అయితే తెగిపోనిదారం రమణ్. దారం తెగివుంటే సాలీడు ఏం చేసును! విసుగు చెందని విక్రమార్కుడు ఫణిక్కర్ అంటే అన్నిసార్లు వో పి గ్గా వెళ్ళిపోయిందనుకున్న ప్రేతం రమణ్. అంటే ఏమిటంటే మధ్యలో రమణ్కి విసుగొచ్చి వాకౌట్ ఫణిక్కర్ ఏం చేయగల్గుతాడు! అంటే ఫణిక్కర్ ఎంత గొప్పవాడో రమణ్ అంత గొప్పవాడు. ఆ విషయం గుర్తించి ఫణిక్కర్ వో అమ్మాయి పోయాక కూతుర్నిచ్చి పెళ్లిచేసాడు. అమ్మాయి అనుకున్నదని సాధించింది. ఈకథలో ప్రొటాగనిస్టు ఎవ్వరు గెలుపుని ప్రజ్ఞావిధుల్, అమ్మాయి ఫణిక్కర్, రమణ్. విధ్యాంతో విసుగెత్తి మధ్యలో పట్టువిడిచిన వ్యక్తులు వాడేక్కర్ మరియు దండేక్కర్. వాడేక్కరుకూడా తనలోనాలో ఎందుకు వేయాల్సొచ్చిందంటే, అతను నిజమైన కథైతే పైదేశాలకి పోకుండా తనవిషయం అంతులేచ్చి వుండాల్సింది. అతనుకూడా ఇంటర్వ్యూలో విదేశాలు దొరికితే తప్పుకుందామని అనుకుంటాడు.

(సైకారం: అమోఘభూతి అన్నకథ)



ప్రశ్నోత్తరాలు

...కె. రామలక్ష్మి...

● ఎన్. గోపాలం

సినిమా తీయడం ప్రజల ఆదరణ కోసమా? లేక కేవలం డబ్బుకోసమా?

ప్రజల ఆదరణా డబ్బూ కూడా లభ్యం అవుతాయి సినిమా తీస్తే. ఒక్క ప్రజల ఆదరణే ధ్యేయం అయితే సినిమా లెందుకు తియ్యడం— రాజకీయాల్లోకి దిగి వోట్లరోజుల్లో ఊరూరా తిరగొచ్చు. గెలిస్తే అధారిటీ చెలాయించవచ్చు. వోడిపోతే నామినేషన్ కోసం పాకులాడవచ్చు. దొరక్కపోతే అవకాశం కలిగే దాకా వేచి ఉండవచ్చు. ఏమంటారు?

పి. వి. ఎస్. ఆర్, కొవ్వలవారి పాలెం

అక్కయ్యా కుటుంబ నియంత్రణపై మీ అభిప్రాయం!

ముగ్గురు మించిన కొమ్మకు భారం అని పూర్తిగా నమ్ముతాను.

కె. వి. ఆర్. ఎమ్, బిల్లుమడ (శ్రీకాకుళం)

అసలు విషయం అడుగుతున్నందుకు కోపం తెచ్చుకోకండి. శరత్‌లాంటి ఉత్తమ రచయితను విమర్శించడానికి తగిన తెలివి మీకు ఉందా? ఉంటే నిజంగా విమర్శించక పోదురు

లాజికల్‌గా చెప్పాలంటే

శరత్‌ని విమర్శించాను.

శరత్‌ని విమర్శించిన వారికి తెలివి లేదు.

అంచేత,

శరత్‌ని విమర్శించిన మీకు తెలివి లేదు—అనేగా మీ వాదన. విమర్శించడానికక్కూడా తెలివెందుకండీ బాబూ, రాయడానికే అక్కరలేక పోతూంటే!..... చూడండి మూర్తిగారూ, మీరు వంకాయిముద్ద కూర చప్పగా తింటారు. నాకేమో అల్లం కారం వేసి కావాలి. మీకు కాఫీ ఇష్టం. నాకు టీ. మీకు శరత్ అన్ని రచనలూ దివ్యగ్రంధాలు. నాకు కొన్ని రచనలే బాగుంటాయి. ఏం చేస్తాం చెప్పండి., నాలాంటి మూర్ఖుల సరసనా, మీలాంటి విజ్ఞుల సరసనా కూడా మనుషులు బతుకుతున్నారు. చిత్రంగా లేదూ!

బి. వి, గుంటూరు

మీ రచన మొదటి సారిగా పత్రికలో చూసుకున్నప్పుడు మీకెలాంటి భావం కల్గింది! ఎవరెస్టు శిఖరం ఎక్కినంత సంతోషం కల్గిందా?

లేదు చిట్టితల్లీ, చచ్చే భయం వేసింది. గోరా శాస్త్రి అదిచూసి ఖర్మ. ఇన్ని అచ్చుతప్పులూ కాలేమిటి? వాముఖం అంటూ సాధించారు. పైపెచ్చు ప్రతి వాక్యం శల్యపరీక్ష చేసి ఇదెందుకు రాశాను రా బాబూ, అని కంట నీరెట్టుకునేలా చేశాడా మహానుభావుడు!

గోరాశాస్త్రి ఎప్పుడూ అంతే— ఏదేనా బాగుంటే అభినందించడు. బాగులేకపోతే మటుకు స్పేర్ చెయ్యడు. చాలా రేర్ బ్రీడ్ ఆఫ్ ఏన్ ఎడిటర్. అంతే కాదు. కిల్ జోయ్. బాగుందంటే ఆడపిల్లని సంతోషిద్దును కదా. ఊహూ, అదేం లేదు. రచనకి ఆడేమిటి? మొగేమిటి అనే రకం. అలా చంపి రాయడం నేర్పితేనే యీ మాత్రం వంటపట్టింది.

సి. ఏ. గవండ్లపాలెం

సతీసావిత్రి తన పతిని బ్రతికించుకొన కల్గుట పూర్వజన్మ సుకృతము వల్లనా, పాతివ్రత్య మహిమవల్లనా బుద్ధి కుశలతతో వరములడిగి యమధర్మరాజును బోల్తా కొట్టుటవల్లనా?

నేనా సినిమా చూడలేదుసార్.

వి. డి. జి, అనకాపల్లి

దీనికి అర్థం చెప్పండి చూద్దాం!

భీదల సొమ్ముకొట్టి ధనవంతుడై గద్దె ఎక్కినగాని

భీదల అధైర్యము లేనిదె ధనవంతు డెట్లగున్

మెట్టుమెట్టు పైమెట్టు ఎక్కినగాని

కిందమెట్టు అవసరముండదా వో స్థిరరత్న కవిరాజా.

వో కదలని రత్నంవంటి కవిరాజా, పేదవాళ్ల ధనము అపహరించి గొప్పవాడై సింహాసనము ఎక్కిన గాని పేదవాళ్ల ధైర్యము [సహాయం] లేకున్నచో గొప్పవాడు ఎట్లు కాగలడు? మెట్టుమెట్టుగా పైకి ఎక్కిన గాని. . . . ఇక్కడి కెన్ని మార్కులిస్తారో యివ్వండి సార్. మీగిరిలినది వ్యాకరణంలో మేకప్ చేసుకుంటాను!. . . చివరి కొచ్చేసరికి మీ భీదలు మెట్లు నా మతి పోగొట్టాయి.

ప్రేమ, తిరుపతి

మీరు మధ్యంతర ఎన్నికలలో పాల్గొంటే తప్పక గెలిచే అవకాశాలుంటాయి. అయినా మీరెందుకు పాల్గొనలేదు? డబ్బు పోతుందని భయమా?

కాదు. పరువు!

జె. సి. హెచ్. ఆర్, విజయవాడ

స్త్రీలు ఎన్నికలలో నిలబడితే వారికే చిహ్నాలు బాగుంటాయి మేడమ్?

మీ ఊరేగా పురాణంసీతగారినడిగితే— చెప్పేద్దురు— ఏ గరిటో పాత జాకెట్టో. . . .

ఎన్ ఎస్. ఎన్, యావర్గ

ఏమీ అనుకోకండి. మీ కెంతమంది ఆడ పిల్లలు?

ఏమైనా అనుకోవడమెందుకు? ముగ్గురు.

కె. ఎస్. ఎస్. హల్గ్లి

రామలక్ష్మిగారూ నాకు దేవుని పై నమ్మకం వుంది. కాని దైవారాధన చేయ లేక పోతున్నాను. కారణం చెప్పకలరా?

మరేం ఫరవాలేదు సార్. దైవారాధన చేసి తీరాలన్న నిబంధన ఎక్కడా లేదు.

కె ఏ. డి, విశాఖ

ఈ మధ్య మన కవులందరూ అసలు కవిత్వాన్ని వదిలి బూతుల కవితలలోకి దిగారెందుకు?

అసలు కవిత్వం ఇదే నంటున్నారు కదా— నమ్మండి. దీన్ని కవిత్వం అనకూడదు. దీనికింకో పేరేదో నిర్ణయించాలి. కవిత్వం మంచిని పెంపొందించేదీ, చెడు నుంచి విముఖులను చేసేదీ, మనసుకి ఆహ్లాదాన్నీ, మెదడుకి మేతనీ కొత్త చైతన్యాన్ని కల్గించేదీ అనుకునేదాన్ని. ఈ రాతలే కవిత్వం అంటే ఇవి వీరు రాసేదేమిటి? ఏ మురికిపేటల్లోనైనా రాత్రిపూట వినవచ్చు— అందులోనూ మీకు మధ్యని భేదంకూడా లేదు! కవిత్వ ఒక నమ్మిక, ఒక సంగీతం, తనకు తాను పాడుకొంటున్నభాష, మంచి క్రమంలో పేర్చి మాటల పొందిక, శక్తివంతమైన అనుభూతుల ప్రవాహ సందోహం. ఇంకా ఎన్నో అనుకునే యువతరాన్ని— మోసం చేస్తున్నారు— ఈ కవులు.

కె. ఎస్, సికింద్రాబాదు

మీ జవాబులు తమాషాగా చెలాకీగా ఉంటాయి. మిమ్మల్నిచూసి జీవితంలోని కష్టాలను ఎదుర్కొనే ధైర్యం అలవడుతుందనడంలో సందేహం లేదు.

నువ్వామాట అంటే చాలా చిట్టితల్లీ? నాదెంత లేకపోతు గాంభీర్యమో మా యింటివాళ్ళు చెప్పాలి!

డి. ఎల్, ఎల్, కుద్దారొద్దు

గాంధీజీ మళ్లీ పుట్టాడని వీరబ్రహ్మం గారు వ్రాశారట. నిజమేనా?

పుణ్యపురుషులెప్పుడూ తాము వదలివెళ్లిన పనిని తమ అనుయాయులు ఎలా పూర్తి చేస్తున్నారో, కొనసాగిస్తున్నారో చూడ్డానికి మళ్ళీ పుట్టే ఉంటారు. పాపం, గాంధీజీ ఎక్కడో పుట్టి క్షణం క్షణం మరణిస్తూనే ఉంటాడు. ●


భలేగా వుంటాయి మీ పాదాలు ..
రెండు రంగుల
సొగసు సొంపులు
శాండక్*
పమియా కెమిలాన్*
సైజు 2-8
వెల 10.95
Bata

ముగ్గురు మూర్ఖులు

(7 వ పేజీ తరువాయి)

ఫోటోలను ప్రచురించే పత్రికలమీద చర్య తీసుకొనే అవకాశం ఉండదు. అప్పుడు హిందువుల మనస్సుకు కష్టం కలగకుండా ఉండటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది' అనే విషయం ప్రజలకు యెలాగ తెలుస్తుంది? ఇటువంటివాటికి గిరీశం వాదం ఉండ్లికదా!' అన్నాడు చంద్రావు.

'ఏమిటి ఆ వాదం?' అని చూడామణి ప్రశ్నించగా చంద్రావు తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

'అగ్నిహోత్రావధాన్లు రెండవ కుమార్తె సుబ్బమ్మను లుబ్దావధాన్లుకు యిచ్చి పెళ్లి చేయడానికి నిశ్చయిస్తారు. లుబ్దావధాన్లుకు అరవైయేళ్లు దాటాయి. సుబ్బమ్మ చాలా చిన్నపిల్ల.

'ఇటువంటి వివాహం చేయడం మంచిది కాదు' అని గిరీశం అగ్నిహోత్రావధాన్లుతో చెబుతాడు. కాని గిరీశం మాటలను అగ్నిహోత్రావధాన్లు వినడు. అప్పుడు గిరీశం 'యిటువంటి బాల్య వివాహాలు చెయ్యవలసిందే' అని కొత్తవాదాన్ని లేవతీస్తాడు. తరువాత గిరీశం తనకు తోచిన కొత్త వాదాన్ని, వెంకటేశంతో యిలాగ చెబుతాడు.


'బాల్య వివాహాలు జరిగితేనేగాని బాల వితంతువులు ఉండరు. బాల వితంతువులు ఉంటేనే గాని, వితంతూ వివాహ సంస్కరణకు అవకాశం ఉండదుకదా! నాగరకతకంతటికీ సారం వితంతూ వివాహమే అయినప్పుడు, బాల్యవివాహాలు జరగకపోతే నాగరకతే ఆగిపోతుంది గనుక తప్పకుండా బాల్య వివాహాలు చెయ్యవలసిందే; అందులోనూ చిన్నపిల్లల్ని ముసలాళ్లకిచ్చి పెళ్లి చెయ్యడం కూడా మంచిదే అని నేను వాదిస్తాను.'

అలాగే హిందువుల మనస్సుకు కష్టాన్ని కలిగించే ఫోటోలను ప్రచురించే పత్రికల మీద చర్య తీసికొనడం ప్రభుత్వం యొక్క కర్తవ్యం. అసలు హిందువుల మనస్సుకు బాధని కలిగించే విధంగా, హిందూదేవతలను అవమానించే ఊరేగింపులు జరిపితేనేగాని, అటువంటి ఫోటోలు ఉండవు. అసలు ఊరేగింపునే నిషేధించినట్లయితే ఫోటోలు యెక్కడ నుంచి వస్తాయి? అప్పుడు అటువంటి ఫోటోలను ప్రచురించే పత్రికల మీద ప్రభుత్వం చర్య తీసికొనడానికి అవకాశం యెక్కడ ఉంది?

అందుచేత ముందుగా హిందువుల మనస్సుకు వ్యధని కలిగించే ఊరేగింపులను జరపనివ్వనట్లయితే, అటువంటి ఫోటోలు వస్తాయి. అప్పుడు ఆ ఫోటోలను ప్రచురించడాన్ని ప్రభుత్వం నిషేధించవచ్చును. ఆ పరిస్థితిలో ప్రభుత్వం పూర్తిగా తన కర్తవ్యాన్ని నెరవేర్చినట్లు కాగలదు' అన్నాడు చంద్రావు.

'ఇక్కడ మనం యింకో విషయాన్ని గురించి కూడా ఆలోచించవలసి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం యీ విషయంలో నిర్లక్ష్యంగా ప్రవర్తించింది' అని అనుకొందాం. అయినా కేంద్రప్రభుత్వం యీ విషయంలో యింతవరకు యెందుకు చర్య తీసికొనలేదు?

ఎక్కడో ఉన్న అల్‌అక్సా మసీదుకు అగ్ని ప్రమాదం జరిగితే, తల్లడిల్లిపోయిన కేంద్ర



ప్రభుత్వం ఈ విషయంలో యెందుకు మౌనం వహించింది? హిందువులు పట్టి స్వరూలు. హిందువులకు యెన్ని అవమానాలు జరిగినా, ఫరవాలేదు అనే అభిప్రాయంతోనే కదా! యింతవరకు కేంద్ర ప్రభుత్వం యే చర్యా తీసికొనలేదు.

క్రైస్తవులకు సంబంధించిన సిలువకు గాని బైబిలు గ్రంథానికి గాని యిటువంటి అవమానం జరిగితే, యెన్ని గొడవలు బయల్దేరతాయో, కేంద్రప్రభుత్వం యెంత చురుకుగా వ్యవహరిస్తుందో యెవరైనా ఊహించవచ్చును.

అలాగే మహమ్మదీయులకు సంబంధించిన మక్కా మదీనా పటాలకు గాని ఖురాన్ గ్రంథానికిగాని యిటువంటి అవమానం జరిగితే, యెన్ని అల్లర్లు జరిగి ఉండేవో, కేంద్ర ప్రభుత్వం యెంత అడావుడి చేసి ఉండేదో సులభంగానే ఊహించవచ్చును' అన్నారు మాడామణి.

'అవును. మహమ్మదీయ మతాన్ని స్థాపించిన మహమ్మదుకు చెందిన కేశం ఒకటి కాశ్మీరులోని ఒక మసీదులో ఉంది. కొన్ని సంవత్సరాల క్రిందట దానిని యెవరో దొంగిలించారు. ఆ కేశాన్ని తిరిగి పట్టుకొనడానికి కేంద్రప్రభుత్వం యెంతో ప్రయత్నం చేసింది. ఏదో విదేశం మన దేశంమీద దండయాత్ర చేసినట్లు మన ప్రభుత్వం భావించి, విశ్వప్రయత్నం చేసి చివరకు ఆ కేశాన్ని పట్టుకొంది.

'మహమ్మదీయ మతానికి సంబంధించిన విషయంలో యింత పట్టుదలగా వ్యవహరించిన కేంద్రప్రభుత్వం, హిందూదేవతా విగ్రహాలను చెప్పులతో కొట్టినా యెందుకు ఊరుకొంది? ఈ విషయాన్ని హిందువులందరూ తీవ్రంగా ఆలోచించవలసి ఉన్నది' అన్నాడు చిదంబరం.

'ఇప్పటికే ఆలస్యం అయింది' అంటూ మాడామణి లేవగానే మిగిలిన యిద్దరూ అతన్ని అనుసరించారు. ●



లయబద్ధంగా ఆడుతున్న స్వింగర్స్.

ఢిల్లీలో అపూర్వ సంఘటన

పాశ్చాత్యదేశంలో యువతరం కొత్తదనాన్ని వెతుక్కుంటూ కాలంతోపాటు పరుగెడుతున్నది. వేషభాషలూ — వినోదాలు నిత్యమూ సరికొత్త రూపురేఖలు ధరించడం అక్కడ మామూలుగా జరుగుతున్నదే. మినిస్కర్ట్సులు, బికినీ డ్రస్సులు, హాట్ ప్యాంట్లు, మాక్సికోట్లు అక్కడ పుట్టి ఎలా అయితే ప్రపంచ వ్యాప్తమయ్యాయో — అలాగే 'హ్యాపెనింగ్' కూడా ప్రపంచంలో యువతరాన్ని బాగా ఆకర్షిస్తున్నది. ఉదాహరణగా ఈ మధ్య ఢిల్లీలో ఏర్పాటయిన 'హ్యాపెనింగ్'ని చెప్పుకోవచ్చు. ఈ కార్యక్రమంలో టన్నుల కొద్దీ వినోదం లభించిందని చెప్పాలి!

ఇది లోడీగార్డెన్స్‌లో ఏర్పాటయింది. 'జెయస్' (జనసంఘం కాదు!) అని పేరుపడ్డ జూనియర్ స్టేట్స్‌మన్ మ్యూజిక్ ఫెస్టివల్ కారణంగా యువతీయువకులు ఎంతో ఆనందంగా కలిసి మెలిసి కేరింతాలు కొట్టడానికి మంచి అవకాశం దొరికింది. అసలు లోడీగార్డెన్స్ అంటేనే బోల్డంత సంబరపడిపోతారు జనం. ఇక, అక్కడి వినోద కార్యక్రమం అంటే యువతరానికదో పండుగ!

లుంగీలు, జీన్స్, శ్లాక్స్, హగ్ — మి — షైట్స్, మినీస్, మాక్సిస్‌లాంటి వేషధారణతో యువతీయువకులు లోడీగార్డెన్స్‌ని పర్యాంగమందరం చేశారు. ప్రపంచంలోవున్న ఆధునికమైన ఫాషన్లన్నీ అక్కడ ప్రత్యక్షమయ్యాయి!

మన శాస్త్రీయ సంగీతం దగ్గర్నుంచి — పాప్‌మ్యూజిక్‌వరకు అన్నిరకాల పాటలూ అక్కడ వినిపించాయి. అందరూ భాగం పంచుకున్నారు. రవీంద్ర సంగీత్, అమ్జాద్ అలీఖాన్‌గారి సరోద్‌కూడా ఈ వినమయ కార్యక్రమంలో పాల్గొన్నారు. బెంగుళూరునుంచి హ్యూమన్ బాండేజ్ గ్రూప్ — ఢిల్లీలో అల్లాన్, క్రిస్ — న్యూజిలాండ్ గిటారిస్ట్ బెర్సెసన్ — పై లెవ్వర్లు ఈ కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు.

మనదేశంలో ఇలాంటి గొప్ప కార్యక్రమం జరగడం ఇదే మొదటిసారి.

పచ్చని చెట్లక్రింద యువతీ యువకులు చెట్టాపట్టాలేసుకుని ఆడారు; పాడారు; నృత్యం చేశారు. పిచ్చిపిచ్చిగా ఆనందాన్ని పంచుకున్నారు. హిప్పీల పుణ్యమా అంటూ ఢిల్లీలో 'హషిష్' పుష్కలంగా దొరుకుతున్నది. ఈ కార్యక్రమంలో హషిష్ జనాన్ని మత్తెక్కించింది. వాళ్లెం చేస్తున్నారో తెలియకుండా చేసింది!

అక్కడ లభించని వినోదంలేదు. బహుశా ప్రేమించడమొక్కటేనేమో అక్కడ తక్కువ! యువతరం మరచిపోలేని కార్యక్రమం 'హాపెనింగ్'.

— శిష్టమల్ల వెంకటనారాయణ ●

నటి, నర్తకి

కుమారి కౌసల్య



చక్కని శరీర సౌష్ఠవం, కనుముక్కుతీరు, పలువరుస కలిగి వున్న వాళ్ళలో నటన లోపించటమో, నటనలో ప్రతిభ కలిగిన వాళ్ళకి అందచందాలు కొరవడటమో — యిప్పుడు వస్తున్న కొత్త తారల విషయంలో సాధారణంగా జరుగుతున్నది.

తెరకు పనికివచ్చే అందం, నటనలో సామర్థ్యం ఉన్నవాళ్ళు చాలా అరుదుగా, నూటికి ఏ యిద్దరో లభ్యమవుతున్నారు. ప్రేక్షకులు కొత్తదనం కోరుతున్నారు. కొత్తవాళ్ళు కావాలంటున్నారు. పరిశ్రమ అలాంటి వారికోసం గాలిస్తున్నది. సామర్థ్యం కలిగిన ప్రతితారనూ చక్కని వేషాలిచ్చి ప్రోత్సహించటానికి యిప్పుడు ప్రతి నిర్మాతా ముందుకి వస్తున్నారు.

'ఆంధ్రసచిత్రవారపత్రిక' ద్వారా కిందటి సంవత్సరం సెప్టెంబరులో తొలిసారిగా పరిచయం చేయబడ్డ కుమారి ఉషానందిని ఇవాళ ఆర్. ఆర్. పిక్చర్స్‌వారు 'సావన్‌భా దూన్' హిందీ చిత్రం ఆధారంగా తెలుగులో నిర్మిస్తున్న కలర్ చిత్రంలో కథానాయికగా బుక్ అయింది. కిందటేడాదివచ్చిన కొత్త తారల్లో ఆ అమ్మాయే నిలబడ్డది. ఈ సంవత్సరం వచ్చిన కౌసల్యలో కూడా అలాంటి ప్రతిభా విశేషాలు ఉన్నాయి.

కౌసల్య మొన్నటిదాకా బాలతారగా ఉంది. 'పిన్ని' 'భలేకోడళ్ళు' చిత్రాలలో బాలనటి. ఇప్పుడు యుక్తవయసులోకి అడుగుపెట్టింది. నటుడు జయశంకర్ పక్కన కథానాయికగా రెండు తమిళచిత్రాలలో నటించేందుకు ఈ సంవత్సరమే ఒప్పందం జరిగింది. ఇపుడా చిత్రాలు షూటింగులు జరుగుతున్నాయి కూడా.

29 జనవరి 1955 లో మద్రాసులోనే జన్మించిన కుమారి కౌసల్య యస్. ఐ. ఇ. టి. కాలేజీలో పి. యు. సి. పాసయింది. బి. యస్. సి. చదవాల్సిందే గాని, సినిమాలలో మంచి అవకాశాలు రావటంవల్ల డిస్‌కంటిన్యూ చేసింది.

చదువుతోపాటు సంస్కారం, మాట నెమ్మది, మంచి ప్రవర్తన అలవర్చుకున్న కౌసల్య, భరతనాట్యం, ఓరియంటల్ నృత్యాలలో శ్రీ సెల్వరత్నం పిళ్లైవద్ద చక్కని శిక్షణపొంది నేర్పుతో గ్రహించింది. ఇవేకాదు; ఎలాంటి ఆధునిక పాశ్చాత్య నృత్యాలనయినా ఇట్టే చేయగలగటం నేర్చుకున్నది.

'తెలుగు చిత్రాల్లో' నటించాలనే ఉత్సాహం నాలో ఎంతగానో ఉన్నది. మంచి అవకాశంవస్తే, ఆపాత్ర పోషణలో శ్రద్ధ వహించి కృషిచేసి రాణించేందుకు ప్రయత్నిస్తాను' అంటుంది కౌసల్య. తీరికవేళల్లో నృత్యాలు ప్రాక్టీసు చేయటం, పుస్తకాలు చదువుకోవటం ఈ అమ్మాయి సరదాలు!

అందమూ, టాలెంటూఉన్న కొత్తతారల కోసం గాలిస్తున్న నిర్మాతలకు— కౌసల్య ఆలోటు పూడ్చగలదు.

—ఇంటర్వ్యూ: మోహన్‌కుమార్ ●



ఇటీవల మదరాసులో జరిగిన గోద్రెజ సోప్స్ ప్రైవేట్ లిమిటెడ్‌వారి కొత్త బ్యూటీ టాల్క్ పౌడర్ ఆవిష్కరణోత్సవంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి షావుకార్ జానకి. ప్రక్కనున్నవారు సంస్థ మదరాసు బ్రాంచి మేనేజర్ శ్రీ ఎ. కె. ఎమ్. రావు.

ఐ. శాంతకుమారి, మోదుకూరు.

ప్ర: నలుపు వాళ్ళకి ఏరంగు చీరెలు ధరిస్తే బాగుంటాయో తెలుపుతారా?

జ: వైట్ అండ్ బ్లాక్; డార్క్ బ్రౌన్; డార్క్ గ్రీన్ కట్టకూడదు. తెలుపురంగుతప్ప యితర లైట్ షేడ్సువున్న ఏచీరెకట్టినా బాగుంటుంది.

ప్ర: మీ అమ్మగారైన సంధ్యగారు యిపుడు సినిమాల్లో నటించడం లేదా?

జ: నేను సినిమాల్లో ప్రవేశించినప్పట్నుండీ, మా అమ్మగారు నటించడం మానేశారు. సుమారు ఏడూ ఎనిమిది సంవత్సరాల నుండీ.

జి. జనార్ధనరావు, ద్రోణాచలం.

ప్ర: అక్కయ్యా, మీరు యింతవరకు సినిమా రంగంలో ఎన్నోచిత్రాల్లో నటించారుగదా. మీరు నేర్చినదేమిటి?

జ: ఎవ్వరినీ నొప్పించకుండా, మన పని మనం చేసుకోవాలనే దాన్ని నేర్చుకున్నాను.

డి. సుంకన్న, గద్వాల్.

ప్ర: మీరు ఖాళీ సమయాల్లో ఏం చేస్తారు?

జ: చదువుతాను; వ్యాసాలు వ్రాస్తాను. గ్రామఫోను రికార్డులను వింటాను. రేడియో ప్రోగ్రాములో మంచివివస్తే, టేప్‌రికార్డ్ చేస్తాను. డ్రాయింగ్ వేస్తాను. డ్యాన్సు క్లాసుకు వెళ్తాను.

ప్ర: నటి అంటేనే శీలాన్ని శంకిస్తుంది లోకం దానికి కారణం?

జ: కొన్ని పత్రికలే. మేము చెప్పేదానికీ, విపరీతార్థం కల్పించి వ్రాసేవాళ్లు కొందరున్నారు. లేడీ ఆర్టిస్టులపై తప్పు అభిప్రాయాన్ని కల్పిస్తారు కొందరు.

ప్ర: తెరమీద ముద్దుపై మీ అభిప్రాయం?

జ: నేను అంగీకరించను. అలాంటి దృశ్యాల్లో నేను ముమ్మాటికీ నటించను.

ఎస్. ఆర్. చెన్నారి, మిర్యాలగూడ

ప్ర: మీరు యిదివరకులా తెలుగు



చిత్రాల్లో ఎక్కువగా నటించడంలేదు. కారణం?

జ: ప్రత్యేక కారణాలంటూ ఏమీ లేవు. మున్ముందు ఎక్కువగా కనిపిస్తాను.

ప్ర: 'శ్రీకృష్ణ విజయము' లోని వసుంధరపాత్ర కేవలం మీకోసమే కల్పించబడిందని చాలామంది అంటున్నారు, మీరేమంటారు?

జ: నేనూ అలాగే అనుకుంటున్నాను. ఆ పాత్రకు పరిపూర్ణ న్యాయం చేసాననికూడా అనుకుంటున్నాను.

ఆర్. నారాయణగౌడు, రెంజర్ల

ప్ర: మీ మొదటిచిత్రం 'మనుషులు— మమతలు' అనుకుంటాను. మీరు యింతవరకు ఎన్ని చిత్రాల్లో నటించారు. మీకు నచ్చినదేది?

జ: గత సంచికలో యిలాంటి ప్రశ్నకు సమాధానం యిచ్చాను.

బి. ఎల్. నారాయణ, రాయికల్.

ప్ర: సాటి స్త్రీ అఘాయిత్యంచేస్తే, చూసి వూరుకుంటారా? లేక అరికట్టడం మంచిదా?

జ: తప్పు చేసేవాళ్లు ఆడఅయినా మగ అయినా, ఆ తప్పును వాళ్లకు చెయ్యకూడదని చెప్పడమే బుద్ధిమంతుల లక్షణం.

వి. విజయకుమార్, బాపట్ల.

ప్ర: మీ అందము, చిలిపితనము నాకు నచ్చాయి. ఎందుచేత?

జ: మీకే తెలియాలి. నచ్చాయి అని చెప్పుతున్నందుకు నా ధన్యవాదాలను స్వీకరించండి.

పి. రాజారావ్, ఆర్మూర్

ప్ర: మీ మాతృభాష, కులము ఏమిటి? మీరు ఎంతవరకు చదువుకున్నారు? మీయిష్ట దైవము ఎవరు?

జ: తమిళం; అయ్యంగార్ బ్రాహ్మణులం. మద్రాస్ మెట్రిక్, వినాయకుడు.

పి. భానోజీరావు, టాటానగర్.

ప్ర: నటీనటులు సినీపరిశ్రమలో పని చేయుట కళకోసమా? డబ్బుకోసమా?

జ: కేవలం కళకోసమంటే పచ్చిఅబద్ధం అంటాను. భుక్తికోసం వచ్చి, దాన్ని యేర్పరచుకుంటూ కళను పోషించడం అంటే అంగీకరిస్తాను.

మీకు తెలుసా?

నటుడు రమణమూర్తికి యాక్సిడెంట్ జరిగింది. గట్టి గాయాలు తగిలాయి. ప్రస్తుతం ఆయన మద్రాస్ స్టాన్లీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

హిందీ నటుడు జోహార్ ఎన్నికల పోటీనుండి (బొంబాయి) విరమించుకున్నాడు.

నటి షర్మిలా టాగూర్ తనభర్త పటౌడీకి వోటు వెయ్యమని హర్యానాలో ప్రచారంచేస్తూ వుంది.

మళయాళనటి షీలా ఎలెక్షన్‌లో పోటీ చెయ్యకపోయినా, దర్శకనిర్మాత రామూ కరియత్‌కు వోటు వెయ్యమని కేరళలో తీవ్రంగా ప్రచారంచేస్తూ వుంది, ఆమెవెంట ప్రేమనజీర్, మధు కూడా వున్నారు.

'జానీమేరానావ్' చిత్రంలో నటించిన పద్మాఖన్నాను దర్శకుడు బి. ఎస్. నారాయణ 'ఫూల్—గులాబ్—కా'లోని ఒక ముఖ్యపాత్రకు బుక్ చేసాడు.



'పవిత్రబంధం'లో నాగేశ్వరరావు, కాంచన

చిత్రసమీక్ష

పవిత్రబంధం

ఆగర్భ శ్రీమంతులయింట పెరుగుతూ పంజరంలో పక్షిలా (బతుకుతున్న) అరుణ, స్వేచ్ఛావిహంగంలా విహరించాలని యిల్లు విడిచిపెట్టి పారిపోతుంది. డిగ్రీ ఉండి, ఉద్యోగంలేక నిరుపేదగా జీవితం గడుపుతున్న యువకుడు అశోక్‌ని కలుసుకుంటుంది. ఒకరిచేత మరొకరు ఆకర్షింపబడి ప్రేమించుకుంటారు. అరుణ శ్రీమంతుల బిడ్డఅనీ, యింటినుంచి పారిపోయి వచ్చిందనీ, ఆమెకోసం ఆమె తండ్రి మంచంపట్టి ప్రమాద పరిస్థితుల్లో ఉన్నాడనీ—అశోక్‌కి తెలీదు. ఒకరోజున ఈ విషయాలన్నీ తెలిసి అరుణను ఆమె యింటికి చేరుస్తాడు అశోక్. డబ్బు కోసమే అతను తనను యింటికి చేర్చాడని అనుమానిస్తుంది. అతని నిజాయితీని శంకిస్తుంది. అభిమాన ధనుడయిన అశోక్ డబ్బుకోసం తానీపని చేయలేదనీ, మనసున్న మనిషిగా తన కర్తవ్యం నిర్వహించాననీ చెప్పి అరుణ విసిరికొట్టిన పదివేలూ అక్కడే వదిలేసి ఆవేశంగా వెళ్ళిపోతాడు. దారిలో కారు ప్రమాదానికి లోనయి పూర్వస్మృతి కోల్పోతాడు.

అరుణ అతని నిజాయితీని గుర్తించి అనురక్తితో వచ్చేసరికి అక్కడ్నుంచి తప్పించుకొని ఒక పల్లెకు చేరుకుంటాడు. గతం మరచిపోయిన అశోక్ 'రాణి' అనే పల్లెపడుచును ఒక ప్రమాదంనుంచి రక్షిస్తాడు. దాంతో ఆమె హృదయంలో చోటు చేసుకుంటాడు. తన ప్రేమానురాగలను అతనికి అర్పించి పెళ్ళి చేసుకుంటుంది రాణి. మగబిడ్డకూడా కలుగుతాడు.

పూర్వస్మృతి కోల్పోయిన అశోక్‌కి అరుణ గుర్తురాలేదు. ఏనాటికయినా తిరిగి వస్తాడనే ఆశతో నిరీక్షిస్తోంది. పల్లెలో రాజాగా వ్యవహరింపబడుతున్న అశోక్—మరపంపు పొలంలో వెయ్యటానికి డబ్బుకోసం పట్నం వస్తాడు. డబ్బు తీసుకుని పల్లెకు తిరిగి వస్తూండగా దుండగులు అతన్ని కర్రలతోకొట్టి డబ్బు పట్టుకుపోతారు. ఆ ప్రమాదంలో పల్లెలో గడిపిన జీవితమంతా మరచిపోతాడు. దాంతో రాణి జీవితం దుర్భరంగా పరిణమిస్తుంది.

ఒక అబ్బాయితో ఇద్దరమ్మాయిలు పెంచుకన్న ప్రేమానురాగాలు ఏ పరిస్థితుల్లో జరిగినా వాటికిగల అనుబంధం చాలా గట్టిదనీ, పవిత్రమైనదనీ — అందుకే ఇది 'పవిత్ర బంధం' అయిందనీ ఈ చిత్రకథ చెబుతుంది.

అశోక్‌గా నాగేశ్వరరావు, అరుణగా కాంచన, రాణిగా వాణిశ్రీ, ఆమె తల్లిగా జి. వరలక్ష్మి. అరుణ తండ్రిగా నాగయ్య, శేఖర్‌గా కృష్ణంరాజు, బాబుగా బేబీ డాలీ నటించారు. పద్మనాభం, గీతాంజలి, బాలకృష్ణ హాస్యపాత్రలను పోషించారు.

ఆరుద్ర రచన, రాజేశ్వరరావు సంగీతం, కె. యస్. రామకృష్ణారావు ఛాయాగ్రహణం నిర్వహించిన యీ చిత్రానికి వి. మధుసూదనరావు దర్శకుడు, గోవింద రాజన్ నిర్మాత, టి. వి. యస్ శాస్త్రి సహనిర్మాతగా ఉన్న యీ చిత్రం ఆంధ్రప్రదేశ్ అంతటా నవయుగ ఫిలింస్ ద్వారా ఫిబ్రవరి 25న విడుదల అయింది.

— మోహన్‌కుమార్



'రైతుబిడ్డ'లో రామారావు కాని వేషంమాత్రం రాజబిడ్డది

ప్రేమించింది ఒకరిని పెండ్లిచేసుకుంది మరొకరిని

వాసంతి, విజయ ప్రాణస్నేహితులు విజయ ప్రేమించిన ఆనంద్ వాసంతిని పెండ్లి చేసుకుంటాడు. రిసెప్షన్ జరుగుతుంటుంది. తన స్నేహితురాలికి శుభాకాంక్షలు అందచెయ్యడానికి విజయువస్తుంది. వాసంతి తనభర్తను విజయకు పరిచయం చేస్తుంది. అతగాడ్ని చూడగానే విజయ స్తంభించి పోయింది. వేయిగొడ్డళ్ళు పెట్టి కొట్టినట్టు ఫీలయింది విజయ కానీ తన మనోవ్యథను పైకి కనపడనీకుండా చెయ్యగల్గింది. ఇక అక్కడ వుండలేక పోయింది. వెళ్లబోతుంటే, ఒకపాట పాడవేలని వాసంతి అడగడంతో కాదనలేక పోయింది. పియానో వాసంతి కదిలించగా, విజయ యిలా పాడ సాగింది.


'ఎందరికో జీవితము
గులాబితోట

సినిమా

మరికొందరి కాజీవితము
ఎడారిబాట'

అని విజయ పాడుతూవుంటే, ఆమె కళ్లంట నీళ్లు తిరిగాయి' 'ఏమిటే అలా వున్నావు? 'అని వాసంతి ప్రశ్నించింది.

'అవ్వే యేంలేదులే అంటూ' అందరికీ అందనుగా ఆనందం— అది అందుకున్న జీవితమేనవ వసంతం' అంటూ ఎలుగెత్తి పాడింది. 'కట్' అన్నారు దర్శకుడు బి. ఎస్. నారాయణ ఈ సన్నివేశం గోల్డెన్ పిక్చర్స్‌వారి 'అత్తను దిద్దిన కోడలు' చిత్రానికిగాను వాహినీ మూడవ ఫ్లోర్‌లో చిత్రీకరించబడింది. వాసంతిగా జమున, ఆనంద్‌గా హరనాథ్ విజయగా రాజశ్రీ నటించారు. విప్లవకవి శ్రీశ్రీ వ్రాసిన పైపాటను, మాష్టరువేణు సారథ్యంలో జానకి భావావేశంతో పాడింది. ఎమ్. లక్ష్మణ్ వ్రాసిన కథకు బి. ఎస్. నారాయణ స్క్రీన్‌ప్లే తయారుచేశారు. పోతిన శ్రీరాములు, పి. వి. స్వామి, జి. కృష్ణమూర్తి




'అత్తలూ..కోడళ్ళు'లో కృష్ణ వాణిశ్రీకి దేన్ని గురించి నచ్చచెప్తున్నట్లు!


నిర్మిస్తున్న ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను జమున, హరనాధ్, రాజశ్రీ, గుమ్మడి ఎస్. వరలక్ష్మి, రాజనాల, రాజబాబు, గీతాంజలి పోషిస్తున్నారు. ఉపనాయక పాత్రను కె.ఎస్. రామారావు (న్యూకమెండ్) ధరిస్తున్నారు.

జమునలో సరికొత్త అందం

నటి జమున పియానో వాయించడంలో దిట్టలని తెలుసుకోగలిగాను. ఎలాగని అడిగేరేం? ఆమె 'పూజాఫలం' చిత్రంలోని 'జగమే పూయని' పాటను అద్భుతంగా



'అమాయకురాలు'లో ఎవరు ఏమిటి వద్దంటున్నట్లు?
నాగేశ్వరరావా? కాంచనా?



అప్పుడే షష్టిపూర్తా? 'వింత సంసారం'లో జగ్గయ్యా, సావిత్రి

ప్లేచెయ్యడంవల్లనే, ఆమెకు పియానో వాయించడం చేతఅప్పనని చెప్పగలుగుతున్నాను. ఆమెలో సరికొత్త అందాన్ని చూడగలిగాను. వుండబట్టలేక అనేసాను "మీరు 'ఇల్లరికం' జమున'లా వున్నారని." నా ప్రక్కన కూర్చునివున్న హరనాథ్ 'కాదు కాదు మీరు 'పుట్టిల్లు' జమునను గుర్తుకు తెస్తున్నారు' అని కాంప్లిమెంట్ చేస్తూ 'సాయంత్రం యింటికి వెళ్లగానే దిష్టితీయించండి' అని సలహా కూడా

సినిమా

యిచ్చారు. దిష్టిపై జమున ఒక దృష్టాంతాన్ని చెప్పారు. 'మూగమనసులు' షూటింగు గోదావరితీరాన జరిగినప్పుడు నీళ్లల్లో కాలు పెట్టి తమాషాగా ఆడుకునేదట. హీరో నాగేశ్వరరావు 'నీకాళ్లు చాలా అందంగా వున్నాయి జమున' అని తరచూ అనేవారట. ఒక రోజు తను బసచేసిన మేడమీదనుండి క్రిందికిదిగి వస్తుంటే, గోడకు బాదుకున్నదట. కాలిగోరు పగిలి రక్తం కారిందట. అందువల్ల దిష్టిపై నాకు నమ్మకం వుంది అన్నారు, జమున. వయస్సు పెరిగే కొద్దీ, వర్చస్సు రెండింతలు పెరుగుతున్నట్టు అనిపించింది జమునను చూచినప్పుడు.

వాణిశ్రీ వీణపాట

వాహినీ మూడవఫ్లోర్‌ను వదిలి, ఎనిమిదిలోకి ప్రవేశించాను, సెట్టును చూడగానే మతిపోయింది. పెద్ద జమీందారులకు కూడా వుండదనుకుంటూ, అంత నయనానందకరంగా కనిపించింది నేనుచూచిన భవంతి. హాలుమధ్యన నటరాజ విగ్రహం అమర్చబడింది. ఆ విగ్రహం ముందు వాణిశ్రీ వీణాపాణియై కూర్చుని మృదు మధురంగా పాడుతూ వుండింది. ఆమె వీణమీటుతూ వుంటే, నిజంగా ఆమెకు వీణవాయించడం వచ్చేమో అనేది భావాన్ని కలిగించింది. ఆమెపాడిన పాటను హీరో నాగేశ్వరరావు విన్నారు. 'సెభాష్' అన్నారు. ఆయనకు నచ్చిన ఆపాటను మీరూ తెలుసుకోండి.

'ఎవరో రావాలి
నీ హృదయం కదిలించాలి
నీ తీగెలు సవరించాలి
నీలోరాగం పలికించాలి'

అనేడి ఈ భావగర్భితమయిన పాటను ఆచార్య ఆత్రేయ 'ప్రేమనగర్' కలర్ చిత్రానికిగాను వ్రాసారు. మహదేవన్ ట్యూనింగ్‌లో సుశీల థ్రిల్లింగ్ ఎఫెక్టు నిచ్చింది. పై సన్నివేశాన్ని వెంకటరత్నం ఛాయాగ్రహణ సహాయంతో దర్శకుడు కె. ఎస్. ప్రకాశరావు హృద్యంగమంగా చిత్రీకరించారు.

కృషి, ఆశయం ఫలిస్తుంది

షూటింగుకు 'లంచ్‌బ్రేక్' చెప్పారు డైరెక్టరుగారు 'సిక్సరు ఎంతవరకు వచ్చిందండీ; మొదటి షెడ్యూలు రష్‌చూసారా'? అని నిర్మాత రామానాయుడుగార్ని అడిగాను. మూడురీళ్లు వచ్చింది. రష్ బ్రహ్మాండగా వచ్చింది' 'ప్రేమనగర్' చిత్రానికి నాయుడుగారు తీసుకుంటున్న శ్రమవృధా పోదు. ఆయన ఆశయం కృషి సఫలీకృతం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. చక్కటికథ, దానికితగ్గ సంభాషణలు వున్నాయి. వెంకటరత్నం ఛాయ, మహదేవన్ సంగీతం యెలా

సినిమా డైరీ

● గోల్డెన్ పిక్చర్స్ 'అత్తను దిద్దినకోడలు' షూటింగు ఫిబ్రవరి 21 నుండి 25 వరకు వాహినీ 3 వ ఫ్లోర్‌లో జరిగింది. బి. ఎస్. నారాయణ దర్శకత్వంలో జమున, రాజశ్రీ, హరనాధ్, రాజనాల, ఎస్. వరలక్ష్మి నటించారు.

● సురేష్ మూవీస్ 'ప్రేమనగర్' కలర్ చిత్రం షూటింగు ఫిబ్రవరి 19 నుండి 28 వరకు వాహినీలోని వివిధ సెట్లలో జరిగింది. కె. ఎస్. ప్రకాశరావు దర్శకత్వంలో నాగేశ్వరరావు, వాణిశ్రీ పాల్గొన్నారు.

● భానూ మూవీస్‌వారి 'మాతృప్రేమ' రికార్డింగు ఫిబ్రవరి 22 వ గార్డెన్స్‌లో జరిగింది. 23న గార్డెన్స్‌లో జరిగిన అవుట్‌డోర్ షూటింగ్‌లో శోభన్‌బాబు, చంద్రకళ పాల్గొన్నారు. దర్శకుడు మాధవరావు.

● శ్రీ విజయవెంకటేశ్వర పిక్చర్స్ యొక్క షూటింగు ఫిబ్రవరి 20న విజయా స్టుడియోలో ప్రారంభమైంది. ఎన్. టి. రామారావు, గుమ్మడి, సావిత్రి, చంద్రకళ నటించిన సన్నివేశాలను ఏ. సి. త్రిలోకచందర్ చిత్రీకరించారు.

● సంజీవనీ ఫిలిమ్స్ 'ప్రేమజీవులు' మార్చి 5 న పూర్ణా ద్వారా విడుదలవుతుంది. కె. ఎస్. ఆర్. దాసు దర్శకుడు.

● రాజ్యం ప్రొడక్షన్స్ 'రంగేళీరాజా' మార్చి 11న రాజశ్రీ పిక్చర్స్ ద్వారా విడుదలవుతుంది. దర్శకుడు సి. ఎస్. రావ్.

వుంటాయో మీకు బాగా తెలుసు. అనుభవజ్ఞుడయిన కె. ఎస్. ప్రకాశరావు 'ప్రేమనగర్'ను 'ప్రేక్షకుల మనోనగర్' చెయ్యడానికి తన అనుభవ సారాన్నంతా వుపయోగిస్తున్నారు. నాగేశ్వరరావు, వాణిశ్రీ, గుమ్మడి, శాంతకుమారి, హేమలత విశ్వేరలక్ష్మి, రాజబాబు, సత్యనారాయణ, రమాప్రభలాంటి ప్రముఖ తారాగణంవున్న 'ప్రేమనగర్' తెలుగుచిత్ర లోకంలో సరికొత్త సంచలనాన్ని సృష్టించి తీరుతుందని ఆశించవచ్చు.

మత్తుగొలిపే మధురమైన పాట

షూటింగు కార్యక్రమం కాగానే జెమినీలో విజయలక్ష్మీ మూవీస్ యొక్క పాట రికార్డింగ్ విందామని అక్కడికి

సినిమా

వెళ్లాము. సంగీత దర్శకుడు రమేష్‌నాయుడు ఆర్కెస్ట్రాకు ఫైనల్ టచ్చస్ చెప్పి, బాలసుబ్రహ్మణ్యం— సుశీలకు రెడీఫర్ టేక్' అని ఆర్డరు పురమాయించారు.

ఆర్కెస్ట్రా తన కార్యక్రమాన్ని ప్రారంభించింది. సుశీల, బాలసుబ్రహ్మణ్యం తమ కర్తవ్యాన్ని నెరవేర్చారు. పాటలో మాటు, పోటు వున్నాయి. గాయకుల కంఠంలో మెలడీ + ఎక్స్‌ప్రెషన్ చక్కగా వచ్చాయి.

బాలు : 'ఎవరైనా చూశారా
ఏమను కుంటారు,'

సుశీల : కొత్త మురిపెం పొద్దెరుగదని
చెప్పుకుంటారు—ఆపై తప్పు
కుంటారు.' యిదీ పాట.

ఈ పాటను నారాయణరెడ్డి వ్రాసారు. చిత్రంలో శోభన్, వాణిశ్రీలపై చిత్రీకరిస్తామని దర్శకుడు వి. రామచంద్రరావు చెప్పారు. షూటింగు మార్చి 1 నుండి ప్రారంభిస్తున్నట్టు నిర్మాత జి. వి. ఎస్. రాజు చెప్పారు. భమిడిపాటి కథ, మాటలను వ్రాసిన యీ చిత్రానికి కన్నప్ప ఛాయను, వాలి శిల్పాన్ని నిర్వహిస్తారు. ముఖ్య భూమికలను శోభన్, సావిత్రి, వాణిశ్రీ, లీలారాణి, నాగభూషణం, రాజబాబు, అల్లు రామలింగయ్య, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి ధరించనున్న యీ చిత్రం అనిల్‌ప్రభాన్‌ద్వారా విడుదలవుతుంది.

ఓపిక యిచ్చిన కానుక

నిర్మాత జి. వి. ఎస్. రాజా యెలా యింతటివాడయ్యారో తెలుసా? చిత్తూరు వి. నాగయ్య దగ్గర ఆఫీసుబాయ్‌గా చేరి, పది సంవత్సరాలు కష్టనష్టాలను వోర్చి, పేస్టుఫిలిం వ్యాపారం ప్రారంభించి పరిశ్రమలోని పెద్దలసహాయ సహకారాలు పొందుకుని, '...జన్మ' చిత్రం నిర్మించి అఖండమైన లాభాలను గడించినట్టు వివరిస్తూ అనాడు నాగయ్యగారు నీడ యిచ్చబట్టే నేడు తాను సంపన్నుడనయినానని చెపుతుంటే, ఆయన కళ్లంట ఆనంద బాష్పాలు రాలాయి. 'న్యాయం, ధర్మం, సత్యంవున్న ప్రతిమనిషికి మంచి రానే వస్తుంది'



'బంగారుతల్లి'లో ఒక దృశ్యం

* * *

జెమినీలో పాటవిన్న తర్వాత, వీనస్ స్టుడియోకి వెళ్ళాను. ఫస్టుఫ్లోర్‌లో 'విచిత్ర దాంపత్యం' షూటింగు వుందని తెలిసి, సెట్లోకి వెళ్లాము. అదొక చిన్న యిల్లు. వరండాలో రాజబాబు, మీనాకుమారి విజయనిర్మల కూర్చునివున్నారు. ఏమిటబ్బా ముగ్గురూ సయిలెంట్‌గా వున్నారే అని అనుకున్నానోలేదో రాజబాబు గొంతు వినిపించింది.

రాజబాబు : నువ్వేమయినా చెప్పు; ఆ విజయను అంత తేలిగా నమ్మటానికి వీల్లేదు (విజయనిర్మలకు హితబోధ చేస్తాడు)

విజయనిర్మల : అలా అనకు- విజయ నేనూ చిన్నప్పట్నుంచి ఒక తల్లిబిడ్డల్లా పెరిగిన' వాళ్ళం. విజయకు నేనంటే ప్రాణం.



'విచిత్ర దాంపత్యం'లో ఒక సన్నివేశంలో శోభన్‌బాబు, విజయనిర్మల

మీనాకుమారి : నువ్వు అమాయకు రాలివి. ఆమె షోకు, కులుకు చూస్తే ఎంత వాళ్లనైనా సంతలో వేలం వేయించ గలదనిపిస్తుంది.

విజయ్ఛనిర్మల : ఛా; విజయ అలాంటి దంటే నేను నమ్మలేను. అని లేచి లోపలికి పోతుంది. రాజబాబు, మీనాకుమారి సీరి యస్‌గా ఆలోచించారు.

మీనాకుమారి : వాళ్ళ గుట్టుమట్టు ఆరా తీయండి. లేకపోతే అసలుకే మోసం జరుగు తుంది.

రాజబాబు : అవులిస్తే పేగులు లెక్కెట్టే వాణ్ణి. నాకు వాళ్ల ఆయువు కనిపెట్టడం లెక్కా, జమా, !వస్తా—నంటూ స్పీడుగా వెళ్తాడు వీధిలోనికి. 'కట్' అన్నారు దర్శకుడు పి. చంద్రశేఖరరెడ్డి. విజయపై రాజబాబుకు అనుమానం యెందుకొచ్చింది ? అతగాడి అనుమానం నిజమేనా ? అనెడి ప్రశ్నలకు చిన్నపరెడ్డి నిర్మిస్తున్న 'విచిత్రదాంపత్యం' సమాధానం యిస్తుంది. ఈ చిత్రంలో శోభన్‌బాబు, గుమ్మడి, రాజబాబు, ప్రభాకరరెడ్డి, సావిత్రి, విజయనిర్మల, విజయలలిత, మీనాకుమారి, పద్మిని, రోజారమణి ధరిస్తున్న పాత్రలు విచిత్రంగా ప్రారంభమై, వింత పరిణామలకు దారితీస్తూ, విచిత్రంగా పరిసమాప్త మవుతుంది. ఈ చిత్రంలో సుకదేవ్ ఛాయ ప్రత్యేక ప్రశంసల నందుకుంటుందనటంలో అతిశయోక్తి కాదు.

పుస్తకంలో ప్రేయసిఫొటో

వీనస్ స్టుడియోలోని మరోఫ్లోర్‌లోకి వెళ్లాను. ఒక చిన్నరూము. ఒకటేబిలుమీద పుస్తకాలు వున్నాయి. కుర్చీలో హరనాథ్ కూర్చుని, యేదో పుస్తకాన్ని తిరిగేస్తూ వున్నాడు. కానీ పుస్తకం తలక్రిందుగా పెట్టి చదువుతుండడంవల్ల, అతని దృష్టి మరోదానిపై వున్నట్టు తెలిసిపోయింది. చంద్రమోహన్ రూములోకి వస్తాడు. హరనాథ్ చేతిలోని పుస్తకాన్ని సరిగా పెడతాడు.

చంద్రమోహన్ : ఇలా సమంగాపెట్టి శ్రద్ధగా చదువుకో,—అని పుస్తకాన్ని సరిగా పెడుతున్న సమయంలో పుస్తకంలో పదిలంగా వుంచబడిన సరోజాదేవి ఫోటో కనిపిస్తుంది. 'అన్నయ్యా, అన్యాయం, వదిన గారిచేత శీర్షాసనం వేయిస్తున్నావా?' (హరనాథ్ తెల్లబోతాడు.)

హరనాథ్ : ఏవిరా నీకు తెలిసింది ?

చంద్ర : అదే ఆ పుస్తకంలో వున్నదే, ఆ చిన్నది నీతో చదువుతున్నది — ఆమెను కన్నది జడ్జి శ్రీనివాసరావుగారు. పేరు సరోజ—కరెక్టా ?

హరనాథ్ : ఒరే అరవకురా. యివన్నీ నీకెలా తెలుసురా. సరేగానీ అమ్మతో చెప్పావా?

చంద్రమోహన్ : అన్నాల దగ్గర ముహూర్తం పెట్టాం. అక్కడ చెప్పేస్తాం.

హరనాథ్ : ఒరేయ్ తమ్ముడూ; నీకు పుణ్యముంటుంది. అమ్మతో చెప్పకురా—అని దీనంగా ముఖం పెడతాడు. 'కట్' అన్నారు దర్శకుడు మానాపురం.

ఈ చిలిపి సన్నివేశం విశ్వజ్యోతి పిక్చర్‌వారి మొదటిచిత్రంలో కనిపిస్తుంది. రాజేంద్ర కుమార్ అండ్ సత్యనారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాజశ్రీ రచనను, పెండ్యాల సంగీతాన్ని, స్వామి ఛాయను, కుమార్ శిల్పాన్ని నిర్వహిస్తున్నారు. సావిత్రి తల్లిగా హరనాధ్ చంద్రమోహన్లు ఆమె కుమారులుగా నటిస్తున్న ఈ చిత్రానికి గుహనాథన్ కథకుడు. మొదటి షెడ్యూలులో ఏడురీళ్లు తయారైంది. !

రాజనాల-నాటకాలు

ప్రముఖ విలన్‌నటుడు రాజనాలను విద్యోదయా కాలనీలోని ఆయన యింట్లో కలిసాను. నేను వెళ్లినప్పుడు, ఆయన మేకప్‌తో వున్నారు. షూటింగా అని అడిగాను. కాదు: డ్రామారిహార్సలు అన్నారు. రిహార్సలుకు మేకప్ అవసరమా? అన్న నా ప్రశ్నకు ఆయన నవ్వి 'అప్పుడయితేనే గాని పర్‌ఫెక్షన్‌రాదు' అన్నారు రాయబారమేగా? అన్నాను. 'కాదు. కాదు. పద్మశ్రీ నాటకంకోసం' అన్నారు ఆయన. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 'పద్మశ్రీ' నాటకానికి డిమాండ్ విపరీతంగా పెరిగినట్టు చెపుతూ, నెలకు పది కేంద్రాలలో నాటక ప్రదర్శనలు యివ్వనున్నట్టు చెప్పారు.

—శ్రీనివాస్ ●

నటి జయలలిత పుట్టినరోజు పండగ



గ్లామర్ క్వీన్ ఆఫ్ ది సౌత్ మిస్. జయలలిత దగ్గర్నుండి సడన్‌గా ఒక ఆహ్వానం వచ్చింది. ఫిబ్రవరి 24న సవేరాలో 'టీ'కి రమ్మని ఆహ్వాన పత్రికలో వ్రాసి వుండింది.

ఫిబ్రవరి 24న సాయంకాలం ఆరు గంటలకు సవేరాకు వెళ్లాను. అన్ని భాషల పత్రికేయులను చూచాను. జయలలిత పసుపు రంగు జార్జెట్ చీరె + అదే రంగు బ్లౌజు ధరించి రతీదేవిలా కనిపించింది.

'నాకు యివాళ పుట్టినరోజు. అందుకే మీ అందరినీ పిలిచాను. మీతో మనస్సు విప్పి మాటాడుదామని యీ టీపార్టీని ఏర్పాటు చేసాను. నాకు పత్రికేయులు యిస్తున్న ప్రోత్సాహం, ఆదరం వల్ల నేను వున్నతస్థితి నందుకున్నాను. ఈ సందర్భంలో మీకేదయినా సందేహాలుంటే అడగొచ్చు' అని చక్కటి ఇంగ్లీషులో జయలలిత మాట్లాడింది.

'మీకూ, మరొక ప్రముఖ నటుడికి ఘర్షణ జరిగినట్టు విన్నాము. నిజమేనా?' అని ఒక విలేఖరి ప్రశ్నించాడు.

జయలలిత : అలాంటి విభేదాలు యెప్పుడూ యేర్పడలేదు. యేర్పడవు కూడా.

మరొక జర్నలిస్టు 'మీరు హిందీ చిత్రాల్లో యెందుకు నటించడం లేదు?' అని ప్రశ్నించారు. 'సరయినపాత్ర, పేరు తెచ్చిపెట్టే పాత్రవస్తే తప్పక నటిస్తాను,' అంది జయలలిత.

నేనూ రెండు ప్రశ్నలు వేసాను. 'మీకు తెలుగు రంగంలో మంచిపేరు వుండికూడా, మీరు ఎక్కువ తెలుగు చిత్రాల్లో నటించకపోవడానికి గల కారణం?' 'ప్రత్యేకకారణం లేదు. ఇప్పుడు మూడు తెలుగు చిత్రాల్లో నటిస్తున్నాను.' మీరు కడుతున్న యిల్లు పూర్తయిందా? అన్నాను. 'మీకు తెలియకుండా గృహప్రవేశం జరుగుతుందా' అని జవాబిచ్చింది.

'మీకు చిత్రనిర్మాణంపై అభిలాష లేదా' అనెడి ప్రశ్నకు సమాధానమిస్తూ 'ఇప్పటికి లేదు మున్ముందు అయిడియా కలగవచ్చు' అంది.

* * *

'ఎలెక్షన్‌లో మీ వోటు ఎవరికి?' అడిగాను 'అదీ ప్రశ్న. వోటు వుంటేగా వెయ్యడానికి' జయలలిత ప్రక్కనవున్న వాళ్ల అమ్మగారు సంధ్య అందుకుని '1967 ఎలెక్షన్‌లో జయలలితకు వోటువేసే వయస్సు లేదు' 1971 లో వోటర్ల లిస్టులో పేరులేదు, అని చెప్పినప్పుడు 'గొల్లు'మని నవ్వారు పత్రికేయులు.

* * *

జయలలిత ఈ రంగాన్ని ప్రవేశించి ఏడు సంవత్సరాలే అయినా, ఏడుపదుల చిత్రాల్లో నటించింది, ఇది నిజంగా రికార్డే ! ఇంత చిన్న వయస్సులో, ఎంతో మంచిపేరు తెచ్చుకుంది. విద్య, సంస్కారం, అందం, నటనాకౌశలం సమపాళ్లల్లో రంగరించుకున్న జయలలితకు వుజ్వల భవిష్యత్తు వుంది.

—టి. ఆర్. ఎస్. ●

కళ్యాణమందిర్
ధర్మచక్రం

ఒక్కొక్కటీ 290 పేజీలు. ఆరేసి రూపాయలు.

రచన: శ్రీమతి అరికెపూడి కౌసల్యాదేవి. ప్రతులకు: నవభారత్ బుక్ హవుస్, ఏలూరు రోడ్డు విజయవాడ—2.

ఇవి రెండూ లోగడ రెండు పత్రికలలో సీరియల్స్‌గా వచ్చి, పాఠకుల హృదయాల్ని చూరగొన్నవే. వీటిలో ఒకటి ట్రాజెడీ, రెండోది కామెడీ. మొదటిది సంసార పక్షంగా నడిస్తే, రెండోది దేశానికంతటికీ సంబంధించింది. కనుక రెండూ విడి విడిగానే పరిశీలించాలి.

కల్యాణి పుట్టింది పేద యింట. అయినా, ప్రకాశ్‌తో మదరాసులో అడుగు పెట్టగానే తనను తానే మరిచి పోయింది. కాలు కదిపితే కారు, ఏ పని చేయాలన్నా నవుకర్లు, విలువైన నగలు, దుస్తులు మఖమల్ పరుపులు—ఈవైభవాలమధ్య తన వాళ్లనీ, తన గత జీవితాన్నీ మరచింది, కల్యాణి.

అయితే— ఆ ఆనందం ఎంతకాలం?—

ప్రకాశ్ వల్ల తను తల్లి కాబోతూంది. కాని, అతనింకా ఆమెను పెళ్లాడలేదు. మైత్రేయిని పెళ్ళి చేసుకున్నాడు. అంటే —కల్యాణికీ ప్రకాశ్‌కీ గల సంబంధ మేమిటి?

కల్యాణి, మైత్రేయీ స్నేహితురాళ్లు. ప్రకాశ్ మైత్రేయిల పెళ్లి పెద్దల నిశ్చయం. అదలా వుండగా ప్రకాశ్ మైత్రేయికి బావ. ఆమె హృదయంలో అతడు ఎప్పుడో చోటు చేసుకున్నాడు.

మైత్రేయి ప్రకాశ్‌ని త్యాగం చేస్తుందా? కల్యాణికి ద్రోహం చేస్తుందా?

కాలం గడిచింది. కథ ముందుకి నడిచింది. పెళ్లి కాకుండానే కల్యాణికి ఆడపిల్ల. పెళ్ళి అయినా, మైత్రేయి కింక పిల్లలు పుట్టరు.

ప్రకాశ్‌కి మోజు తగ్గింది. కల్యాణిని కంట గించుకున్నాడు. మైత్రేయి పైన జాలిపడ్డాడు.

ఈ ముగ్గురు ప్రేమైక జీవి చిన్నారి కల్యాణి.

అమరజీవి కల్యాణి స్మారక చిహ్నమే కల్యాణ మందిర్.

* * *

కౌరవు లెవరు? పాండవు లెవరు? అన్నాదమ్ముల బిడ్డలు. వారి మధ్యనే యుద్ధం. తాతా మనమలు, తండ్రీ కొడుకులు ఇటువంటి ఆత్మీయుల మధ్యనే యుద్ధం. ఇది సహించ లేకనే అర్జునుడు కర్తవ్యతా మూఢుడై విలపించాడు.

—సరిగ్గా ఇటువంటి సమస్యనే ఎదుర్కోవలె వచ్చింది సత్య— పబ్లిక్ ప్రాసెక్యూటర్ సత్య— ప్రియుడయిన ధర్మారావుకి ఎదురు పక్షంగా తండ్రి తరపున వాదించ వలసిన సత్య.

ధర్మారావు తరపున వాదించినతడు అర్జును. ధర్మారావు నేరం— దేశద్రోహం. దేశద్రోహులుగా అనుమానింప బడుతున్న రాజలక్ష్మి గౌతమ్‌లకు అతను బిడ్డ కావటం.

తగిన రుజువులతో అసలు ద్రోహుల గుట్టు మట్లు బయట పెట్టాడు, అర్జును. సత్య వోడిపోయింది. ఆమెను తీసుకుని ఆమెతండ్రి [illegible] పారిపోయాడు.

కాస్సేపు స్టంట్— హెలి కాప్టరు మీద హీరో వాళ్లా ఫాలో— ముట్టడి— విలన్ దుర్యోధన్ హెలికాప్టర్‌లో పారిపోతూవుంటే హీరోఫాలో— సముద్రం మధ్య —ఢాం ఢాం—హీరో విజయం విలన్ అంతిమ సందేశం —

సత్య, ధర్మారావు ఒకటవుతారు. దేశభక్తులకు సన్మానం.

ధర్మ నిష్ఠ, దేశభక్తి ఈ నవల ప్రతిపేజీలోనూ పొంగి పొరలు తున్నాయి. అయితే —చివరిభాగం,

ఎన్నికల ప్రచారం!

తమిళనాడులో ఎన్నికల సంరంభం చాలా ముమ్మరంగా సాగుతున్నది. ప్రముఖ నటులు శివాజీ గణేశన్, ఎం. జి. ఆర్. లు తమిళనాడులోని ముఖ్య పట్టణాలలోను, గ్రామీణప్రాంతాల్లోను జరిగే బహిరంగ సభల్లో ప్రచారాలు చేస్తున్నారు.

శివాజీ గనేశన్ సంస్థాకాంగ్రెస్‌తరపున ఎం. జి. ఆర్. డి. ఎం. కె. తరపున యీ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

కిందటినెల 23 న— తమిళనాడు అంతటా ఎన్నికల ప్రచారం ముగించుకొని మద్రాసుకు తిరిగివచ్చిన శ్రీ శివాజీ గనేశన్‌కి బ్రహ్మాండమైన ఉరేగింపు జరిగింది. ఇదివరకు ఎం. జి. ఆర్. ఉరేగింపులో జనసందోహం ఎలా ఉండేదో ఆరోజున అలా ఉంది. ఇంత ప్రజావాహిని యీ మధ్య కాలంలో ఏ వూరేగింపు లోనూ చూడ లేదని కొందరు అంటున్నారు.

మద్రాసు నగరంలోకూడా శివాజీ, ఎం.జి ఆర్. లు వివిధ ప్రాంతాల్లో నిత్యమూ ఉపన్యాసాలు యిస్తూనే వున్నారు. ఎం. జి.ఆర్. పోటీ చేస్తున్న సెంట్‌తామస్ మవుంట్ నియోజక వర్గంలో— ఈ మధ్య ఆయన ప్రసంగిస్తూ వుండగా కరెంట్ ఫెయిల్ అయిందట! వెంటనే ఆయన కార్యకర్తల్ని కిరసనాయిలు దీపాలు తెమ్మని సభను జయప్రదంగా ముగించారుట! ప్రతిసభ జరుగబోయేముందూ కిరసనాయిలు దీపాలు రెడీగా వుంచుకుంటున్నారుట! ఏక్షణంలో కరెంటు ఫెయిలయినా ఉపయోగించటంకోసం......

కిందటి గురువారం త్యాగరాయనగర్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో శివాజీగనేశన్ మాట్లాడారు. ఈ ఎన్నికల ప్రచారఉద్యమంలో పాల్గొనేందుకు వెళ్లినప్పుడు—తనను చంపటానికి కొందరు ప్రయత్నించారని ఆయన ఆసభలో చెప్పారు.

ఆమర్నాడు శ్రీ శివాజీ ఈ పర్యటన తన కెంతో ఉత్సాహం కలిగించిందనీ ప్రజల మనస్తత్వాలను గ్రహించటం జరిగిందనీ, డెమొక్రాటిక్ ఫ్రంట్‌కి ఎక్కువసీట్లు వస్తాయనీ ఆశాభావాన్ని వెలిబుచ్చారు— ఒక ప్రెస్ స్టేట్‌మెంట్‌లో.

ఎవరు గెలుస్తారు? ఎవరు వోడిపోతారు? అనేది ఎపుడూ ఆసక్తి కలిగించే విషయమే అయినా ప్రముఖనటులు యిలా రాజకీయాల్లోకి ప్రవేశించి, అల్లరి పాలవటం మంచిది కాదని కొన్ని వర్గాలవారు వ్యాఖ్యానిస్తున్నారు,

* * *

మన ప్రసిద్ధ నటులు నాగేశ్వరరావు, రామారావు గార్ల బిడ్డల వివాహం యీ సంవత్సరం జరగబోతున్నది. ఈ ఇద్దరు పెద్దలూ ఒక ఊరిలోనే వియ్యమందుతున్నారు. ఆ ఊరు కారంచేడు. చీరాల దగ్గర వుంది.

నాగేశ్వరరావుగారి అమ్మాయిని శ్రీ డి. రామానాయుడు [సురేష్ మూవీస్]గారి బావమరిదికి యిస్తున్నారు. రామారావుగారి అబ్బాయిని ఆకుటుంబానికి చెందిన వారమ్మాయికి యిచ్చి చేస్తున్నారు.

ఈ వివాహాలు ఎప్పుడు జరుగుతాయో చూద్దామనే ఆతృత యిక్కడ అనేకమందిలో వుంది. అతిత్వరలోనే యీ వివాహాలు జరుగగలవని తెలుస్తున్నది.

భారీ యెత్తున బోలెడు ఖర్చుతో అట్టహాసంగా యీ పెళ్లిళ్లు జరుగుతాయని భావిస్తున్నారు, పరిశ్రమలోనివారు. ఇద్దరూ అగ్రశ్రేణి నటులు ఖర్చుకేమీ వెనకాడరు. కారంచేడువారు కూడా బాగా ఉన్నవారుగనుక రెండు వేపులనుంచీ యీఖర్చు కొన్ని లక్షలకు మించి ఉంటుందని అంచనాలు వేస్తున్నారు, అభిజ్ఞులు.

— మోహన్‌కుమార్

పుస్తకాలు

మొగించవ్వా కాకి సినిమా శక్కిలో తలపెటుం పాఠకులంతగా హర్షించరేమో.

—శివకుమారి

అండ్ మైల్సు టు గో...

115 పేజీలు. వెల: రూ. 7—50. ప్రతులకు: ఎకనమిక్ అండ్ సైంటిఫిక్ రిసర్చి ఫౌండేషన్, న్యూఢిల్లీ—1.

ఎకనమిక్ అండ్ సైంటిఫిక్ రిసర్చి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ మజుందార్, కుమారి దాస్‌లు రూపొందించిన 'రిసర్చి స్టడీ' యిది. మన దేశపు ఆర్థిక పరిస్థితిని యితర దేశాలతో పోల్చటం దీని లక్ష్యం. ఆవిధంగా మనం ఆ యితర దేశాలతో పోల్చి చూస్తే ఎంత వెనుకబడి ఉన్నామో తెలియజెయ్యటం, వారి ప్రస్తుత ప్రమాణాల్ని అందుకోటానికి మనకు ఎన్ని సంవత్సరాలు పడుతుందో అంచనా వెయ్యటం మొదలైన విషయాలన్నీ ఇందులో ఉన్నాయ్. ఈ వ్యత్యాసాలను తెలుసుకునేందుకు మన దేశంలోని కొన్ని వస్తువుల ఉత్పత్తి యితర దేశాలలోని (ముఖ్యంగా జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్సు, ప్రెంచ్—యివిగాక మరికొన్ని దేశాలు కూడా ఉన్నాయ్.) ఆ యా వస్తువుల ఉత్పత్తితో పోల్చటం జరిగింది. వ్యత్యాసాలను అంచనా వెయ్యడానికి తీసుకున్న వస్తువుల ఉత్పత్తి మన దేశంలో యికముందు యీ క్రింది విధంగా వృద్ధి పొందుతుందని వూహించారు: 1. ఇంతవరకూ సాధించిన రేటు ప్రకారం, 2. మొదటి దానికి రెట్టింపు రేటు ప్రకారం, 3. మరొక దేశంలో యింతకుముందు రికార్డు కాబడ్డ రేటు చాలా ప్రకారం తీసుకుని యీ మూడు కోణాల్నుంచి యితర దేశాలకూ, మనకూ వున్న వ్యత్యాసాన్ని సంవత్సరాలలో అంచనా వేశారు. ఇవిగాక మిగతా దేశాలలో 1967 లో వున్న ఉత్పత్తిని మనం 2000 సం. లో అందుకోడానికి మన ఉత్పత్తిలో కావల్సిన రేటులు కూడా యివ్వబడినవి.

పైన ఉపయోగించిన లెక్కన్నీ, పూర్తాయిం వృగా నేయుకున్నవి. అలా గాకుండా మన ప్లానింగ్ (స్టాటిక్ పెట్టర్‌గా మరో విభాగాన్ని యెన్ను కుంటే (ఉదాహరణకు ఎగుమతులు) మన జాతీయాదాయం యేవిధంగా పెరుగుతుందీ, మిగతా వస్తువుల ఉత్పత్తి యేవిధంగా పెరుగుతుందీ అన్నని అంచనా వేస్తే మరింత అర్థవంతంగా వుండేది. ఇందులోనూ ఉపాయింపు అన్న విషయం ఉన్నదిగాని యిక్కడ ఉపయోగించిన వాటికంటే తక్కువే. పైగా యిలా చేసిన వాటికి ఒక ఆధారం అంటూ ఉంటుంది.

ఈ పుస్తకంలో ప్రతి వస్తువునీ మన ఆర్థిక వ్యవస్థలోని యితర విషయాలనుంచి వేరుచేసి అంచనాలు తయారు చేశారు. ఉదాహరణకు డ్యూరబుల్ కంజూమర్ 'గుడ్స్' (టి. వి. రేడియో మొదలైనవి)— వీటి వుత్పత్తిని మిగతా దేశాల వుత్పత్తితో పోల్చటం జరిగింది. ఆవిధంగా గాకుండా జాతీయాదాయంతో ప్రత్యక్షంగానో పరోక్షంగానో వీటిని ముడిపెట్టి, అందులోని అభివృద్ధి రెట్టితో పోలిస్తే బాగుండేది. ఎఫెక్టివ్ డిమాండు మీద కదా వీటి ఉత్పత్తి ఆధారపడి వుండేది, మొత్తం ప్రణాళికా విధానానికి, వీటి ఉత్పత్తికీ ముడి పెట్టటం అందుకే అవసరం.

ఈ పుస్తకంలో చాలా విషయాలమీద అంకెలతో సహా చాలా వివరాలున్నాయ్. ఇండియన్ ఎకనమిక్సు లో ఆసక్తివున్న ప్రతి వ్యక్తికీ చాలా ఉపయోగంగా ఉంటుంది. విద్యాలయాలలోని లైబ్రరీలలో తప్పకుండా ఉండవల్సిన పుస్తకం.

- లేళ్లపల్లి

శ్రీ కాళహస్తి మహాత్మ్యము

ధూర్జటి. పాకెట్ సైజు. పుటలు 168. వెల: రెండు రూపాయలు. ప్రతులకు: యమ్. శేషాచలం అండ్ కో. మచిలీపట్నం, మద్రాసు, సికంద్రాబాదు.

శ్రీ కాళహస్తి మాహాత్మ్యం చాలాకాలంనించి శ్రీ కాళహస్తీశ్వర మాహాత్మ్యమని పేరు పొందింది. అదీగాక ఈ కావ్య పీఠికలో శివుడు ధూర్జటిని ఏ శివభక్తి కావ్యసరణిం గడు ధన్యతబొంద, నవ్యభాషా శబ్దాలి గుంభన రసస్థితి నొప్పందజెప్పుమీ! అని శివభక్తిని గురించే కావ్యం రచించవలసిందని ఆదేశిస్తాడు. అంతేగాని కాళహస్తి మాహాత్మ్యాన్ని గురించి కావ్యం రచించమనలేదు. అదీగాక శ్రీ కాళహస్తీశ్వర మాహాత్మ్యంలో శ్రీ కాళహస్తి మాహాత్మ్యము, ఈశ్వర మాహాత్మ్యము రెండు కూడా ఉన్నాయి. అయినా శ్రీ కాళహస్తి మాహాత్మ్యమన్న పేరు కొన్ని ప్రాచీన ప్రతులలో కానవస్తున్నది. కనక ఇది ఇంకా లోతుగా పరిశోధించవలసిన విషయమని నా కనిపిస్తున్నది.

పోనీ, అనుకుంటే శ్రీ విశ్వనాథ తమ పీఠికలో కథ మాత్రమే ఎక్కువగా విస్తరించి వ్రాశారుగాని మరే విషయాన్ని గురించి ప్రస్తావించలేదు. వారి పీఠికలో ఇంకా ధూర్జటి కవితలో అతులిత మాధురీ మహిమను గురించి ప్రస్తావించి ఉంటే బాగుండేది.

ముచ్చటయిన ముఖ చిత్రాలతో, ముద్రణలతో అందరికి అందుబాటయిన వెలతో, ఆధునిక సాహిత్యమేకాక, సంప్రదాయ సాహితి కూడా తెలుగు పాఠకుల కందిస్తూ, వారిలో సాంప్రదాయికత మీద ఆసక్తి పెంపొందిస్తున్న ఎమ్. శేషాచలంవారు అభినందనీయులు.

—శాస్త్రి



హైదరాబాదులో నవ్య నాటక సమితివారిచే నిర్వహింపబడిన అఖిలభారత కర్ణాటక సంగీతం గాత్ర పోటీలో ప్రథమ బహుమతి నందుకున్న శ్రీ తంపెళ్ల రామసూర్య మహాదేవరావు.

ఆయనగారు

(3 వ పేజీ తరువాయి)

ఆడదంటే నా కసహ్యం అంటూ కేకలు వేస్తే అత్తయ్య నవ్వేసి ఊరుకుంటుంది. ఎందుకో తెలుసా? ఆ 'అరవడం నన్ను కాదు నావెనక కనబడని అతని తల్లిగారిని!' అంటుంది. 'అరిచి ఏడిస్తే అమ్మ వస్తుందని' గ్రహించిన కుర్ర నాగమ్మ అబ్బాయిగారైన ఆడికి భర్త అయితే—తనకి ఇష్టమైనట్లు ప్రవర్తించకపోతే ముఖం ముడుచుకుని, కోపం తెచ్చుకుని—చిన్న పిల్లాడిలాగే ప్రవర్తిస్తాడు! అందొక సాటి డాక్టర్ని పెళ్లి చేసుకున్న వో డాక్టరమ్మ. ఇంకొక దారి లేదు పిట్టితల్లి, తమ భర్తగారినికూడా వివాహపు తొలి సంవత్సరాలలో కుర్ర నాగమ్మని పెంచినట్లు పెంచితేగాని వో దారికి రారు!

నిజంగావే తన సుపుత్రుణ్ని అమ్మ కూచిగా తయారుచేసిన తల్లిగారు రాబోయే కోడలిమీద కక్ష తీర్చుకుంది వాండకు పల్కిన ట్టే!

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu Chetty Street, Madras-1. Chief Editor, S. Sambhu Prasad.




"సమ్మతన్రోహులు"లో చంద్రకళ.

Regd No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.



తియ్యని పాట

ఏడవకు ఏడవకు వెఱ్ఱి నా తండ్రి
ఏడిస్తే నీ కళ్లు నీలాలు కారు
న్యూట్రిన్ మిఠాయిలు నీకు తినిపిస్తా
న్యూట్రిన్ టాఫీలు నీకు కొనిపిస్తా
షాలైన కారవే బంగారు కనులు
న్యూట్రిన్ మిఠాయిలు చాలా రకాలు
టాఫీలు, క్యాండీలు, మరియెన్నో వున్నాయ్
నీ కోసమా తీపి తెస్తాడు చెవలాయ్



NCM-17 TEL

nutrine

న్యూట్రిన్ కన్ఫెక్షనరీ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, చిత్తూరు (ఆం.ప్ర)